Mazaahib-e-Alam Aur Islam
(Telugu)

ప్రపంచ మతాలు
ఇస్లాం

మూలం:
మతీన్ తారిఖ్ బాగ్‌పతి

అనువాదం:
ఇఖ్బాల్ అహ్మద్

విషయసూచిక

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

ప్రపంచ మతాలు - ఇస్లాం

మతం పుట్టుక

ఈ ప్రపంచంలో మానవులూ ఉన్నారు, పశుపక్ష్యాదులూ ఉన్నాయి. కాని మనిషిలో, పశువులో ఉన్న తేడా ఏమంటే పశువులు మేత మేస్తాయి. నీరు త్రాగుతాయి. తమ శారీరక అవసరాల్ని తీర్చుకుంటాయి, చనిపోతాయి. సృష్ట్యాది నుండీ నేటి వరకూ వాటి జీవితం ఒకే తీరులో గడిచిపోతోంది. ఇందులో ఎటువంటి మార్పూ లేదు.

మనిషి తింటూ, త్రాగుతూ తన శారీరక అవసరాల్ని తీర్చుకోవడానికి కృషి చేస్తాడు. దాంతోపాటు తన బుద్ధిని ఉపయోగించి తన ఉనికి, తన సృష్టి, తన పరిసరాలలోని వస్తువులను గమనిస్తాడు. వీటిని ఎవరు తయారు చేశారు? నా ఉనికికి మూలకారణం ఏమిటి? ఈ గాలి, వర్షం, వెలుగు, విస్తరించివున్న ఈ విశ్వం, దాని సృష్టి, నిర్మాణాల వెనుక ఎవరి హస్తం ఉంది? అని ఆలోచిస్తాడు మనిషి.

వర్షాలు కురిసినప్పుడు, గాలులు వీచినప్పుడు, తుఫానులు వచ్చి నప్పుడు, అగ్నిపర్వతాలు బ్రద్దలయినప్పుడు మనిషి ఎంత నిస్సహాయు డవుతాడు? క్షణాలలో అతని కోరికలన్నీ మట్టిలో కలుస్తాయి.

ఇటువంటి దృశ్యాలు కన్పించినపుడు మనిషిలో అసహాయతా భావన ఆది నుండే కలుగుతూవుంది. కొందరిలో ఈ భావాలోచనల కారణంగా మనిషి మస్తిష్కంలో ఏదో ఓ గొప్ప శక్తి ఉందనే తలంపు కలగడం, ఉద్దేశ్య పూర్వకంగానో లేదా అనుకోకుండానో ఆ మహోన్నత శక్తిని అంగీకరిస్తున్నాడు; ఆ శక్తిని బ్రతిమలాడటానికి, ప్రసన్నం చేసుకోవడానికి అతడు గోచరించని ఆ శక్తి ఎదుట తన భక్తిని ప్రదర్శిస్తున్నాడు; ఆ శక్తికిగల బల సంపన్నతను

ఊహించుకుని దాని ఎదుట కష్టాలు కడతేర్చమని చేతులు జోడించాడు. సృష్టి ప్రారంభం నుండి ప్రతిజాతిలో ప్రతికాలంలో ఈ భావన చోటు చేసుకుంది. అజ్ఞానం, నిరక్షరాస్యతలు తమలో ఉన్నప్పటికీ ప్రజలు తమకన్నా ఓ గొప్ప శక్తి తప్పక ఉందని భావించారు. ఈ భావనే చివరికి మతానికి పునాది వేసింది అని వాదిస్తారు.❖

మతం - పరిచయం

మనిషిని నైతిక పరిధి నుండి మరియు సుందర సమాజం నుండీ బయటకు రానీయని శక్తే మతం. మానవుడు విభిన్న భావనలతో పుట్టాడు. అందులో మతభావన కూడా ఉంది. ఇది సహజసిద్ధమైన భావనే. అంటే మతభావన మానవుని అంతఃచేతనలో ఉన్న సహజభావన అన్నమాట. కాబట్టి మతభావన పట్ల స్పృహఉన్నా లేకపోయినా, అతను ఈ వాస్తవాన్ని అంగీ కరించక తప్పడం లేదు. దానివల్ల ఎంతో పవిత్రమైన, బలీయమైన, అసాధా రణ విజ్ఞతావివేచనలకు నిలయమైన, సృష్టికి మూలకారణమైన అగోచర శక్తిపట్ల అతనికి నమ్మకం కలుగుతుంది. సృష్టిలోని ప్రతిదానికీ ఆ అగోచరశక్తి నుండే ఆహారం, ఉపాధి వనరులు మొదలైన సకల జీవితావసరాలు ఒన గూడుతున్నాయి. ఆ శక్తికి ప్రతి సృష్టితం బాగా గురించి తెలుసు, దానికి సకల సృష్టిరాసులపై, సమస్త విషయాలపై పూర్తి అధికృత ఉంది.

మతం ఘనత

మతం యొక్క యదార్థత దీనినిబట్టి స్పష్టంగా వ్యక్తం అవుతోంది. ఎంతో జ్ఞానం, అన్వేషణల తర్వాత కూడా పరిష్కారం లభించని విషయాలను మతం సులభంగా పరిష్కరిస్తుంది. కొన్ని విషయాల పరిష్కారం సాక్ష్యం ద్వారా కాక నమ్మకం ద్వారా లభిస్తుందన్న విషయం మనకు తెలుసు. మతం

❖ ఇస్లామీయ దృక్పథంలో దైవవాణి ఆది నుండే మానవునికి మార్గదర్శనం చేస్తూవస్తోంది. అతడ్ని భువిలో పుట్టించి దారితప్పి తిరగడానికో, భ్రమల్లో, ఊహాగానాలలో మునిగిపోవడానికో విడిచిపెట్టలేదు. భూమిపై పంపబడిన ఆదిమానవుడు కూడా దైవబోధనల భాగ్యంతోనే పంపబడ్డాడు.

మనిషిలోని నమ్మకాన్ని పటిష్టపరచి సామాజిక బంధాన్ని దృఢతరం చేస్తుంది. జీవితం గడపడానికి సమగ్రమయిన వ్యవస్థను అందజేస్తుంది. ఈ వ్యవస్థ జీవితంలోని ప్రతి రంగానికీ ప్రత్యేక సూచననిస్తుంది. ప్రొఫెసర్ వైట్ హెడ్ మతాన్ని ప్రశంసిస్తూ ఇలా అన్నాడు:

"విశ్వాసానికి శక్తి మతమే. దానివల్ల మనిషికి అంతర్గత పరిశుభ్రత లభిస్తుంది. మతం సత్యాల సమూహం. మానవ గుణగణాల్లో విప్లవం పుట్టించగలిగే శక్తివుంది దానిలో. అయితే వాటిని చిత్తశుద్ధితో అంగీ కరించాలి. దూరదృష్టితో గ్రహించాలి."

"మతం మనిషిని సమాజంలో ఉండటానికి యోగ్యునిగా తయారు చేస్తుంది. నిరాశా స్థితిలో అతడికి ధైర్యం కలిగిస్తుంది. అతనిలో విధి నిర్వహణ ఉత్సాహం రేకెత్తిస్తుంది. మనిషిని మనిషి ప్రేమించేలా ప్రోత్సహిస్తుంది. మతం ప్రాతిపదికనే మనిషి మరణానంతర జీవితంపై ఆశలు పెంచుకుంటాడు. మనిషి మతనియమాలను అంగీకరించి పాపభీతి, సదాచార భావనలతో జీవితం గడిపితే అతనికి నిజమైన మనశ్శాంతి లభిస్తుంది. ఒకవేళ దుష్కార్యాలు, దోపిడీ, దగా, మోసా లతో గడిపితే ఈ లోకంలోనే అతడు నేరస్థుడిలా ప్రజల దృష్టి నుంచి తప్పించుకుని తిరుగుతుంటాడు. మనిషిని ఈ దుస్థితి నుండి కాపాడే మార్గమే మతం.

పై పంక్తులద్వారా మతం మానవ జీవితానికి ఎంతో అవసరమని తెలుస్తోంది. కొందరి అభిప్రాయం ప్రకారం, విశ్వంలోని సమస్త లోకాలు, భూమి, ఆకాశం, మానవులు, జంతువులు, సృష్టిలోని ఇతర అనేక వస్తువులు తమంతట తామే ఉనికిలోకి వచ్చాయని, వాటిని ఎవరూ తయారు చేయ లేదని, వాటి ఉనికి వెనక ఒక పథక రచనగాని, లక్ష్యంగానీ లేవు; మనుషులు ఇలాగే పుడుతుంటారు, గిడుతుంటారు. కాని ప్రముఖ తత్వవేత్త షఖ్సే తన అభిప్రాయం ఇలా వెలిబుచ్చారు:

"మతాన్ని వ్యతిరేకించేవారికి దేవుని ఉనికి అసాధ్యం అని నిరూపించ డానికి ఏవిధమైన గట్టి ఆధారం ఈనాటి వరకూ లభించలేదన్నది

వాస్తవం. మతాన్ని త్రోసిపుచ్చడంలో ఏమాత్రం వెనకాడనివారు కూడా ఏదో ఒక తత్వపంథాను అనుసరిస్తున్నారు. ఆ తత్వపంథాయే వారి మతం. మతాన్ని బహిరంగంగా వ్యతిరేకిస్తూ సృష్టికర్త, సర్వాధికారి అయిన దేవునిపట్ల ఏమరుపాటుకు గురయిన మనిషికూడా కష్టాలు ఎదురయినప్పుడు అనుకోకుండా తాను వ్యతిరేకిస్తున్న దైవాన్నే వేడుకోవడం చాలామందికి తెలిసిందే."

మతం ప్రకృతి విరుద్ధం కాదని చెప్పడానికి ఇంతకంటే గొప్ప ప్రమాణం మరేదీ ఉండదు. మానవ నాగరికతాభివృద్ధితో పాటు అజ్ఞానం కూడ అప్పు డప్పుడు తన మహత్తును చూపిస్తుందని దీన్నిబట్టి స్పష్టంగా తెలుస్తోంది!

విశ్వంలో అనుక్షణం సంభవించే మార్పులు మానవుడ్ని తమ వైపునకు ఆకర్షించాయి. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, గాలి, వానా, రుతువుల మార్పులు అతనికి ఒక్కోసారి ప్రయోజనం, మరొక్కోసారి హాని కల్గించేవి. ప్రయోజనం కలిగిన సందర్భాలలో అతడు వాటిని ప్రశంసించేవాడు. హాని జరిగినప్పుడు వాటిపట్ల భయపడటం కూడా జరిగేది. అంచేత అతడు ప్రకృతి శక్తుల్నీ, ఆకాశంలోని ఇతర వస్తువుల్ని ఆరాధించేవాడు. మరోమాటలో చెప్పాలంటే మానవుడు అజ్ఞానకాలంలో ఏది కాస్త అద్భుతంగా, శక్తిమంతంగా కనిపించినా లేక ఎలాంటి లాభంగాని నష్టంగానీ కలిగించేవిగా తోచినా వాటి ఎదుట తలవంచాడు. ఈ విధంగా అతడు జంతువుల్ని, నదుల్ని, పర్వ తాల్ని పూజించసాగాడు. భూమినీ, అగ్నినీ, సూర్యచంద్రుల్నీ, వర్షాన్నీ ఆరాధించ సాగాడు. అతని అంతరంగం గోప్యమయిన, తెలియరాని శక్తుల వైపు మరలింది. అతడు వెలుగు, గాలి, ఆత్మ, ఊహాజనిత దేవతల భావనను అవలంబించి వాటి విగ్రహాలను తయారు చేసుకున్నాడు. ఈ విధంగా విగ్రహారాధన, వాటి ఎదుట తన భక్తిప్రపత్తులను ప్రదర్శించే ఆచారం మొదలయింది. అంతేగాని దైవికశక్తి భావన ఎన్నడూ లోపించలేదు. అణువు మొదలు సూర్యుని వరకు, మానవుడు మొదలుకుని అల్పప్రాణి వరకూ బ్రహ్మాండమైన విశ్వవ్యవస్థలో బంధించబడివుండటం అతడు చూస్తున్నాడు. కాబట్టి విశ్వవ్యవస్థ వెనుక ఏదో ఓ గొప్పశక్తి ఉందని, అదే ఈ విశ్వాన్నంతటినీ

నడిపిస్తోందని గ్రహించి అతడా గొప్ప శక్తి ఎదుట తలవంచాడు; దాంతోపాటు చిన్నచిన్న ఊహాజనిత దేవతల్ని కూడా పూజించసాగాడు.

మధ్యేమార్గం

నేటికీ ప్రపంచంలో అనేక మతావలంబీకులు ఊహాజనిత దేవతలను, విగ్రహాలను పూజిస్తున్నారు. విజ్ఞానాభివృద్ధి సాధించినా దేవుని అవతారాల విశ్వాసం నుండి తమనుతాము వేరుచేసుకోలేకపోయారు. ఒక మనిషి ఇంత పెద్ద సృష్టివ్యవస్థ రాత్రింబగళ్ళు నడవడం చూస్తున్నాడు. కాని దాని సృష్టికర్త, నిర్వాహకుడు ఎవరో మాత్రం అతను ఎరుగడు. మౌలానా మౌదూదీ (రహ్మలై) చెప్పినట్లుగా చీకట్లో దారితప్పిన వాడిలా అతని చెయ్యి దేనిమీద పడితే దానినే దైవంగా చేసుకోవడం జరిగింది. దైవదూతలు, భూతాలు, ఆత్మలు, నక్షత్రాలూ, గ్రహాలు, సజీవులు, నిర్జీవులు అయిన మానవులు, వృక్షాలు, పర్వతాలు, జంతువులు, నదులు, భూమి, అగ్ని, గాలి అన్నింటినీ దేవతలుగా చేసుకున్నారు. ఇవేకాక లక్ష్మి, శక్తి, కామం అన్నింటికీ దైవత్వాన్ని ఆపాదించాడు. అంతేగాక మనసుకు తోచిన విధంగా విగ్రహాలు చెక్కాడు. ఉదాహరణకు నరసింహుడు, యమదూత, చతుర్ముఖుడు, సహస్రబాణువు... అన్నింటి విగ్రహాలు తయారుచేసి పూజలు ఆరంభించారు. ఈ భావనలపైనే మత పునాది లేపారు.

ఇస్లాం దృష్టిలో దైవత్వభావన

వివిధ విశ్వాసాల ఈ సమూహంలో ఇస్లాం దృక్పథం ప్రకారం, ఈ సృష్టివ్యవస్థ నిర్మాత ఒకే సృష్టికర్త, అందరికంటే గొప్పవాడు, ఆయనే మనిషిని సృజించాడు, అతనితోపాటే అతని అవసరాలు తీర్చే సామగ్రినీ పుట్టించాడు; గాలి, నీరు, వేడి, వెలుగు, తల్లిస్తనాలలో పాలు, చెట్లకు అనేకరకాల పూలు, పళ్ళు, పొలాలలో పంట మొదలైన వస్తువులన్నీ ప్రతి కాలంలో, ప్రతి దేశంలో మానవుడికి లభించాయి.

ఒక విషయం ఆలోచించాలి. ఏ దైవం ప్రజల అవసరాలు తీస్తున్నాడో, తినే, త్రాగే, ధరించే, చలి-వేడి నుండి కాపాడుకోవడానికి ఇన్ని ఏర్పాట్లు చేశాడో ఆ దైవం మనిషికి ధర్మం నైతికతల బోధనకు కావలసిన ఏర్పాట్లు చేయక పోవడం, అతనికి తన ప్రభువు కోరుతున్నదేమిటో, ఆయన అభీష్టం ప్రకారం జీవితం గడిపే విధానం ఏమిటో, ఏ విషయాలవల్ల ఆయన సంతోషి స్తాడో, ఏవి ఆయనకు ఆగ్రహం కలిగిస్తాయో తెలుపకపోవడం అనేది జరగని పని. నిజానికి మనిషికి అన్నింటికన్నా గొప్ప అవసరం ఈ విషయాలే.

దేవుడు మనిషికి, అతని శారీరక అవసరాలతోపాటు, ఆధ్యాత్మిక అవసరాలను కూడా ఏర్పాటు చేశాడని ఇస్లాం అంటోంది. దైవంచే ప్రపంచానికి పంపబడ్డ ఆదిమానవుడు హితబోధ పొందినవాడు మాత్రమే కాదు, దైవ ప్రవక్త కూడాను. ఆయన తర్వాత కూడా మానవ జాతిలో ఇలాంటి ఉత్తమ గుణాలుగల మానవులు అప్పుడప్పుడూ పుడుతూ వచ్చారు. వారు ప్రజలకు ధర్మాన్నీ, నైతికతను బోధించారు. సరైన జీవితం గడిపే విధానం తెలియజేశారు. మనం దైవానికే దాసులం అనీ, మిమ్మల్ని ఆయన దాస్యం వైపునకు పిలుస్తున్నాం అని వారు పలుమార్లు పలికారు.

ఇస్లాం దృక్పథం ప్రకారం, అందరికంటే మొట్టమొదటి మానవుడు హజ్రత్ ఆదమ్ (అలై) అంతిమ దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లం) వరకూ వచ్చిన దైవ ప్రవక్తలంతా ప్రజలను ఒకే ధర్మం వైపు ఆహ్వానించారు. అల్లాహ్ తప్ప ఆరాధనకు మరెవరూ అర్హులుకారు అనేదే ఆ ధర్మం.

కాని మనిషి నైజంలోని వక్రత చూడండి, మనిషి ఈ సందేశానికి, దైవ ప్రవక్తలకు వ్యతిరేకంగా కూటమిని ఏర్పరచాడు. అల్లాహ్ దాస్యాన్ని తిరస్కరించాడు. కొన్ని సందర్భాలలో అయితే ప్రవక్తను కూడా దాసుని స్థాయి నుండి తీసి దైవత్వపీఠంపై కూర్చోబెట్టాడు. ఒక్కోసారి సాధారణ వస్తువుల్ని, చివరికి క్షుద్ర వస్తువుల్ని సైతం దైవ సమానులుగా చేసుకున్నాడు. మరి కొందరయితే మతాన్నే తిరస్కరించి మనోవాంఛలకు బానిసలయ్యారు. క్రమ క్రమంగా షైతాను వారి నెత్తికెక్కాడు. హింసా దౌర్జన్యాలకు, స్వార్థానికి, అహంకారానికి గురయ్యాడు. బహుదైవారాధనా ఊబిలో, కొత్త మతపోకడల

రొచ్చులో కూరుకుపోయాడు. కుటిలత్వం, స్వార్థపరత్వాలతో కొత్తకొత్త మతాలకు పునాలు వేశాడు. దీనినే ఇస్లాం 'కుఫ్ర్' అంటుంది. అంటే సత్యాన్ని కావాలని కప్పిపుచ్చి దైవదాస్యాన్ని తిరస్కరించడం అని అర్థం.

కాని స్వాభావికంగా సద్గుణసంపన్నులు, సాధుశీలురయిన ప్రజలు దైవ ప్రవక్తల బోధనలకు అనుగుణంగా తమనుతాము సంస్కరించుకున్నారు. అంతేగాకుండా తమ సంతానాన్ని, సమాజాన్ని కూడా సంస్కరించి నీతి న్యాయాలతో పుడమిని సుందరవనంగా మలిచే ప్రయత్నం చేశారు. ఈ సందేశం, హితబోధనలు చివరిసారిగా పరిపూర్ణ రూపంలో అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లం) ద్వారా మనకు చేరాయి. ఈనాటికీ అవి యథాతథంగా వున్నాయి. దైవం తలిస్తే ప్రళయందాకా సురక్షితంగా వుంటాయి. ముక్తసరిగా చెప్పాలంటే ఈ సువిశాల విశ్వంలో దేవుడు మానవుల్ని ఊరికే వదలివేయలేదు. ప్రవక్తల ద్వారా పాపపుణ్యాల మార్గం కూడా చూపాడు. కనుక మానవుడు కావాలనుకుంటే వాటిద్వారా జీవితసారం గ్రహించి అత్యున్నత స్థానానికి చేరుకోవచ్చు. లేదా చీకట్లలో తచ్చాడుతూ వుండపచ్చు.

వివిధ ప్రపంచ మతాలు

హిందూ మతం

ఇది భారతదేశపు ప్రాచీన మతం. చారిత్రకంగా దీని ప్రాచీనతను ఆర్యులు భారతదేశంలో ప్రవేశించినప్పటినుండి నిర్ణయించ వచ్చు. అప్పట్లో వారి మత భావనలు సాదాసీదాగా వుండేవి. ఇక్కడకు వచ్చిన తర్వాత వీరు ప్రాచీన భారతీయుల మత భావనల ప్రభావానికి లోనుకాక తప్పలేదు. ఇక్కడి వాతావరణం, ఎత్తయిన పర్వతాలు, తుఫానులు, కుండ పోత వర్షాలు, భయంగొలిపే ఉరుములు మెరుపులను చూసి మనిషి కంపించిపోయేవాడు. అంచేత ఇవన్నీ ఆర్యుల మత భావనలపై ప్రభావం వేశాయి. అవి కూడా వారి విశ్వాసాలలో భాగం అయిపోయాయి. వారు మొదటి నుండే కొన్ని దేవతల్ని వారు పూజిస్తూ వచ్చేవారు. ఇక్కడకు వచ్చిన తరువాత అదనంగా మరికొందరు దేవతల్ని పూజించనారంభించారు.

ఆర్యుల దేవతలు

సృష్టి కార్యాలకు దేవతలే మూలకారణం అని ఆర్యులు భావిస్తారు. అంటే దేవతలు దైవికశక్తికి ప్రత్యమ్నాయ శక్తులనీ, వారు సాధారణ మానవుల కంటే ఉత్తమ స్థాయికి చెందినవారని అర్థం. కనుక విశ్వ నిర్వహణలో, మానవ జీవిత గమనంలో వారు ప్రముఖ పాత్ర వహించేవారుగా పరిగణించ బడ్డారు. అందువల్ల పూజలు, జంతుబలులద్వారా వారిని ప్రసన్నం చేసు కోవడం; సముచితమైన ఆచారాలు, నిష్ఠలు, దీక్షలద్వారా వారి ఆగ్రహాన్ని తగ్గించి శాంతింపచేయడం తప్పనిసరి అయిపోయింది. ప్రతి దేవతకూ ఓ ప్రత్యేక పూజారి వర్గం వుండేది.

దేవతల గాథలతో వైదిక దేవతల గాథావళి నిండివుంది. ఆ దేవతలలో కొందరు ఆకాశంలో, మరికొందరు వాతావరణంలో ఉండేవారు. వరుణుడ్ని అందరికన్నా గొప్ప దేవతగా భావించేవారు. భూమి, చంద్రుడు, సూర్యుడు, గాలి, సముద్రాలు, పర్వతాలు, మాత్రమేకాక గుర్రాల్ని, గోవుల్ని, పాముల్ని, పురుగుల్ని కూడా వేడుకునేవారు. అయితే వాటితోపాటు సర్వశక్తిని, ఆదిశక్తిని కూడా నమ్మేవారు. మరో వైపు ఆ శక్తికి మూడు రూపాలున్నాయని నమ్మేవారు. నేటికీ ఈ భావన యధాతథంగా వుంది. ఆ రూపాలు ఇలా ఉన్నాయి:

1) బ్రహ్మను సృష్టికర్తగా భావిస్తారు.

2) విష్ణువును పోషకుడిగా, సంరక్షకుడిగా నమ్ముతారు.

3) మహేశ్వరుణ్ణి వినాశకారిగా పరిగణిస్తారు.

వీరుకాక ఇంకా ఇతర దేవతల సుదీర్ఘ జాబితావుంది. వీరిని ఈశ్వరుని రూపాలుగా భావించి పూజిస్తారు. ఉదాహరణకు:

సూర్యుడు: సూర్యుడు ఉదయించగానే చీకట్లు మాయమవుతాయి. అతని వేడిమివల్ల పండ్లు పూలు వృద్ధిచెందుతాయి. అంచేత అతడ్ని స్తుతిస్తూ అనేక శ్లోకాలు వెలువ ్ యి. హిందువులు సూర్యుడ్ని పూజిస్తారు.

ఉషస్సు: ఇదే విధంగా సంధ్యాసమయం దృశ్యం ఎంతో ఆహ్లాద కరంగా, మనోహరంగా వుండటంవల్ల ఉషస్సును ఒక సుందర వధువుగా వర్ణించి పూజిస్తారు.

అగ్ని: అగ్ని వలన మనిషి అవసరాలు ఎన్నో తీరుతాయి. అంచేత దాన్ని కూడ దేవతగా భావించి పూజిస్తారు.

ఇంద్రుడు: ఇంద్రుని వలనే వర్షాలు కురుస్తాయని, పంటలు పండుతాయని ఆర్యుల అభిప్రాయం. కనుక ఇంద్రుడ్ని కూడా పూజించడం అవసరమయింది. ఈనాటికీ ఈ ఆచారం కొనసాగుతోంది. అలాగే గాలి, సరస్వతి వగైరా ఎందరో స్త్రీ పురుష దేవతలను ప్రశంసిస్తూ అనేక రచనలు ఉన్నాయి. వారిని పూజించే ఆచారం పురాతన కాలం నుండీ కొనసాగుతోంది.

శక్తి పూజ: ఆర్యులు యుద్ధానికి ముందు, యుద్ధంలో విజయం సాధించిన తరువాత వేడుకలలో శక్తిపూజ పేరుతో కొందరు ప్రత్యేక దేవీదేవతల పూజ చేస్తారు. దాని పరంపర హరప్పా నాగరికత వరకూ సుదీర్ఘమయినది. అప్పట్లో మాతృదేవి పూజ జరిగేది. అది కూడా కొనసాగుతోంది. దానితోపాటు, ఉమ, భవాని, అన్నపూర్ణ, దుర్గ, కాళీ, చండీ దేవతల పూజ ఎంతో శ్రద్ధగా జరుగుతుంది. వాస్తవానికి ఇవి కల్పిత నామాలు. వీటిని మతంతో అనుసంధానం చేశారు. శివుని భార్య పార్వతిగా పిలువబడుతుంది. ఆమెనే 'ఉమ' అని కూడా అంటారు. ఆమెకు ఎన్నో గుణాలు వున్నాయి. వాటిలో ప్రతి గుణాన్నీ వివిధ రూపాలలో వ్యక్తం చేయడం జరుగుతోంది.

1) పార్వతిగా ఆమె ఒక సుందర స్త్రీగా, దయార్ద్ర హృదయంగల మాతగా కనబడుతుంది. అందువల్ల హిందువులు ఆమెను ప్రాణులపట్ల జాలిదలిచే, కనికరించే దేవతగా భావించి ఆరాధిస్తారు.

2) పార్వతికి చెందిన మరో గుణం దుర్గ రూపంలో వ్యక్తం అవుతూంది. సింహంపై కూర్చుని ఎంతో ఉగ్రరూపంలో కనబడుతుంది.

3) వేరొక రూపంలో ఆమె కాళికాదేవిగా కనబడుతుంది. ఈ గూపంలో ఆమెను కరవుకాటకాలు, భూకంపాలు, తుఫానులు, వరదల దేవతగా

భావిస్తారు. విగ్రహ రూపంలో ఆమె చేతిలో తెగిన మానవ శిరస్సు, మెడలో కపాలహారం వుంటాయి.

త్రిమూర్తులు: బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల్ని నేటికీ హిందువులు పెద్ద దేవతలుగా భావిస్తారు. ఈ ముగ్గురు దేవతల పూజారులు తమ దేవతను గొప్పదేవతగా భావిస్తారు. అంచేత ఈ తగవు తీర్చడానికి ముగ్గురు దేవతల్ని కలిపి త్రిమూర్తులుగా రూపమివ్వబడింది. ఒకే శరీరానికి మూడు వేర్వేరు తలలు వుంటాయి. ఈ అవతారాన్ని నిజదేవుడిగా భావించి స్త్రీలు, పురుషులూ, పిన్నలూ, పెద్దలు అందరూ ఆయన్ని పూజిస్తారు. కోర్కెలు తీర్చమని మొక్కుకుంటారు.

బ్రాహ్మణుల స్థాయి

ఆర్యులు భారతదేశానికి వచ్చిన తర్వాత ఆర్యేతరుల మత భావనలకు ప్రభావితులయి వారు కూడా వృక్షాల్ని, సర్పాల్ని, జంతువుల్ని పూజించడం ఆరంభించారు. కాలక్రమేణా యజ్ఞాలు, తపస్సులపై అధిక శ్రద్ధ వహించ సాగారు. యజ్ఞాలు, తపస్సు, మంత్ర తంత్రాలనే మోక్ష సాధనాలుగా భావించారు. విద్యావంతులైన బ్రాహ్మణులే మోక్షద్వారం దాకా తీసుకుపో గలరన్న అభిప్రాయం ఏర్పడింది. బ్రాహ్మణులకు పురాతన కాలం నుండే మతపెద్దల హోదా వుంది. హిందూసమాజంలో కులమతాల ధ్వజవాహకుడిగా భావించబడిన మను మహారాజు "కులపరంగా, మతపరంగా బ్రాహ్మణుడు కూడా ఒక దేవతని, ఇలవేల్పు అని, అతడు చెప్పే ప్రతిమాటా వేదవాక్కు లాంటిదని" పేర్కొన్నాడు. అప్పటి నుంచీ సమాజంలో బ్రాహ్మణులు, పురో హితులు, ఋషులు, మునుల హోదా పెరగనారంభించింది. మత విష యంలో మంచి చెడులన్నిటికీ వారే ప్రధాన కర్తలుగా భావించబడ్డారు.

హిందువుల పవిత్ర గ్రంథాలు

హిందూ మతంలో మతగ్రంథాలు అధిక సంఖ్యలో వున్నాయి. వాటిలో వేదాలకు అగ్రస్థానం ఉంది.

వేదాల లక్ష్యం ప్రజలకు మతపరమైన ఆరాధనలు, ఆచారాలు విధానాలు నేర్పడం, దేవతల్ని ప్రసన్నం చేసుకోవడానికి కావలసిన మంత్రాలు, యంత్రాలను గురించి శిక్షణనివ్వడం. కనుక ఆ కాలంలో ఋషులు, మునులు దేవతలను ప్రసన్నం చేసుకునేందుకు చేసిన భజనల్ని పండితులు వైదిక కర్మలని పేరు పెట్టారు. తర్వాత వాటిని వేదపాఠాలలో చేర్చారు.

వేదాలు నాలుగు

1) **ఋగ్వేదం:** ఇందులో ఈశ్వరీయ జ్ఞానం, ఆర్యుల ప్రాచీన మతం, నియతి, సామాజిక పరిస్థితులను గూర్చి వివరించటం జరిగింది.

2) **సామవేదం:** గానాలు చేయవలసిన పద్ధతులు, శ్లోకాలు చదవడం గురించి ఇందులో చర్చించబడింది. గానాల ప్రారంభం సామవేదం నుండే ప్రారంభమయినట్లు తెలుస్తోంది.

3) **యజుర్వేదం:** ఇందులో ఆర్యుల వర్ణవ్యవస్థ వివరించబడింది. జాతుల గురించి చెప్పబడింది.

4) **అధర్వణ వేదం:** ఇందులో మంత్రతంత్రాలు, భూతప్రేతాలు, వశీకరణ, చేతబడుల విద్య గురించి వుంది.

వేదాలకు జ్ఞానం లేదా ఆకాశ విద్యలుగా అర్థం చెప్పబడింది. ఋగ్వేదం రచనా కాలం క్రీ.పూ. 500వ సంవత్సరం నుండి క్రీ.పూ. 1000 సంవత్సరంగా చెప్పబడింది. ఆ తర్వాతి 200 సంవత్సరాలలో మరిన్ని వేదాల సంకలనం జరిగింది. ఋగ్వేదం వెయ్యి భజనలు, లేదా రాగాలతో కూడివుంది.

మహాభారతం: ఇది సంస్కృత గ్రంథం. వ్యాసుడు దీని రచయిత. ఇందులో కౌరవ పాండవుల యుద్ధం గురించిన వర్ణన ఉంది. పాండవుల దేవత అయిన కృష్ణుడిని వాసుదేవుడుగా అంగీకరించడం జరిగింది. కృష్ణుడి సహకారంతోనే పాండవులు యుద్ధంలో విజయం సాధించారు.

భగవద్గీత: మహాభారతంలో ముఖ్యభాగం భగవద్గీత. మతపరంగా ప్రముఖ స్థానం దీనికుంది. ఇందులో కృష్ణుడిని మానవ రూపంలోని దైవంగా

పేర్కొనబడింది. ప్రపంచంలో అధర్మం వ్యాపించినప్పుడల్లా దేవుడు అవతారాలు ఎత్తి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తాడని పేర్కొనబడింది. రాముడ్ని, కృష్ణుడ్ని అదే భావంలో విష్ణువు అవతారాలుగా భావించారు. కొందరు వారిని విష్ణువుగా భావించి పూజిస్తారు. గీతలో అర్జునుడు యుద్ధం చేయడానికి తిరస్కరించినప్పుడు కృష్ణుడు చేసిన ఉపదేశం ముఖ్యమైనది. "రాజ్యంకోసం సోదరులతో, బంధువులతో నేను యుద్ధం చేయడం భావ్యం కాదు" అన్నది అర్జునుడి అభిప్రాయం. "కాని సోదరులే అన్యాయానికీ, దౌర్జన్యానికీ పాల్పడినప్పుడు వారితో యుద్ధం చేయడం ఎంతమాత్రం పాపం కాదు, పైగా అది ఎంతో అవసరం కూడా, తద్వారా ప్రపంచంలో హింసాదౌర్జన్యాలు అంతం కావాలి" అన్నాడు కృష్ణుడు.

రామాయణం: ఇందులో కూడా ఒక ప్రాచీన గాథ వుంది. మొదట దీనిని సంస్కృతంలో వాల్మీకి ఋషి రచించాడు. తర్వాత అక్బర్ కాలంలో తులసీదాసు గేయరూపంలో రచించాడు. హిందువులందరూ దీనిని ఆసక్తిగా చదువుతారు. ఇందులో ఇరవై వేల శ్లోకాలు వున్నాయి. వాటిల్లో శ్రీరామచంద్రుని వనవాసం గురించి వర్ణించబడింది. శ్రీరాముని భార్య అయిన సీతను లంకాధీశుడైన రావణుడు అపహరించి తీసుకుపోగా శ్రీరాముడు అతడ్ని జయించి సీతను తీసుకొస్తాడు. పధ్నాలుగు ఏళ్ళ వనవాసం తర్వాత తన దేశం అయోధ్యకు తిరిగి వస్తాడు. ఈ గాథలో శ్రీరామచంద్రుని పితృవాక్య పాలన ఆదర్శవంతమయినది.

వీటితోపాటు పురాణాలు, ఉపనిషత్తులు, మనుస్మృతి కూడ మత గ్రంథాలుగా భావించబడుతున్నాయి. ఈ గ్రంథాలన్నీ సంస్కృతంలో వున్నాయి.

ఉపనిషత్తులు: వీటికి కూడ హిందువుల మతగ్రంథాలలో గొప్ప స్థానం ఉంది. ఉపనిషత్తుల సిద్ధాంతం సర్వసంగపరిత్యాగులయిన సన్యాసులకోసం వచ్చాయి. వీటిలో కులవ్యవస్థను త్రోసిపుచ్చడం జరిగింది. ఉత్తములు, నీచులు అన్న విచక్షణ లేకుండా ప్రజలు వీటిద్వారా మోక్షం పొందే మార్గం సూచించబడింది. నైతికతకు, సత్కార్యాలకు పెద్దపీట వేయబడింది. మనుస్మృతి మాత్రం దీనికి పూర్తిగా విరుద్ధం.

ఈ గ్రంథాలన్నింటినీ పరిశీలిస్తే వేదకాలంలో మానవుడు భయపడే ప్రతిదానినీ ఆరాధ్య దైవంగా చేసుకోవడం జరిగిందని అర్థమవుతోంది. భూమి, చంద్రుడు, సూర్యుడు, సముద్రాలు, పర్వతాలేకాక, గుర్రాలు, గోవులూ తదితర జంతువులను కూడా మొక్కుకునేవారు. అయితే ఒక ఆదిశక్తి, సర్వశక్తి భావన కూడా వుండేది. మరోవైపు దానికి మూడు రూపాలున్నాయని కూడా భావించేవారు. నేటికీ వాటిని ఈశ్వరుని రూపంలో ఆరాధిస్తున్నారు.

పునర్జన్మ: చనిపోయిన తర్వాత తిరిగి మరో ప్రాణిగా పుట్టడం అనే విశ్వాసాన్ని పునర్జన్మ అంటారు. వేదకాలంలో ఈ విశ్వాసం వుండేది కాదని వేదాల అధ్యయనంవల్ల తెలుస్తోంది. అయితే మనిషి మరణించిన తర్వాత ఆత్మ మిగిలివుంటుంది (ఆత్మకు చావులేదు). దానికి తిరిగి మరోసారి ప్రపంచానికి రావలసిన పనిలేదని మాత్రమే వేదాలలో ఉంది. కాని తర్వాతి కాలంలో పునర్జన్మవిశ్వాసం ఉనికిలోకి వచ్చింది. మనిషి చనిపోయిన వెంటనే అతని కర్మఫలం దొరకడం ఆరంభమవుతుందని, ఆ కర్మలలో లోపంవల్ల రెండోసారి మూడోసారి జన్మనెత్తాల్సి వస్తుందని, ఇలా అతడు పుడుతూ గిడుతూ వేల సార్లయినా జన్మిస్తూ ఉంటాడని హిందువులు నమ్ముతారు. అంటే మనిషి ఒక జన్మలో పాపాలుచేస్తే, మరోజన్మలో ఎద్దుగా, కుక్కగా, తేలుగా, లేదా మరో ప్రాణిగా పుట్టవచ్చు. ఆ తర్వాత జన్మలో కూడా మరో విధమైన ప్రాణిగా పుట్టవచ్చు. ఇలా ఈ పునర్జన్మ పరంపర ఎన్నటికీ అంతం కాదు.

వర్ణాశ్రమం: నేటికి దాదాపు నాలుగు వేల ఏళ్ళ క్రితం ఆర్యులు మధ్య ఆసియా నుండి భారతదేశానికి వచ్చి, ఇక్కడి స్థానిక ప్రజలపై ఆధిక్యత సాధించారు. ఈ ఆధిక్యతతో లబ్ధి పొంది వారిని బానిసలుగా చేసుకున్నారు. పునర్జన్మ సిద్ధాంతం ప్రకారం, భారతదేశంలోని ఆర్యేతరులు తమ పూర్వ జన్మలో పాపాలు చేసుకున్నారుగనక వారు శూద్రులుగా, నీచులుగా ఉండవలసివచ్చింది.

మనుస్మృతిలో పేర్కొన్నట్లు బ్రహ్మ ప్రపంచ వ్యవస్థ నడపడానికి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు అనే నాలుగు జాతుల్ని ఏర్పరచాడు.

వారిలో బ్రాహ్మణుడ్ని తన నోటి నుండి పుట్టించాడు. క్షత్రియుడ్ని పార్శ్వం నుండి, వైశ్యుడ్ని తొడ నుండి, శూద్రుడ్ని పాదాల నుండి పుట్టించాడు. తర్వాత ఈ నాలుగు జాతుల విధుల్ని నిర్ణయించాడు. చదవడం, చదివించడం, మతకర్మల్ని నిర్వహించడం బ్రాహ్మణుల పని. రాజ్యపాలన, యుద్ధాలు చేయడం, దేశరక్షణకు కృషిచేయడం క్షత్రియుల బాధ్యత. వాణిజ్యం, వ్యవసాయం వైశ్యులు చేయవలసిన పనులు. కాని సృష్టికర్త శూద్రులకోసం ఒకే పనిని నిర్ణయించాడు. అది- మనస్సు, శరీరం, ధనాలతో ఈ మూడు జాతులకు సేవ చేయడం. (ప్రథమ అధ్యాయం-శ్లోకం: 78-91)

అందుచేతనే సమాజంలో ఆది నుండి శూద్రులు అధములుగా పరిగణించబడుతూ వచ్చారు. వారికి దేవాలయాలలో ప్రవేశం నిషిద్ధం. వారు ఊరి బయట నివసించాలని. అగ్రవర్ణాలు నడిచే దారి నుండి తప్పుకోవాలని మనుస్మృతిలో చెప్పబడింది:

"శూద్రులు పందులు, కుక్కల వంటివారు. కాబట్టి బ్రాహ్మణులు భోజనానికి కూర్చుంటే అటువంటి వారి కంటపడకుండా కూర్చోవాలి."

(తృతీయ అధ్యాయం-శ్లోకం : 339)

"శూద్రునికి మతం, ఆరాధనల గురించి నేర్పేవాడు ఆ శూద్రునితో సహా నరకానికి ఇంధనం అవుతాడు. చదువను, వ్రాయను నేర్చుకోవాలనే తలంపు కూడా మనసులో రానియ్యడానికి శూద్రునికి హక్కులేదు. శూద్రుడు రహస్యంగా ఎక్కడయినా వేదం విన్నట్లయితే అతడి చెవుల్లో సీసం కరిగించి పొయ్యాలి."

(నాలుగో అధ్యాయం)

"నీచ జాతివాడు ఎవరైనా అగ్రవర్ణుని సరసన కూర్చుంటే అతని నడుము మీద నిప్పుతో వాతలు పెట్టాలి. లేదా అతడి పిరుదుల్ని కోసేయాలి. అయితే అతని ప్రాణాలు మాత్రం పోకూడదు. సృష్టికర్త శూద్రుడిని బ్రాహ్మణుని సేవ కోసమే పుట్టించాడు." (తొమ్మిదవ అధ్యాయం-శ్లోకం: 281)

ఈ పరిస్థితి నాగరికత అభివృద్ధి చెందిన ఈ కాలంలోనూ వుంది.

జీవన వ్యవస్థ: ప్రశాంతంగా జీవించడానికి ఆర్యులు జీవితాన్ని నాలుగు భాగాలుగా విభజించారు:

1) **బ్రహ్మచర్య ఆశ్రమం :** ఇందులో 25 ఏళ్ళ వరకు గురువులకు శుశ్రూష చేసి, విద్యాభ్యాసం చెయ్యాలి.

2) **గృహస్థ ఆశ్రమం:** ఇందులో 25 ఏళ్ళు నిండిన తర్వాత వివాహం చేసుకుని బ్రతుకుబండిని ఈడ్చాలి. ఇతర సామాజిక కార్యాలను నిర్వర్తించాలి.

3) **వానప్రస్థ ఆశ్రమం:** ఈ భాగంలో 25 ఏళ్ళు తీర్థయాత్రలు చేస్తూ దేశసంచారం చెయ్యాలి.

4) **సన్యాసాశ్రమం:** ఈ భాగంలో 25 ఏళ్లు సన్యాస జీవితం గడపాలి. అడవులలో, కొండలలో నివసిస్తూ అవసానకాలం గడపాలి.

జీవన ఆశ్రమానికి చెందిన ఈ వ్యవస్థ గౌతమ బుద్ధుడి ఉద్యమం తర్వాత అంతరించిపోయింది. సర్వసంగపరిత్యాగులైన ఇటువంటి వారికోసం ఆయన మఠాలు నిర్మించాడు. దీనివల్ల సన్యాసం పుచ్చుకున్నవారు ఊరూరు తిరిగే శ్రమ లేకుండా ఒకే చోట ప్రశాంతంగా జీవితం గడపవచ్చు.

హిందూ మతంలోని శాఖలు

ఈ మతంలో మూడు ప్రసిద్ధ శాఖలు ఈవిధంగా ఉన్నాయి:

వైష్ణవ మతం:

వీరు విష్ణువును ఆరాధిస్తారు. వేదాలలో విష్ణువును "సూర్యదేవుని"గా పోల్చడం జరిగింది. ఇతడిని దయాగుణంగల దేవతగా భావిస్తారు. ఈ సంప్రదాయంలో కర్మలకు, భక్తికీ ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వబడింది. హిందువులలో ఏ శాఖను అవలంబించేవారైనా వీటిని పాటించవచ్చు. వైష్ణవులు హిందూ సమాజంలో కులవ్యవస్థను నిర్మూలించడానికి ఎంతో కృషి చేశారు.

వారు మతంలో సంస్కృత భాష ప్రాబల్యాన్ని అంతమొందించి మత ప్రచారంలో ధర్మబోధలకు స్థానిక భాషల్ని అలంబనం చేసుకున్నారు.

శైవ మతం:

శివుని ఉనికి కూడా వేదాలతో ముడిపడి వుంది. శివుడినిలయ కారునిగా భావిస్తారు. ఇతడి నివాసం కైలాసపర్వతం. ఈయన వాహనం నంది. ఈయనకు శంకరుడు అనే మరో పేరు కూడా వుంది. ఈయన శక్తి స్త్రీ పురుషుల జననాంగాల రూపంలో ప్రదర్శించబడుతుంది. అంచేత శివాలయంలో శివలింగం తప్పనిసరిగా వుంటుంది. ఇక్కడ లింగపూజ జరుగుతుంది. ఈ శాఖలో బ్రాహ్మణుల గొప్పదనాన్ని వర్ణించడంగానీ, వేదాలను అంగీకరించడంగానీ లేవు.

శాక్తేయ మతం:

భారతదేశ తూర్పు భూభాగంలో శివుడినే శక్తి దేవతగా భావించి పూజిస్తారు. శివుడు వేదకాలంలో రుద్రుడని, తర్వాతి కాలంలో మహేశ్వరుడని, ఉపనిషత్ కాలంలో మహాదేవుడని, ఆ తర్వాత పశుపతి అని అనేక పేర్లతో ప్రసిద్ధి చెందాడు. ఈ మతవర్గీయులు ఆత్మ, పదార్థాలతో యావత్తు విశ్వం ఉనికిలోకి వచ్చిందని నమ్ముతారు. యోగంద్వారా ఆత్మకు తత్వజ్ఞానం సిద్ధిస్తుందని, గురుశిక్షణద్వారా ఆత్మకు తానే దైవం అన్న జ్ఞానం కలుగుతుందని, ఈ విధంగా పారవశ్యం, తన్మయత్వాల స్థితిలోనే ఆత్మకు ఆనందం లభిస్తుందని కూడా వీరు నమ్ముతారు.

ఈ తెగలతోపాటు మరెన్నో తెగలు హిందూ మతంలో ఉన్నాయి. వాటిలో కొన్నయితే ఒక శాశ్వత మతవర్గంగా రూపొందాయి. వాటి గురించి ముందు రానున్నది. వేర్వేరు శాఖలు, మతవర్గాలు, వేర్వేరు ఆచారాలు ఉన్నప్పటికీ వారందరూ తమను హిందువులుగానే చెప్పుకుంటారు.

హిందువులలో సంస్కరణా ఉద్యమాలు

మతం అంటే దేవుడ్ని విశ్వసించడం. మతం అసలు ఉద్దేశ్యం దేవుని వ్యక్తిత్వం, ఆయన గుణగణాలు, శక్తిసామర్థ్యాలను గురించి తెలుసుకొని

తదనుగుణంగా మనిషి తన నడవడిని, శీలాన్ని తీర్చిదిద్దుకోవటం, దేవునికి గల గుణగణాలు, లక్షణాలను అవలంబించడానికి ప్రయత్నించడమే. ఉదాహరణకు దేవుడు జాలిగుణం, న్యాయగుణం కలిగివుంటాడు. కాబట్టి మనలోనూ ఆ గుణాలు జనింపజేయాలి. దేవుడు ప్రాణులన్నింటినీ సమాన దృష్టితో చూస్తాడు కనుక మనం కూడా మనలోని భేదభావాలు, వివక్షలను అంతంచేసి తోటి మానవులందరిపట్ల సమాన దృష్టితో వ్యవహరించాలి. కాని గత పుటలలో పేర్కొన్నట్లు హిందూమతంలో దేవతలు అసంఖ్యాకంగా ఉన్నారు. పైగా మతం మీద బ్రాహ్మణుల గుత్తాధిపత్యం ప్రజలను అనుమానంలో పడవేసింది. పునర్జన్మ విషయంలోనూ ప్రజలు సంధిగ్ధంలో పడిపోయారు. వారు మతపరమైన అనేక బంధనాలలో చిక్కబడి వున్నారు. యజ్ఞం, తపస్సు, మంత్రతంత్రాలు లేకుండా వారు మోక్షద్వారాల దగ్గరకు చేరలేక పొయ్యేవారు.

అంచేత ఉపనిషత్తుల రచన తర్వాత బ్రాహ్మణులపట్ల వ్యతిరేకతలో మొదట వైదిక ధర్మంలోని అనేక దేవతల ఉనికిని వ్యతిరేకించడం జరిగింది. ఆ తర్వాత ఏకదైవ భావన ప్రతిపాదించబడింది. మోక్షంకోసం బలులు, నామమాత్రపు ఆరాధనలు తొలగించి వాటి స్థానంలో నైతిక సూత్రాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వబడింది. ఉపనిషత్తులు పేర్కొన్న ఈ కొత్త తాత్విక చింతన మతంలో ఓ నూతన ఉరవడిని సృష్టించింది.

ఆ కాలంలోనే జైన, బౌద్ధ మతాలు కూడా ఉనికిలోకి వచ్చాయి. హిందూ మతం మీద బ్రాహ్మణుల గుత్తాధిపత్యాన్ని అంతమొందించి సమాజంలో వ్యాపించివున్న చెడులను నిర్మూలించడమే వాటి ఆశయం, లక్ష్యాలు. కాని కాలక్రమంలో ఈ సంస్కరణా ఉద్యమాలు మతరూపాలు సంతరించుకున్నాయి. సోదర భావం, సులువయిన సదాచరణలు అనే మౌలిక సూత్రాల కారణంగా ఈ రెండు మతాలు అనతి కాలంలోనే అనేక దేశాల్లో వ్యాపించిపోయాయి. ఈ క్రింది పంక్తులలో బౌద్ధ, జైనమతాల వ్యవస్థాపకుల జీవితాలను గురించి, వారి బోధనల్ని గురించి సంక్షిప్తంగా కొన్ని విషయాలు తెలుసుకుందాం:

బౌద్ధ మతం

ఈ మతాన్ని గౌతమ బుద్ధుడు స్థాపించాడు. ఈయన నేపాల్ సమీపం లోని కపిలవస్తు అనే రాజ్యాన్ని పాలించిన శుద్ధోధన మహారాజు కుమారుడు. క్రీస్తు పూర్వం 563లో జన్మించాడు. రాజకుమారుడిగా పుట్టినందున గౌతమ బుద్ధుడికి భోగభాగ్యాల జీవితం లభించింది. అయినప్పటికీ అయనకు ప్రాపంచిక జీవితంపట్ల విరక్తి పుట్టింది. తల్లిదండ్రులు ఆయనకు వివాహం చేశారు. ఒక కొడుకు కూడా పుట్టాడు. ఆ కాలంలో ఆయనకు ఎదురైన కొన్ని సంఘటనలు ఆయన జీవితంలో పెనుమార్పుకు కారణం అయ్యాయి. ఆయన ఒక రోగిని, ఒక వృద్ధుడ్ని, ఒక శవాన్ని చూశాడు. ఈ మూడు దృశ్యా లతో ఆయన ఎంతో ప్రభావితుడయ్యాడు. దాంతో ఆయన ప్రపంచంలోని సమస్యలు, కష్టాల నుండి ఎలా విముక్తి పొందాలా అని ఆలోచించడం ప్రారంభించాడు.

చివరకు ఒకరోజు రాత్రి ఇలాంటి ఆలోచనలతో రాజమందిరాన్ని, సుఖమయజీవితాన్ని, అందమైన భార్యను, పాలుత్రాగే పసివాడిని సైతం వదలి అడవికి వెళ్ళిపోయాడు. కొన్ని సంవత్సరాలపాటు సంచారంచేసిన తర్వాత గయ (బీహార్) చేరుకుని బోధివృక్షం క్రింద తపస్సు చేశాడు. ఇలా నాలుగేళ్ళు కఠోర తపస్సులో గడిపిన తర్వాత ఆయనకు జ్ఞానోదయం కలిగింది. ఆ తర్వాత జనబాహుళ్యంలోకి తిరిగొచ్చి అనేకచోట్ల తన బోధనలు ప్రచారం చేయనారంభించాడు.

బౌద్ధమత బోధనలు

బుద్ధుని అభిప్రాయం ప్రకారం ప్రపంచమంతటా దుఃఖం వ్యాపించి వుంది. దానికి కారణం, మనిషి ప్రాపంచిక వ్యామోహానికి లోనయి పోవడమే. ప్రాపంచిక వ్యామోహం కారణంగా కలుగుతున్న దుఃఖం నుండి విముక్తి పొందడానికి వైరాగ్య మార్గాన్ని అవలంబించాలి. అందుకోసం ఆయన ఎనిమిది సూత్రాలు నిర్ణయించాడు.

1) సద్భావన
2) సదాచరణ
3) సద్దృష్టి
4) సత్ప్రయత్నం
5) సత్యవాక్కు
6) నిస్వార్థ సేవ
7) సదాలోచన
8) సత్య జ్ఞానం

బుద్ధుడు ఈ సూత్రాలను వివరిస్తూ, మనిషి మోక్షం పొందాలంటే మనసా వాచా కర్మణా సదాచారిగా మారి సంతులనంగల జీవితం గడపాలని అన్నాడు. వీటితోపాటు ఈ మార్గంలో నడవగోరేవారు నగర జీవితాన్ని విడిచి పెట్టాలని కూడా బోధించాడు. సమాజపరంగా కుటుంబాన్ని, భార్యాబిడ్డల్ని, ఇల్లూవాకిలినీ త్యాగం చెయ్యాలని; ఆహారం, వస్త్రధారణ, అలవాట్లలో సాత్వికత అవలంబించాలని; ఇంట్లోగాకుండా అడవులలో, కొండలలో, గుహలలో నివసించాలనీ బోధించాడు. ఇటువంటి జీవితం గడిపేవారిని భిక్షువులు అంటారు.

గౌతమ బుద్ధుని ప్రచారం

మనిషి మతాచారాలను పాటించడానికి పండితులు, బ్రాహ్మణుల అవసరంలేదని బుద్ధుడు ప్రచారం చేశాడు. ఆయన వేదాలను దైవిక బోధనల గ్రంథాలుగా ఒప్పుకోలేదు. దాంతోపాటు తన బోధనల్ని ప్రజల భాష అయిన సాధారణ ప్రాకృత భాషలోనే ప్రారంభించాడు. అందువల్ల ప్రజలు వాటిని అర్థం చేసుకునే అవకాశం లభించింది. ఆయన ఉపదేశాలు వినడానికి, ఆయన సభలకు రావడానికి ప్రతి మనిషికీ అనుమతి వుండేది. నీచులుగా, అంటరానివారిగా పరిగణించబడిన జాతుల ప్రజలను తన బోధనలతో ఆకట్టుకొని అగ్రవర్గాలు, అల్పవర్గాలు అనే వ్యత్యాసాన్ని రూపుమాపాడు. మానవ

మోక్షానికి ఆధారం బ్రాహ్మణీయ సూత్రాలు కాదు, కర్మలనుబట్టి వుంటుందని బోధించాడు.

ఆయన మతంలో కులగోత్రాల వ్యత్యాసంగానీ దేవతలు, దేవుళ్ళ పూజకు అవకాశంగానీ లేవు.

బౌద్ధమత గ్రంథాలు

బౌద్ధమత గ్రంథాలను మూడు భాగాలుగా విభజించడం జరిగింది.

1) సుత లేక దమ్మ

2) వినాయా

3) అభి దమ్మ.

ఈ గ్రంథాలు ఆనాటి ప్రజల భాష అయిన పాళీ భాషలో వున్నాయి. అందుచేత అవి ప్రజామోదం పొందాయి.

అయితే వాటి పఠనంవలన నేటి పాఠకుడికి బుద్ధుని బోధనలేవో, ఆయన శిష్యుల బోధనలేవో అర్థం కావు. కారణం, అవి బుద్ధుని నిర్యాణం జరిగిన రెండు వందల ఏళ్ళ తర్వాత సంకలనం చేయబడ్డాయి. అంచేత ఆయన బోధనలు ఖచ్చితంగా ఇవి అని చెప్పే అవకాశం లేదు.

బౌద్ధమతంలోని శాఖలు

గౌతమ బుద్ధుని కాలంలో ఈ మతం ఒకే శాఖగా వుండేది. కాని ఆయన చనిపోయిన తర్వాత ఈ మతం అనేక శాఖలుగా చీలిపోయింది. వాటిలో రెండు శాఖలు ప్రసిద్ధమయినవి.

1) హీనయానం

2) మహాయానం.

ఈ రెండు శాఖల మతసూత్రాలలో పెద్ద వ్యత్యాసం ఉంది. హీన యాన శాఖ ప్రాచీన కథనాలు, సిద్ధాంతాలతో కూడుకున్నది. వారిలో మతాల

పరంపర కొనసాగేది. అలంకరణ, నాట్యం, రాగం, సంగీతాలు నిషిద్ధం. సాధారణంగా బ్రహ్మచర్య జీవితం గడపబడేది. కాషాయ వస్త్రాలు ధరించి, ఇంటింటికీ తిరిగి భిక్షమెత్తి కడుపు నింపుకోవడం గొప్ప సత్కార్యంగా భావించబడేది.

మహాయానం: ఈ శాఖకు అత్యధిక ప్రజాదరణ లభించింది. వారిలో నూతన విశ్వాసాల ప్రకారం ఆచరణ జరిగేది. ఉదాహరణకు:

1) గౌతమ బుద్ధుడిని దైవత్వపీఠంపై ప్రతిష్ఠించడం.
2) గౌతమ బుద్ధుని విశ్వసించడం, మోక్షానికి సాధనంగా భావించడం.
3) చిత్రపటాలు, విగ్రహాల సంప్రదాయం ఉనికిలోకి రావడం.
4) లామాల రూపంలో గౌతమ బుద్ధుడు మళ్ళీ మళ్ళీ జన్మిస్తూ ఉంటాడని టిబెటియన్ల విశ్వాసం. ఈ కారణంగానే టిబెట్‌లో లామాలను పూజించడం జరుగుతోంది.
5) జపాన్‌లోని బుద్ధ మందిరం చూపరులను ఆకట్టుకుంటుంది. అందులో అసంఖ్యాక విగ్రహాలు ఉన్నాయి.

బౌద్ధ మత ప్రచారం, దాని క్షీణత

ఆరంభంలో సులభగ్రాహ్యమయిన భాషలో బోధన జరగడం వలన, కులమతాల ఆంక్షలపట్ల విసుగుచెందిన ప్రజలు బౌద్ధమతాన్ని స్వీకరిస్తూ పోయారు. ఆ తర్వాత అశోకుడు, కనిష్కుడువంటి చక్రవర్తులు ఈ మతాన్ని అవలంభించారు. అంచేత ఈ మతం భారత సరిహద్దులు దాటి టిబెట్, బర్మా, చైనా, జపాన్, ఇండోనేషియాలకు వ్యాపించింది. ఈ మతం శతాబ్దాలపాటు కొనసాగింది. అయితే ప్రతిచోటా ఈ మతంపై స్థానికమతాల ప్రభావం పడింది. ఉదా హరణకు చైనాలో బుద్ధమతంపై తావూ మతప్రభావం పడింది. దాంతోపాటు అది కన్‌ఫ్యూషియస్ మత ప్రభావానికిలోనైంది. చైనాలో అరుణ విప్లవం వచ్చిన తర్వాత చెలామణిలో వున్న వివిధ మతాల జోరు క్రమంగా తగ్గనారంభించింది.

జపాన్‌లో ఈ మతం కొరియా మార్గం గుండా క్రీ.శ. 7వ శతాబ్దంలో ప్రవేశించింది. అక్కడ షింటోమతాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. కాని త్వరలోనే ఈ రెండు మతాలూ పరస్పరం ప్రభావితమయి, షింటో మతంలోని ప్రత్యేక దేవతలకు బుద్ధత్వ స్థాయి ఇవ్వబడింది.

బర్మా, శ్రీలంక, భూటాన్ వగైరా అనేక దేశాలలో బౌద్ధమతం నేటికీ వ్యాప్తిలో వుంది. కాని ప్రతిచోటా విగ్రహారాధన మేళవించబడింది.

భారతదేశంలో విక్రమాదిత్యుని కాలంలో స్వామి శంకరాచార్య చేసిన ప్రయత్నాలవలన ఈ మతం క్షీణదశకు చేరుకుంది. శంకరాచార్యులు తీవ్ర స్థాయిలో హిందూమత ప్రచారం చేశారు. దాంతో బౌద్ధ మతస్థులు ఇతర దేశాలలో ఆశ్రయం పొందవలసి వచ్చింది.

జైన మతం

మత వ్యవహారాలలో బ్రాహ్మణుల గుత్తాధిపత్యానికి, ఉపనిషత్తుల తాత్విక బోధనలకు ప్రతిచర్యగా ఒక వైపు బౌద్ధ మతానికి పునాదిపడితే, రెండో వైపు జైనమతం ప్రారంభమయింది. మహావీరుడు దీని స్థాపకుడు. ఆయన వైశాలి (బీహార్)లో క్రీ.పూ. 540లో జన్మించినట్లు చెప్పబడుతోంది. ఆ కాలంలోని సామాజిక రుగ్మతలు, మత దోషాలు చూసి ఆయన మనస్సు ప్రాపంచిక జీవితం పట్ల విరక్తి చెందింది. ఆయనక్కూడా గౌతమ బుద్ధుని వలెనే భోగలాలస, విలాస జీవితం నచ్చలేదు. సత్యాన్వేషణలో చివరకు ఒక రోజు ఇల్లు విడిచి బయలుదేరాడు. పన్నెండేళ్ళు అడవులలో కఠోర తపస్సుద్వారా ఆయనకు జ్ఞానోదయం అయిందని చెబుతారు. ఈ సుదీర్ఘ కాలంలో ఆయన జితేంద్రియుడయ్యాడు. అంచేత ఆయన్ని జిన్నుడు అన సాగారు. ఆయన నడిపిన మతవిధానం జైనమతం అనబడుతోంది.

మహావీరునికి పూర్వం 23 మంది ఇతర నాయకులు గతించారని జైనుల విశ్వాసం. వారిని తీర్థంకరులు అంటారు. మహావీరుడు 24వ తీర్థం కరుడు. ఈ పరంపరలో చిట్టచివరివాడు. జైనుల విశ్వాసం ప్రకారం రాయి, చెట్టు, మనిషి, జంతువులన్నింటిలోనూ ఆత్మ వుంటుంది. అందువల్ల ఏ

ఆత్మకయినా బాధ కలిగించడం పాపంగా భావిస్తారు. గౌతమ బుద్ధునివలెనే మహావీరుని ఉద్దేశ్యం ప్రకారం, మనిషిజీవితం బాధలమయం. ఐహిక వ్యామోహం, భోగలాలసల కారణంగానే మనిషి కష్టాలకు గురవుతాడు. ఈ సమస్యల నుండి విముక్తికి ఒకే ఒక మార్గం వుంది. మనిషి అన్నిరకాల కోరికలను త్యజించాలి. మనసులో కోరికలు లేనప్పుడు మనశ్శాంతి లభిస్తుంది. దానినే ఆయన "నిర్వాణ" స్థాయి అంటారు. నిర్వాణం అంటే ప్రాపంచిక బంధనాల నుండి విముక్తి పొందటం.

జైన మత బోధనలు

మహావీరునికి వేదాలు, యజ్ఞాలపట్ల నమ్మకం లేదు. ఆయన కుల మతాల్ని, బలుల్ని, సంస్కృత భాషను, బ్రాహ్మణుల గుత్తాధిపత్యాన్ని వ్యతిరేకించాడు. ఇంద్రియ నిగ్రహం, కోర్కెలను జయించడం, సర్వసంగ పరిత్యాగాలకు ఆయన ఎంతో ప్రాముఖ్యతనిచ్చాడు. ఆయన బోధనలు ఐదు విషయాలపై ఆధారపడి ఉన్నాయి. వాటిని పాటించాలని ఆయన తన అనుయాయులను ఆదేశించారు.

1) ఎల్లప్పుడూ సత్యం పలకాలి.

2) అత్యాశకు దూరంగా వుండాలి.

3) దొంగతనం చెయ్యకూడదు.

4) ఏ ప్రాణినీ కూడా హింసించరాదు.

5) కోర్కెలను జయించి జీవితం గడపాలి.

ఈ సూత్రాలను అవలంబించడం ద్వారానే ఆత్మ పాపాల నుండి బయటపడి పావనమయి, తేలికయి ఆకాశం వైపు అధిరోహిస్తుందని ఆయన అంటాడు.

ప్రపంచ వ్యవహారాలను విడనాడటం ఈ మతం ప్రాథమిక సూత్రం అయినందున ప్రారంభంలో జైనమతానికి ఎటువంటి ఆరాధనాలయం లేకపొయ్యింది. కాని ఆ తర్వాత జైన మతస్థులు హిందూమతానికి ప్రభావితులై

జైనమందిరాలు నిర్మించుకున్నారు. వాటిలో మహావీరుని విగ్రహాలు ప్రతిష్ఠించబడ్డాయి. ఈవిధంగా జైనమతంలో విగ్రహారాధన మొదలయింది.

జైనమత గ్రంథాలు

జైన మత గ్రంథాలను ఆగమాలని అంటారు. ఇవి ఆరు భాగాలుగా విభజించబడ్డాయి.

(1) అంగం (2) ఉపాంగం (3) ప్రకీర్ణ (4) ఛేద సూత్రం (5) మూల సూత్రం 6) చూళికా సూత్రం.

జైన మత శాఖలు

జైన మతంలో రెండు ప్రసిద్ధ శాఖలున్నాయి.

(1) శ్వేతాంబరులు (2) దిగంబరులు

దిగంబర శాఖకు చెందిన మునులు ఎక్కువగా అడవులలో దిశ మొలలతో ఉంటారు. వారు ఆకాశాన్నే తమ అంగవస్త్రంగా భావిస్తారు. అప్పుడప్పుడు నగర సంచారం కూడా చేస్తారు. ప్రత్యేకించి స్త్రీలు వీరిని దర్శించడానికి వస్తుంటారు.

శ్వేతాంబర శాఖ సన్యాసులు తెల్ల దుస్తులు ధరిస్తారు. అహింసా సిద్ధాంతాన్ని గట్టిగా పాటిస్తారు. ఏ ప్రాణికూడా చావకూడదన్న ఉద్దేశంతో వారు నోటికి గుడ్డ కట్టుకొని నడుస్తారు, నీరు వడబోసి త్రాగుతారు. కఠోర విశ్వాసాలు, కఠిన ఆచరణల కారణంగా ఈ మతశాఖ భారత సరిహద్దులు దాటి బయటికి పోలేకపోయింది.

హిందువులలోని ఇతర సంస్కరణ ఉద్యమాలు

క్రీ.శ. 636లో ఇస్లాం స్వీకరించిన అరబ్బులు భారతదేశ తీరప్రాంతాలకు చేరుకున్నారు. మౌలికంగా ఇస్లాం ఒక ప్రచార మతం. అందువల్ల వారి రాక హిందువుల మతవిశ్వాసాలలో అలజడి రేపింది. ఆ తర్వాత మహమ్మద్ గజ్నవీ వాయవ్య ప్రాంతం కొం .గుహల నుండి దాడి చేసాడు. ఇస్లాం సేనలతోపాటు

దైవభక్తిపరులు, నిష్ఠాగరిష్ఠులయిన దైవప్రియులు కూడా భారత్‌కు వచ్చారు. వారి రాక తర్వాత వేల సంఖ్యలో భారతీయులు ఇస్లాం స్వీకరించారు. ఇలా నిర్విరామ కృషి, వ్యక్తిగత సంబంధాలవల్ల ఇస్లామీయ బోధనలు భారతదేశంలో వ్యాపించాయి. తద్వారా వ్యక్తిగత, సామూహిక సంస్కరణలు జరిగాయి.

శంకరాచార్యులు, రామానుజాచార్యులు

వీరిద్దరు దక్షిణ భారత్‌కు చెందినవారు. మతంలోని అంధానుసరణను వారు వ్యతిరేకించారు. యావత్తు ప్రపంచానికి యజమాని, దేవుడు ఒక్కడే అన్న సిద్ధాంతాన్ని ప్రతిపాదించి ఆయనే ఈశ్వరుడు అన్నారు. 'మాయ'ను వ్యతిరేకించారు. వేదాంత చింతనతో కూడిన భక్తికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. సమాజ సంస్కరణకు పెద్దపీట వేశారు. స్త్రీలను బ్రహ్మచర్య జీవితం నుండి మినహాయించారు. "మనుష్ పంచకం"లో ఇలా ఉంది:

"చండాలుడయినా లేదా మరెవరైనా సరే, ఏకేశ్వరోపాసనా జీవితం అవలంబించినవారే నా నిజగురువు.

ఇలాంటి మాటల కారణంగానే బ్రాహ్మణులు వారిని వ్యతిరేకించారు. కారణం ఈ ఆలోచనాసరళి ఇస్లాం ఆలోచనాసరళిని పోలి వుండటమే.

రామానందుడు, కబీర్

అటు ఉత్తర భారతంలోనూ హిందూమతంపై ఇస్లాం ప్రభావం పడింది. పదిహేనవ శతాబ్ది వరకూ ముస్లింల పాలన దాదాపు పూర్తి భారతదేశంపై తన ప్రభావం చూపింది. ముస్లింల సద్గుణసంపత్తి, నీతినడవడికల కారణంగా హిందువులు వారికి చేరువయ్యారు. ఇస్లామీ బోధనలపట్ల ఆకర్షితులయి ఇక్కడ కూడా పెద్ద పెద్ద గురువులు ఉనికిలోకి వచ్చారు. ముస్లింల సహన, సామరస్య భావనల వలన హిందువులు ఇస్లామీయ తీరుతెన్నుల ప్రభావం స్వీకరించసాగారు. తర్వాత దానికి భక్తిఉద్యమం అన్న పేరు పెట్టబడింది. ఈ భక్తిఉద్యమంలో రామానందుడు, కబీర్, నానక్‌లు అగ్రగణ్యులు.

వీరు తమ పాత మతవిశ్వాసాలను బహిరంగంగా విడిచిపెట్టారు. విభిన్న మతాలవారికి స్వీకారయోగ్యమయిన ఒక కొత్త మతానికి పునాదివేయ నారంభించారు. వారు మత విషయాలలో ప్రదర్శనాపరమైన ధర్మ పరాయణతను ఇష్టపడేవారు కాదు. వారు ఏకేశ్వర భావనను అంగీకరించారు కాని, గురువును దైవంకన్నా మిన్నగా భావించేవారు. కోరికలను జయించ డానికి, నిజప్రభువును కలుసుకోవడానికి ముస్లిం సూఫీల విలక్షణ పంథానే కబీర్ కూడా అవలంబించాడు. ఆయన హిందూమతాన్నీ పూర్తిగా అవలంబించలేదు. ఇటు ఇస్లాంనూ అవలంబించలేదు. ఈయన బోధనలు అధికంగా హిందీ భాషలో ద్విపదలుగా లభిస్తాయి.

గురునానక్ - సిక్కు మతం

గురునానక్ క్రీ.శ. 1469లో పంజాబ్ రాష్ట్రంలోని తల్వాండీ గ్రామంలో జన్మించారు. ఆ కాలంలో పంజాబ్‌లోని అనేక గ్రామాలు ముస్లిం వలీలు, ఫకీర్ల జన్మస్థానాలుగా ఉండేవి. వారి గుణగణాలు, భక్తి, నిష్ఠ, దైవమార్గాను సరణ, వాక్శుద్ధి ప్రసిద్ధిచెందాయి. నానక్ బాల్యం ముస్లిం పెద్దల మధ్య గడిచింది. ఆయన కొన్నాళ్ళపాటు మౌలానా ఖుతుబుద్దీన్‌గారి దగ్గర పర్షియన్ భాష చదివారు. పెద్దయ్యాక వివిధ ప్రాంతాలు పర్యటించి, చాలామంది వలీలను కలుసుకుని ఆధ్యాత్మిక అనుభవం సంపాదించారు. సాధువులు, సంత్‌లు, సూఫీల సహవాసం చేశారు. మతంలోని మూఢనమ్మకాలు, కుల మతాలలోని అంటరానితనం, నైతిక పతనం చూసిన ఆయన మనస్సు హిందూ మతం నుండి తప్పుకుంది. ఆయన ఒక కొత్త మతాన్ని లేవదీశారు. దాని అసలు ఉద్దేశ్యం హిందూ ముస్లింల ఐక్యత. ఆయన శ్రీలంక, పర్షియా, ఇంకా అరేబియాలోని పవిత్ర క్షేత్రాలను కూడ దర్శించారు. వివిధ మతాల వారిని కలుసుకున్నారు. ఎక్కడ మంచి విషయం దొరికినా దాన్ని ఆయన అవలంబించారు. ఆయన బోధనలు 'గురుగ్రంథ్ సాహెబ్' అనే గ్రంథంలో సంకలనం చేయబడ్డాయి. ఇదే సిక్కుల మతగ్రంథం. దీనికి ఐదవ గురువు అయిన అర్జున్‌సింగ్ సంకలనం చేశారు.

సిక్కులు గురునానక్‌ను తమ ప్రప్రథమ గురువుగా అంగీకరిస్తారు. పదవ గురువు అయిన గురు గోవింద్‌సింగ్ సిక్కులకు సైనిక శిక్షణ ఇచ్చారు. జుట్టుపెంచడం, కంకణం, కృపాణం ధరించడం గురించి ఉపదేశించారు. సిక్కుల ఆరాధనాలయాన్ని గురుద్వారా అంటారు. వాటిలో విగ్రహాలు ఉండవు. అయితే గురుగ్రంథ సాహెబ్‌ను ఒక ఎత్తయిన పీఠంపై ఉంచి దానిని దర్శించడం జరుగుతుంది.

గురునానక్ బోధనలు

1) సత్యమే దైవం.

2) సత్యం మనిషిని మాయ యొక్క బంధనాల నుండి విముక్తి చేస్తుంది. కనుక సత్యాన్నే అవలంబించాలి.

3) ఆకాశంలో గొప్ప శక్తి వుంది.

4) అందరినీ ఒకే దృష్టితో చూడాలి.

5) జీవితాన్ని సార్థకం చేసుకోవడానికి ప్రజలకు సేవ చేయాలి.

6) గురువును సేవిస్తే దైవం దొరుకుతాడు.

7) బీడీ, సిగరెట్, సారాయి త్రాగటం, మత్తు పదార్థాల సేవన అవమాన కరం.

8) దైవం నీ కర్మల విచారణ జరిపే రోజుకు భయపడు.

9) దైవం విధించిన హద్దులు దాటేవాడే పాపాత్ముడు.

గురునానక్ ఇస్లాంలోని ఏకేశ్వరవాదాన్ని అవలంబించినప్పటికీ, హిందువుల విశ్వాసం అయిన పునర్జన్మను కూడా విశ్వసించేవారు.

ఆయన చనిపోయిన తర్వాత సిక్కు మతం ఒక మతవర్గం రూపంలో పైకొచ్చింది. నేటికీ భారతదేశంలో దానికి గొప్ప స్థానం వుంది.

సత్నామీ వర్గం

బీర్‌భాన్ అనే పేరుగల వ్యక్తి సత్నామీ వర్గానికి పునాది వేశాడు. ఆయన ఏకేశ్వరోపాసనను అవలంబించాడు. దైవాన్ని 'సత్నామ్' (సత్యం) అనే పేరుతో పిలిచేవాడు. ఆయన బోధనలు ఇలా ఉన్నాయి:

1) మిమ్మల్ని పుట్టించిన దేవుడు ఒక్కడే అని అంగీకరించండి.

2) ఎవరి మీదా హింసాదౌర్జన్యాలకు పాల్పడరాదు.

3) సమతులనంతో, అణకువతో మెలగాలి.

4) అబద్ధం పలకడంగానీ, ప్రజలకు చెరుపుకానీ ఎన్నడూ చేయరాదు.

5) మనోవాంఛల్ని, సిరిసంపదల అత్యాశను జయించాలి.

6) మత్తు పదార్థాలకు దూరంగా వుండండి.

7) ఫకీరులాంటి (నిరాడంబరమైన) దుస్తులు ధరించండి.

ఈ బోధనలనుబట్టి ఆయన చాలా మటుకు ఇస్లాం పట్ల ప్రభావితుడయినట్లు తెలుస్తోంది. ఈ వర్గానికి చెందిన ప్రత్యేక కేంద్రాలు, ఢిల్లీ, రోహతక్, ఆగ్రా, మీర్జాపూర్‌లలో ఉన్నాయి.

ఆర్య సమాజం

పద్దెనిమిదవ శతాబ్ది చివరలో ఆంగ్లేయులు బెంగాల్, ఉత్తర భారత్‌లో తమ ప్రభావం చూపారు. ప్రభుత్వంలో వారి పలుకుబడి, ప్రభావం చూసిన క్రైస్తవ ప్రచారకుల రాక కూడా భారత్‌లో ఆరంభమయింది. క్రైస్తవ బోధనలు ప్రజలకు తెలిసివచ్చాయి. అందువల్ల క్రైస్తవం నుండి హిందూ మతాన్ని రక్షించే ప్రయత్నంలో కొందరు మతసంస్కర్తలు ఉనికిలోకి వచ్చారు. వారిలో రెండు శాఖలు ప్రసిద్ధమయినవి.

1) ఆర్య సమాజం.

2) బ్రహ్మ సమాజం.

ఆర్య సమాజం

స్వామి దయానంద సరస్వతి దీని స్థాపకుడు. ఈయన ఆరంభంలో కరడుగట్టిన హిందువు. విగ్రహారాధనపట్ల నమ్మకం కలిగి వుండేవారు. కాని శివరాత్రి నాడు ఆయన శివపూజ చేస్తుండగా ఒక ఎలుక శివుని విగ్రహం పైకెక్కి, శివుని నైవేద్యం తినసాగింది. ఈ దృశ్యం చూసి ఆయన కళ్ళు తెరచుకున్నాయి. శివుడు ఒక ఎలుకను తనపై నుండి తొలగించలేక పోయాడు. ఇలాంటి దేవుణ్ని పూజించడంవల్ల ప్రయోజనం ఏమిటి? ఇలా ఆలోచించిన తర్వాత ఆయన హిందూమతాన్ని సంస్కరించాలని కంకణం కట్టుకున్నారు. వివిధ మతగ్రంథాల అధ్యయనం చేసిన తరువాత అనేక దేవతల ఆరాధన కన్నా, ఒకే దైవాన్ని పూజించడం ఉత్తమం అన్న అభిప్రాయానికి వచ్చారు. వేదాలలో ఎక్కడా విగ్రహారాధన ప్రసక్తి లేదని కూడా ఆయన చెప్పారు. పునర్జన్మ, కర్మసిద్ధాంతం అవాస్తవమైనవన్నారు. అవతారాల సిద్ధాంతాన్ని ఆయన ఖండించారు. బలిని నిషేధించారు.

ఆయన రచించిన సత్యార్థ ప్రకాశం అనే గ్రంథం ప్రసిద్ధిగాంచింది. ఆర్య సమాజ కేంద్రం పంజాబ్. కాని తర్వాత క్రమంగా దేశం అంతటా విస్తరించింది. హిందువులలో 5వ వంతు ఆర్య సమాజీయులే.

బ్రహ్మ సమాజం

బ్రహ్మ సమాజ నిర్మాత రాజారామ్ మోహన్‌రాయ్. బెంగాల్‌లో ఆంగ్లేయుల పాలన ఏర్పడిన దరిమిలా క్రైస్తవమత ప్రచారం కూడ ఆరంభమయింది. దానిపట్ల ఆకర్షితులయి చాలా మంది క్రైస్తవులుగా మారసాగారు. అందువల్ల రాజారామ్ మోహన్‌రాయ్ తన మత గ్రంథాలను లోతుగా అధ్యయనం చేసి హిందూ మతంలో గట్టి సంస్కరణలు చేపట్టవలసి వుందన్న అభిప్రాయానికి వచ్చాడు. ఇప్పుడు ఇటువైపు దృష్టి సారించకపోతే తర్వాత చింతించవలసి వస్తుందని భావించాడు. క్రైస్తవంలోని నైతిక దృక్పథం ఆయనకు బాగా నచ్చింది. సామాజిక సంస్కరణల ద్వారా తన ప్రయత్నాలను **ఆరంభించాడు. ఆ రోజుల్లో హిందువులలో బాల్య వివాహాలు, సతీసహగమన**

ఆచారం తీవ్రంగా పాటించబడేది. ఆంగ్లేయ పాలకుల సహకారంతో ఆయన ఈ ఆచారాలకు వ్యతిరేకంగా చట్టం చేయించాడు. కుల మత వ్యత్యాసాలను రూపుమాపే ప్రయత్నం చేశాడు. ఆంగ్ల భాషాధ్యయనం, ఆధునిక విద్యాభ్యాసం గురించి ప్రజలను ప్రోత్సహించాడు.

ఆయన మరణానంతరం ద్వారకానాధ్ ఠాగూర్ ఈ మత ప్రచారానికి పూనుకున్నాడు. ఆయన ప్రయత్నాలతో బ్రహ్మ సమాజం ఒక మతంగా అవతరించింది. దైవంపట్ల ప్రేమ, విగ్రహారాధనపట్ల ద్వేషం ఆయన ప్రాథమిక బోధనల్లో చేరివున్నాయి.

మజూసీ మతం

ఆర్యులు మధ్య ఆసియా నుండి వివిధ దేశాలలో వ్యాపించారు. వారి శాఖ ఒకటి ఈరాన్‌కు వచ్చినట్లు చెప్పబడుతోంది. మతపరంగా వీరు ఆకాశం, భూమి, సూర్యచంద్రులు, నీరు, గాలిని పూజిస్తారు. వాటితోపాటు మొక్కలను, చెట్లనూ కూడా పూజిస్తారు. వారి మతానికి ఆధారం పౌరాణిక గాధలే. ప్రాచీన ఈరానియన్లలో తమ పూర్వీకుల విగ్రహాలను పూజించే ఆచారం వుండేది. అందువల్ల వారు కూడ రాతితో, చెక్కతో, మట్టితో, లోహాలతో పూర్వీకుల విగ్రహాలు తయారుచేసేవారు.

భారతదేశంలోవలెనే అక్కడ కూడా మతాచారం ఒక ప్రత్యేక వర్గానికి జన్మనిచ్చింది. వారు దేవతలకు ప్రియమైన వారన్న భావాన్ని ప్రజల హృదయాలలో నాటుకునేలా చేశారు. వారు తమ మంత్రతంత్రాల ద్వారా దేవతలచేత తమ కోర్కెలను సాధించుకోగలరని కూడ అభిప్రాయపడేటట్లు చేశారు.

మజూసీలు, ఈరాన్ ఆర్యులు ఉభయులూ సూర్యుడ్ని, అగ్నిని పూజిస్తారు. మజూసీలు కలల గూఢార్థం చెప్పడంలో, నక్షత్ర శాస్త్రంలో కూడా నిష్ణాతులు. ఈరానీ ప్రజలు ప్రాచీన కాలం నుండీ ఇద్దరు దేవుళ్ళను అంగీకరించేవారు. ఒకటి, మేలుచేసే దేవుడు. ఆయన్ని యజ్దా అనేవారు. రెండు, కీడుచేసే దేవుడు. ఆయన పేరు అహ్‌రమన్.

ఇద్దరు దేవుళ్ళ భావన ఏకేశ్వరవాదానికి వ్యతిరేకం అయినప్పటికీ, దాని ఫలితం భౌతికంగా కూడ అంతగా బాగాలేదు. దానివలన మనిషి కోర్కెలకు బానిస అయిపోతాడు. ఇలా మజూసీలు మానవాళికి రుజుమార్గం చూపడంలో విఫలమయ్యారు.

జొరాస్ట్రియన్ మతం

జొరాస్టర్ హజ్రత్ ఈసా (అలైహి)కు ఏడువందల సంవత్సరాలకు పూర్వం జన్మించాడని చరిత్రకారుల అభిప్రాయం. ఆ రోజుల్లో ఈరాన్ ప్రజలు వివిధ దేవతలను పూజించడం సంప్రదాయంగా వుండేది. వారి ప్రముఖ దేవతల పేర్లు మను, ఎహ్‌డారత్, యమ, గంధర్వ, మిత్ర వగైరా. పూజా కార్యక్రమాలు వారి పురోహితులు చేసేవారు. ప్రజలు మూఢాచారాలకు లోనయి ఉండేవారు.

జొరాస్టర్ పెరిగి పెద్దవాడయి ప్రజాసేవలో నిమగ్నుడయ్యాడు. కాని సమాజం చెప్పలేనంత రుగ్మతలకు లోనుకావడం చూసి ఆయన సన్యాసత్వం స్వీకరించారు. మానవుడికి కష్టాలు ఎలా వస్తున్నాయి? వాటి నుండి విముక్తి పొందటం ఎలా? అన్న విషయం ఆయన్ని బాగా కలచివేసింది.

అంచేత ఆయన సంవత్సరాల తరబడి ఇదే ఆలోచనతో ఇల్లూవాకిలీ విడిచి అడవులలో తిరుగుతూ వుండేవాడు. సూర్యోదయం, సూర్యాస్తమయ దృశ్యాలు చూసిన ఆయనకు జ్యోతి, అంధకారాల అనుభవం ఎదురయిందని చెబుతారు. జ్యోతి (వెలుగు)ని పుణ్యంతోనూ, అంధకారాన్ని పాపంతోనూ పోల్చారు. జ్యోతిని అంధకారంగా, అంధకారాన్ని వెలుగుగా మార్చలేము. పాపపుణ్యాల విషయమూ అంతే. దీన్నుండే ఇద్దరు దేవుళ్ళ భావన ఆయనలో కల్గింది. ఒక దేవుడు ఆపాదమస్తకం పుణ్యస్వరూపుడు. ఆయన్ని "అహోరాజవా" అన్నాడు. పాపాల దైవాన్ని "అన్ గరామిను" అని పేరు పెట్టాడు. ఆ తర్వాత ఆయన ఒక కొత్త మతాన్ని నడిపాడు. దానిని పార్సీ మతం అంటారు. దాని బోధనలు "జింద అవెస్తా" అనే గ్రంథంలో సంకలనం చేశారు.

జొరాస్టర్ బోధనలు

1) దేవుడు ఒక్కడే. జొరాస్టర్ ఆయన్ని "అహరె ముహ్బత్" అన్నాడు. (సంపూర్ణ శక్తిశాలి) ఆయన అభిప్రాయంలో ఆ దేవుడు (సంపూర్ణ శక్తిశాలి), ఆ దేవుని ఆదేశాల ప్రకారమే సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, భూమి, గాలి చలనం పొందుతున్నాయి.

2) మనిషి తన ఆచరణనుబట్టి స్వర్గానికో, నరకానికో పోతాడు.

3) ఆత్మకు చావు లేదు. మరణంతో శరీరం అంతం అవుతుంది. కాని ఆత్మ మిగిలివుంటుంది.

4) సద్భావనలు, సదాచరణలవల్ల సాఫల్యం (ముక్తి) సిద్ధిస్తుంది.

5) ఎల్లప్పుడూ సత్యానిదే విజయం అవుతుంది.

జొరాస్టర్ ఇతర విశ్వాసాలు

జొరాస్టర్ మజూసీల దేవతలందరినీ రద్దుచేశాడు. ఆయన బొమ్మలు వేయడాన్ని, విగ్రహాలు తయారు చేయడాన్ని కూడా నిషేధించాడు. సంచార జీవితాన్ని వ్యతిరేకించాడు. కష్టపడి పని చేయడాన్ని పుణ్యకార్యంగా భావించాడు. అందువల్ల ఆయన తన జీవిత కాలమంతా వ్యవసాయం చేస్తూ గడిపాడు. జొరాస్టర్ పేదలకు, అగత్యపరులకు ఆర్థిక సహాయం చేయడాన్ని కూడ ప్రోత్సహించాడు. ఏదయినా పని చేసే ముందు దాని పర్యవసానాన్ని కూడ ఆలోచించమని అంటాడు. ఏదయినా తప్పు జరిగిపోతే దానికి పరిహారం చేయాలని చెబుతాడు.

జొరాస్టర్ మత పర్యవసానం

జొరాస్టర్ చనిపోయిన తర్వాత ఈరానియన్లలో పురాతన విశ్వాసాలు తిరిగి జీవం పోసుకున్నాయి. బహుదైవారాధన, విగ్రహ పూజలు మళ్ళీ మొదలయ్యాయి. మజూసీలకూ తమ విశ్వాసాల్ని ప్రచారం చేసుకునే అవకాశం చిక్కింది. అంచేత దేవతలకు దైవదూతల హోదా లభించింది.

అగ్ని వెలుగుకు మూలంగా భావించబడేది. అంచేత అగ్ని ఎదుట చేతులు జోడించడం మంచి పనిగా భావించబడసాగింది. నేటికీ వారి ఆరాధ నాలయాల్లో ఎల్లవేళలా ఒక ప్రత్యేక స్థానంలో అగ్ని రగల్చబడుతూనే వుంటుంది.

అంతేకాక జోరాస్టర్ తన మతం నుండి చేతబడిని, మంత్రాల్ని పూర్తిగా తొలగించినప్పటికీ ఆయన మరణానంతరం మజూసీ మతాచారాల్లో చేతబడి, మంత్రతంత్రాలు తిరిగి చోటుచేసుకున్నాయి. పైగా మజూసీలు జొరాస్టర్‌ని మంత్రగాడిలా, జ్యోతిష్యునిగా భవిష్య విషయాలు తెలుసుకోవడంలో నేర్పు ఉన్నవానిగా చిత్రిస్తూ ఆయన జీవిత చరిత్రను రాయడం జరిగింది. కాని ఆయన బోధించిన నైతిక విషయాలకు ఇవ్వవలసినంత ప్రోత్సాహం మట్టుకు మజూసీ మతస్థులు ఇవ్వలేదు.

కన్‌ఫ్యూషియస్ మతం

ఇది చైనాలోని పురాతన మతం అని చరిత్ర అధ్యయనంవలన తెలుస్తోంది. అయితే ఇది కన్‌ఫ్యూషియస్‌కు పూర్వమే చెలామణిలో వుంది. తాను కేవలం ప్రచారకుడ్ని, ప్రవక్తను మాత్రమేగాని మతస్థాపకుడ్ని కానని స్వయంగా కన్‌ఫ్యూషియస్ తన ప్రసంగంలో పేర్కొన్నాడు. అంటే ఆయన కొత్తమతమేదీ ప్రతిపాదించకుండా మానవీయ విలువల్ని, నీతికి సంబంధించిన ప్రాథమిక సూత్రాలను ప్రజలకు గుర్తు చేశాడన్నమాట.

కన్‌ఫ్యూషియస్ జననం

కన్‌ఫ్యూషియస్ జననం క్రీ.పూ. 551లో జరిగింది. ఆయన క్రీ.పూ. 679 వరకూ జీవించాడు. ఆయన వ్యక్తిగత విషయాలను గురించి చరిత్ర మౌనం వహించింది. పెద్దవాడయ్యాక ఆయన ప్రభుత్వ హోదాలోనూ వున్నాడు. అంచెలంచెలుగా ఎదిగి మంత్రి హోదాకు చేరుకున్నాడు. న్యాయం, ధర్మాల విషయంలో ఆయన ఎటువంటి రాయితీ ఇచ్చేవాడు కాదు.

ఆ కాలంలో చైనాలో అల్లకల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. దేశం చిన్న చిన్న జాగీర్లుగా విభజించబడి వుంది. ఏ ఒక్కరూ ఇతరుల పాలనను అంగీకరించడానికి సిద్ధంగా లేరు. దేశం యావత్తూ కుట్రలకు గురయి వుండేది. కన్‌ఫ్యూషియస్ అంతర్యుద్ధం మంచిదికాదని, దేశం సంఘటితంగా, సమైక్యంగా వుండాలని అభిలషించాడు.

కన్‌ఫ్యూషియస్ మతం, కొన్ని సూత్రాలను ప్రతిపాదించి వాటిని అవలంబించేలా ప్రజలను ప్రోత్సహించే మతం అన్న అర్థంలో మతం కాదు. అందులో ప్రత్యేక ఆరాధనలు, పూజలంటూ ఏవీ నొక్కిచెప్పలేదు. ఆధ్యాత్మిక విధివిధానాల విషయంలో కూడ ప్రత్యేక దృక్కోణం లేదు. అయితే ఆయన సామూహిక జీవిత సంస్కరణకు, రాజ్యపాలనకు కావలసిన ఉన్నత సూత్రాలు బోధించాడు. ఈ సూత్రాలు ప్రజల జీవితాల్లో తీవ్రప్రభావం చూపాయి. చివరికి పాలకులు సైతం ఈ సూత్రాలకు ఎంతో ప్రభావితులయ్యారు.

కన్‌ఫ్యూషియస్ మత బోధనలు

కన్‌ఫ్యూషియస్ తనపై ఆకాశం నుంచి దైవసందేశం అవతరిస్తుందని చెప్పుకోలేదు. సమాజంలోని ఒక వ్యక్తిగా మనిషి పాటించవలసిన బాధ్యతలను గురించి మాత్రమే ఆయన చర్చించేవాడు.

➢ ఆయన బోధనల్లో దేవుని ఉనికి, పునర్జన్మల గురించి ఎటువంటి అభిప్రాయమూ వెల్లడి కాలేదు.

➢ తప్పును ఒప్పుకోవడం పెద్దరికానికి నిదర్శనం అన్నాడు ఆయన.

➢ నీవు నీకోసం కోరుకున్నదాన్నే ఇతరులకోసం కూడా కోరుకో.

➢ జ్ఞానరహితమైన ఆలోచన ప్రమాదకరమైనది.

➢ మనిషి పుట్టినప్పుడు వెంట ఏమీ తీసుకురాడు. చనిపోయినప్పుడు కూడా వెంట దేనినీ తీసుకుపోడు.

★ క్రింద పేర్కొనబడిన అయిదు సంబంధాలను సక్రమంగా నిభాయించే ప్రయత్నం చెయ్యండి.

1) రాజు-ప్రజల సంబంధాలు.
2) తండ్రీకొడుకుల పరస్పర సంబంధాలు.
3) భార్యాభర్తల హక్కులు, సంబంధాలు.
4) అన్నదమ్ముల బంధుత్వం.
5) మిత్రులు, శ్రేయోభిలాషులపట్ల ఆదరణ.

పరిపాలకుల కోసం కన్ఫ్యూషియస్ ఈ విధంగా కొన్ని సూత్రాలను వివరించాడు:

1) ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో వుంచుకోవడం.
2) న్యాయం, నిజాయితీలతో పనిచేయడం.
3) సద్గుణాలను అలవరచుకోవడం.
4) ప్రభుత్వ కార్యాల్ని విజ్ఞతా, వివేచనలతో నిర్వర్తించడం.
5) చిత్తశుద్ధి, త్యాగభావాలతో ప్రవర్తించడం.

కన్ఫ్యూషియస్ తన నైతిక బోధనలను ప్రజలకే పరిమితం చెయ్యకుండా పాలకులను సయితం ప్రభావితుల్ని చేయడం ఆయన సాధించిన ఘనకార్యమని చెప్పవచ్చు. "హాన్" వంశస్థుల పాలనలో కన్ఫ్యూషియస్ మతానికి ప్రభుత్వ అండదండలు లభించాయి. ఆ తర్వాత ప్రతి పట్టణంలో కన్ఫ్యూషియస్ ఆరాధనాలయాలు నిర్మించబడ్డాయి. ఆ వంశం చివరి పాలనా కాలంలో కన్ఫ్యూషియస్ విగ్రహాన్ని ఆరాధనాలయాల అలంకారంగా చేయడం జరిగింది. ఇప్పుడు ప్రతినెలా మొదటి తేదీన ఈ ఆరాధనాలయాల్లో పండ్లు, కూరగాయలు నివేదించబడుతున్నాయి. దేవునికి సాటి కల్పించడం, ధర్మంలో కొత్త విషయాల్ని జొప్పించటం అనే ఆచారం పాటించబడుతోంది.

కన్ఫ్యూషియస్ మత గ్రంథాలు

వివిధ కాలాలలో రాయబడిన కన్ఫ్యూషియస్ మత గ్రంథాలలో నాలుగు గ్రంథాలు ప్రసిద్ధమయినవి.

1) **షాహ్‌మిాలు:** ఇది నైతికత, కృతజ్ఞతలకు సంబంధించిన ఒక చిన్న వ్యాసం. దీనిని కన్‌ఫ్యూషియస్ చెప్పిన ఒక హితబోధ అంటారు.

2) **చెంగ్ నియక్:** ఇది లీచీ గ్రంథంలోని ఒక భాగం. కన్‌ఫ్యూషియస్ మనవడు కింగ్‌చీ సంకలనం చేశాడు. ఇందులో మానవ స్వభావం, అతడి గుణాలను గురించి చర్చించబడింది.

3) **లియూన్ యూ:** ఇరవై సంపుటాలలో వుంది. కన్‌ఫ్యూషియస్ మరణించిన వందేళ్ళ తర్వాత ఇది రాయబడింది. ఇందులో కన్‌ఫ్యూషియస్ మతం గురించిన వివరాలన్నీ పొందుపరచబడ్డాయి.

4) **మేనిగ్ జో:** ఇందులో రాజకీయ, ఆర్థిక విషయాల గురించిన చర్చలు ఉన్నాయి.

కన్‌ఫ్యూషియస్ బోధనలలో పరమ ప్రభువు గురించిన అస్పష్టమైన సూచనలు ఎన్నో లభిస్తాయి. ఆత్మ, జీవితం, మరణం గురించిన విషయాలు కూడా బహుతక్కువగా ఉన్నాయి. ఈ కారణంగానే ఈయన బోధనలు ప్రాపంచిక వ్యవహారాలకే పరిమితం అయ్యాయి. అయితే కన్‌ఫ్యూషియస్ మరణానంతరం ఆయన అనుచరులు పరమ ప్రభువు (ఉన్నతుడయిన దైవం) భావనను విస్మరించి ఆయన విగ్రహాన్ని తయారుచేసి పూజించడం మొదలుపెట్టారు. దీనితో ఆయన కృషి యావత్తూ గంగపాలయ్యింది.

యూద మతం

యూదులు సంచారజాతి అయిన అరబ్బు సంతతికి చెందినవారు. చారిత్రక ఉల్లేఖనాల ప్రకారం దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలై)కు ఇద్దరు కుమారులు. వారిలో ఒకరు హజ్రత్ ఇస్మాయీల్ (అలై). ఈయన సంతతి అరేబియాలో విస్తరించింది. రెండవ కుమారుడు హజ్రత్ ఇస్‌హాఖ్ (అలై). ఈయన పాలస్తీనాలో నివసించారు. ఈయన వంశంలో హజ్రత్ యాఖూబ్ (అలై) కుమారుడైన హజ్రత్ యూసుఫ్ (అలై)కు దేవుడు ఈజిప్టు సార్వభౌమాధి కారం అనుగ్రహించాడు.

మతపరంగా వారి ఉత్థానపతనాలు

హజ్రత్ యూసుఫ్ (అలై) కాలంలో యూదులు ఈజిప్టుకు చేరుకొని బాగా సంపన్నులయ్యారు. అయితే పుష్కలమైన సిరిసంపదల కారణంగా వారిలో క్రమంగా చెడులు చోటుచేసుకున్నాయి. ఏకదైవారాధకులైన వీరు ఈజిప్టులో సుదీర్ఘకాలం నివసించినందున ఈజిప్టు విశ్వాసాలను కూడా అవలంబించారు. కాని శతాబ్దాల తరబడి సాగిన పతనం వారిని అసలు ధర్మానికి దూరంగా తీసుకుపోయింది. వారి విశ్వాసాలలో ఇస్లామేతర విషయాలు కలసిపోయాయి. వారి మతం, నైతికతలు పెడదారినపట్టాయి.

వారు తమ జాతి, తెగలకు సంబంధించిన దేవతల విగ్రహాలను, ఆవుదూడలను, పశువులను, చివరకు సర్పాలను కూడ పూజించడం ప్రారంభించారు. విగ్రహాలకు బలులు ఇచ్చేవారు. బలిచ్చే ముందు పశువును ఒక రాతిపై తప్పనిసరిగా నిలబెట్టేవారు. అది "బేతేలు" అని పిలువబడేది. బేతేలు అనేది ఇలాంటి ఆచారాలు పాటించబడే ఆరాధనాలయం పేరు. యూదులు కనాన్ రాజ్యాన్ని జయించిన తరువాత వారి దేవతలలో బాల్, మౌలక్ అనే మరో ఇద్దరు దేవతలు కూడా చేరారు. బాల్‌ను పంటల దేవతగా, మౌలక్‌ను అగ్నిదేవతగా భావించడం జరిగింది.

యహూదా దేవుడు

ప్రాచీన దేవతయిన "అషద్దా" కొంతకాలం తరువాత యహూదాగా మారింది. ఈ దేవతయే తమకు ఇతర జాతులపై విజయం కలుగజేస్తుందని వారి నమ్మకం. సంతానంకోసం కూడా ఈ దేవతనే మొక్కుకునేవారు. యహూదా పేరుతో పెద్ద పెద్ద ఆరాధనాలయాలు నిర్మించబడేవి. ఆ దేవతను ఏకైక దైవంగా భావించేవారు. కాని తర్వాత కాలంలో వారి సాధారణ పరిస్థితులు వక్రమార్గం పట్టాయి. అధర్మకార్యాలకు మతపవిత్రత అంటగట్టారు. బహుదైవారాధనా భావాలు మనసుల్లో గూడుకట్టుకున్నాయి. ఈలోగా దేవుడు ఫిరౌన్ వంటి క్రూర చక్రవర్తిని వారిపై రుద్దాడు. ఫిరౌన్ తానే దేవుడని ప్రక

టించుకొని ప్రజలు తన ఎదుట శిరస్సు వంచేలా ఆజ్ఞాపించాడు, ముఖ్యంగా ఇస్రాయీల్ ప్రజలను ప్రతి మగ శిశువునూ హత్య చేయించేవాడు.

హజ్రత్ మూసా (అలై) జననం - ఆ తర్వాతి పరిస్థితులు

చివరకు యూదజాతిని దేవుడు కరుణించి క్రీ.పూ. 1300లో హజ్రత్ మూసా (అలై)ను ప్రవక్తగా ప్రభవింపజేశాడు. హజ్రత్ మూసా (అలై) తన సందేశాన్ని తౌరాత్ రూపంలో వారికి అందజేశారు. ఆయన ఎంతో కృషిచేసి ఆ జాతిని ఫిరౌన్ దాస్యం నుండి విముక్తి కలిగించి, సినాయి ఎడారిలో నివసింపజేశారు. ఆ కాలంలో దేవుడు వారిపై తన వరాలను కురిపించాడు. వారిపై మేఘాన్ని నీడగా చేశాడు. వారి కోసం ఆకాశం నుండి మన్న, సల్వాలను దించి వారి ఆహార సామగ్రి ఏర్పాటుచేశాడు. ఎడారినేల నుండి నీటి చెలమలను పుట్టించాడు.

అయినప్పటికీ యూదులు తమ సహజ బలహీనత కారణంగా కాస్త విరామం లభించగానే తౌరాత్‌లోని దైవాదేశాలను తమ మనోవాంఛలకు అనుగుణంగా మార్చుకున్నారు. ధర్మసమ్మతమైన అనేక వస్తువులను నిషేధించుకున్నారు. అధర్మ కార్యాలను ధర్మసమ్మతం చేసుకున్నారు. కొందరు దైవ ప్రవక్తలను హతమార్చారు. అఖ్సా ఆలయంలో యహూదా దేవుడి బంగారు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అది యసీయా ప్రవక్త (అలై) కాలంలో ధ్వంసం చేయబడింది.

హజ్రత్ మూసా (అలై) జన్మించక పూర్వం దేవుడు ఆ జాతిలో ఇద్దరు శ్రేష్ఠులయిన రాజులను కూడా పుట్టించాడు. వారు జెరుసలేమ్‌ను జయించి అక్కడ అఖ్సా ఆలయాన్ని నిర్మించారు. అదే ఇప్పుడు బైతుల్ మక్దిస్‌గా పిలువబడుతూంది. ఈ రాజులు దైవప్రవక్తలు కూడా. హజ్రత్ దావూద్ (అలై) తన సందేశాన్ని జబ్బూర్ రూపంలో అందజేశారు. ఇలా దేవుడు యూద జాతిలో ఎంతోమంది ప్రవక్తలను పుట్టించాడు. అయినా ఈ జాతి సన్మార్గంలోకి వచ్చినట్లే వచ్చి దుర్మార్గంలో పడిపోతుంది. ఈనాటికీ ఈ జాతి పరిస్థితి ఇలాగే కొనసాగుతోంది.

యూదు మత బోధనలు

1) దేవుడు ఒక్కడే అని అంగీకరించాలి.

2) భూమి అన్ని చలనాలకు కేంద్ర బిందువు.

3) ఆచరణకు అత్యంత ప్రాముఖ్యం ఇవ్వబడింది.

4) రోజుకు మూడుసార్లు ఆరాధించడం మతపరమైన విధి.

5) భోజనానికి ముందు కృతజ్ఞతాపూర్వక ప్రార్థన చెయ్యాలి.

6) పవిత్ర గ్రంథాన్ని ప్రతిరోజూ పారాయణం చెయ్యాలి.

7) హజ్రత్ మూసా (అలై) అందరికన్నా గొప్ప ప్రవక్త అని నమ్మాలి.

యూదుల విశ్వాసాలు

భవిష్యత్తులో మసీహ్ (క్రీస్తు) అలైహిస్సలాం రానున్నారని, ఆ తర్వాత యూదు మతం ప్రగతి పథానికి చేరుకోగలదని వారి విశ్వాసం.

✶ యహూదా దేవుడు ఎంతో దయార్ద్ర హృదయుడని, క్షమాపణ కోరితే అన్ని పాపాలనూ క్షమించివేస్తాడన్నది వారి నమ్మకాల్లో ఒకటి.

✶ యూదులు దేవునికి అత్యంత ప్రియమైన జాతి ప్రజలు. వారికి మాత్రమే ఇహపర లోకాల సాఫల్యం లభిస్తుంది. ప్రపంచంలోని ఇతర మానవుల ఆచరణలు, విశ్వాసాలు ఎలాంటివైనా సరే, వారు నరకాగ్నికి ఇంధనం కావటానికే పుట్టారు.

✶ యూదుత్వం అనే పదం "యహూదా" తెగలోని ఒక వ్యక్తి అయిన "యహూదా" పేరు నుండి గ్రహించబడింది. ఏ యూదుడు కూడా దేవుని ఏకత్వాన్ని నమ్మినంత మాత్రాన యూదుడు కాలేడు. యూదు తల్లిదండ్రుల ఇంట పుట్టినవాడే యూదుడిగా పరిగణించబడతాడు. అంతేకాదు నాస్తికుడుగా మారిపోయినాసరే యూదుల దృష్టిలో అతడు యూదుడే.

యూదులలోని శాఖలు

కాతిబీన్ (లేఖకులు): మూసా బోధనలకు వ్యాఖ్యానం, వివరణలు చెప్పేందుకు రంగంలోకి వచ్చిన వారిని కాతిబీన్ అంటారు. వీరిని రబ్బానీలు అని కూడా అంటారు. వీరు ఒక స్థాయిలో ప్రభుత్వ న్యాయాధికారులుగా, మరో స్థాయిలో మతబోధకులుగా పనిచేస్తారు. చట్టం, ఆచార వ్యవహారాలలో, మత కర్మలలో సారూప్యత కలిగించడం వీరి ప్రథమ కర్తవ్యం.

ఫరిసెయ్యులు: వీరు దైవభక్తి పరాయణులు. మత నియమాలను, నైతిక విలువలను కాపాడటాన్ని వీరు తమ కర్తవ్యంగా భావిస్తారు. పరలోక శిక్ష, ప్రతిఫలాలపట్ల పూర్తి విశ్వాసం కలవారు.

సదీవతులు: ఈ వర్గంవారు దైవదూతలను, పరలోకం విచారణను విశ్వసించరు. దేవునికి మానవుల కర్మలతో సంబంధమే లేదంటారు.

జియోనిస్టులు: నేటి యుగంలో పాలస్తీనా పునస్సాధన కోసం ఈ వర్గం ఉనికిలోకి వచ్చింది. ఈనాడిది ప్రతి దేశంలోనూ తన రహస్య కార్య కలాపాలు సాగిస్తోంది. ఇది స్వరాజ్యం మరియు జాతీయ యాజమాన్య సిద్ధాంతాన్ని నమ్ముతుంది.

క్రైస్తవ మతం

క్రైస్తవులు తమను ఈసా (అలైహి) అనుచరులుగా చెప్పుకుంటారు. తాము క్రైస్తవ మత అనుచరులుగా భావిస్తారు. నిజమే. యూదుత్వంలాగే క్రైస్తవం కూడా ఇబ్రాహీమి మతంలోని ఒక శాఖ. యూదుత్వంతో దీనికి ప్రగాఢ సంబంధం ఉంది.

హజ్రత్ ఈసా (అలై) జననానికి పూర్వం పరిస్థితులు

హజ్రత్ ఈసా (అలై) జన్మించక పూర్వం యూదులు రోమ్ చక్రవర్తికి బానిసలుగా దయనీయ పరిస్థితిలో ఉండేవారు. మూఢనమ్మకాలు, దురాచారాలలో పాతుకుపోయి వుండేవారు. నిజదేవుడ్ని వదలి వీరు రకరకాల ఆచారాల బంధనాలలో చిక్కబడివుండేవారు.

మూసా (అలై) తెచ్చిన ధర్మంలో వీరి విద్వాంసులు, మత పెద్దలు తమ యిష్టానుసారం మార్పులు, చేర్పులు చేసుకున్నారు. ఇక మసీహ్ రావడమే తరువాయి, ఆయన తమను రోమ్ చక్రవర్తుల హింసా దౌర్జన్యాల నుండి విముక్తి కలిగిస్తాడని ఎదురుచూసేవారు. ఈ విషయం గురించి హజ్రత్ మూసా (అలై) తదితర ప్రవక్తలు భవిష్యవాణి పలికివున్నారు.

హజ్రత్ ఈసా (అలై) జననం

నేటికి రెండువేల సంవత్సరాలకు పూర్వం హేరోద్ పాలనా కాలంలో హజ్రత్ ఈసా (అలై) యెరూషలేమ్ సమీపంలోని బెత్లెహేమ్‌లో కన్య అయిన హజ్రత్ మర్యం (అలై)కు జన్మించారు. ఈయన బాల్యం నాటి పరిస్థితులపై మౌనం వహించడం జరిగింది. పవిత్ర ఖుర్‌అన్ ద్వారానే వాస్తవ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈయన ఉయ్యాలలో ఉన్నప్పుడే ప్రజలతో ఇలా మాట్లాడారు:

"ఇన్నీ అబ్దుల్లాహ్, ఆతానియల్ కితాబ వజఅల్‌నీ నబియ్యా."

భావం: నేను అల్లాహ్ దాసుడ్ని, ఆయన నాకు గ్రంథాన్ని యిచ్చాడు. నన్ను ప్రవక్తగా చేశాడు.

దీనితోపాటు దేవుడు మరెన్నో మహిమలను ఆయనకు ప్రసాదించాడు. ఆయన పుట్టుగ్రుడ్డివారికీ, కుష్టురోగులకూ స్వస్థత కలిగించారు. దైవాజ్ఞతో మృతులను బ్రతికించేవారు. ప్రజలు ఇంటి నుండి ఏమి తినివచ్చారో, తమ ఇళ్ళల్లో ఏమి దాచుకుని వచ్చారో ఆయన వారికి తెలిపేవారు.

పర్వతప్రాంత ప్రసంగం

హజ్రత్ ఈసా (అలైహి) ముప్ఫయి ఏళ్ళ వయసులో ప్రచారకార్యం ఆరంభించారు. మృతసముద్రతీరంలో వున్న ఒక గ్రామంలో ఆయన ఒక పెద్ద జనసమూహాన్ని ఉద్దేశించి ఇలా ప్రసంగించారు:

"నేను గత ప్రవక్తలనుగాని, వారు తెచ్చిన శాసనాలనుగాని ఖండించడానికి వచ్చానని భావించకండి. గతప్రవక్తలు తెచ్చిన సత్యసందేశం

వైపునకే మిమ్మల్ని పిలుస్తున్నాను. ఆ శాసనాలలోని ఒక్కో అక్షరం, ఒక్కో అంశంపై ఆచరణ జరగాలని నేను కోరుతున్నాను. సహనం, సంయమనాలతో పనిచేసేవారిపై దైవ కారుణ్యం వర్షించుగాక! శాంతిని, సంధిని పరిరక్షించడానికి ప్రయత్నిస్తున్నవారిపై దైవ కారుణ్యం వర్షించుగాక! అటువంటివారే దేవునికి ప్రియమయిన దాసులు. మీ పొరుగువారిని ప్రేమించమని మీకు తెలియజేయ బడింది. మిమ్మల్ని దూషించిన వారికోసం కూడా దైవాన్ని ప్రార్థించండి. మిమ్మల్ని ద్వేషించిన వారిపట్ల మంచిగా వ్యవహరించండి. మీపై అపవాదు వేసినవారికోసం కూడా దైవాన్ని ప్రార్థించండి."

క్రైస్తవులు దీన్ని ఎంతో ముఖ్యమైన ప్రసంగమని భావిస్తారు.

ఆ తర్వాత హజ్రత్ ఈసా (అలై) అనేక ప్రాంతాలకు వెళ్ళి ప్రసంగాలు చేస్తూ ప్రజలను సత్యధర్మం వైపునకు పిలిచారు. కాని దేవునికి ప్రియమయిన వారమని చెప్పుకునే యూదులు ఆయన్ని వ్యతిరేకించారు. చివరకు యెరూషలేమ్ మతవిద్వాంసులు ఆయనపై కుట్రతో నేరం మోపి రోమన్ గవర్నరు అయిన పొంటియస్ పిలాత్ (Pontius Pilate) చేత ఉరిశిక్ష విధింపజేస్తారు. హజ్రత్ మసీహ్ (అలై)ని శిలువపై ఎక్కించడంలో యూదులు సఫలురు కాలేదని, అల్లాహ్ మసీహ్‌ని తనవైపు పిలుచుకున్నాడని, అప్పుడు ప్రజల వ్యవహారం సందేహాస్పదమయిందని ఖుర్‌ఆన్ ఉటంకిస్తోంది.

మసీహ్ (అలై) బోధనలు

హజ్రత్ ఈసా (అలై) ఇచ్చిన సందేశం కొత్తదేమీ కాదు. అంతకు ముందు హజ్రత్ మూసా (అలై), హజ్రత్ ఇబ్రాహీం (అలై)లు ఇచ్చిన సందేశాన్నే ఆయనా ఇచ్చారు. ఆయన సందేశం ఇలా ఉంది:

- దేవుడు ఒక్కడే. ఆయన్నే ఆరాధించాలి.
- ఆకాశంలోని తండ్రి అందర్నీ ప్రేమిస్తాడు.
- పవిత్ర హృదయం, సదాచరణ అన్నింటికన్నా మంచి పనులు.

➢ మిత్రులనే కాదు, మీ శత్రువులను కూడా ప్రేమించండి.

➢ కీడుకు మేలుతో జవాబివ్వండి. ఎవరయినా మిమ్మల్ని ఒక చెంపపై కొడితే రెండో చెంప అతనికి చూపండి. ఎవరయినా మీ దుప్పటి తీసుకుంటే మీరతనికి మీ చొక్కాకూడా ఇచ్చేయండి.

క్రైస్తవ మత విశ్వాసాలు

క్రీస్తు- దైవకుమారుడు అనే విశ్వాసం

క్రైస్తవులలోని రోమన్ క్యాథలిక్ వర్గంవారు ఈసా (అలై)ను దేవుని కుమారుడని, ఆయనలో మానవఅంశం మచ్చుకైనా లేదని విశ్వసిస్తారు. ఈసా (అలై) తన మరణంద్వారా ప్రాయశ్చిత్తం చెల్లించి, వారి మోక్షానికి మార్గం సుగమం చేశారు. ఇప్పుడాయన మానవులకు మోక్షం ఇప్పించేవారు. దీనిని అంగీకరించగానే మానవుడు పాపపంకిలం నుండి పవిత్రుడయి ఆకాశ రాజ్యంలోకి ప్రవేశిస్తాడు. రోమన్‌లు, గ్రీకులు క్రీస్తు దేవుని కుమారుడు అనే విశ్వాసానికి బాగా ప్రాచుర్యం కలిగించారు.

త్రిత్వం గురించిన విశ్వాసం

హజ్రత్ ఈసా (అలైహి) ప్రజలను ఏకైక దేవునివైపు పిలుపునిచ్చారు. దైవత్వంలో తనకు భాగస్వామ్యం వుందని ఆయన ఎన్నడూ బోధించలేదు. క్రైస్తవం పాలస్తీనా దాటి బయట వ్యాపించినప్పుడు, యూదులుకానివారిలో దీని ప్రచారం జరిగినపుడు, ఏక దైవభావన కాస్తా ముగ్గురు దైవాల భావనగా మారిపోయింది. తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ. అంటే దేవుడు అందరికీ తండ్రి. ఆయన పరిపూర్ణ ప్రభువు. మసీహ్ దేవుని కుమారుడు. పైగా ఆయన దైవత్వం, మానవత్వాల సమ్మేళనం. బైబిల్ ప్రకారం హజ్రత్ మర్యమ్ (అలై) గర్భధారణకు కారణం పరిశుద్ధాత్మే (అంటే దైవదూత హజ్రత్ జిబ్రయీల్-అలైహి). కనుక పరిశుద్ధాత్మ కూడా దైవస్వరూపుడే.

అందువల్ల ఈ దేవుళ్ళందరి విగ్రహాలు చర్చిలలో ఉంచి వాటిని పూజిస్తారు. దాంతోపాటు ఫాదర్‌లకు కూడ దైవత్వస్థాయి వుంది. వారు తాము కోరిన వారికి స్వర్గపు సర్టిఫికేట్ ఇవ్వగలరు.

దైవమాత

క్రైస్తవుల మతసంఘం తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మలకు సమాన హోదానిచ్చి, త్రిత్వాన్ని మత సిద్ధాంతంగా ఆమోదించినప్పుడు కొందరికి, మర్యమ్‌పట్ల అన్యాయం జరిగింది, అసలు మసీహ్‌కు జన్మనిచ్చింది ఆమెయే కాబట్టి, త్రిత్వపు విశ్వాసంలో ఆమెకు స్థానం ఏదీ లభించలేదు అని భావించారు. అంచేత 440లో అలెగ్జాండ్రియాకు చెందిన పెద్దగురువు సైరల్ అమె దేవుని మాతగనుక మేరీ కన్యకు కూడ త్రిత్వంలో ఒక భాగంగా ఆమోదింపజేశాడు. అప్పటినుండి మర్యమ్ విగ్రహానికి కూడ పూజలు ఆరంభ మయ్యాయి. క్యాథలిక్ చర్చిలలో ఆమె విగ్రహం ఉంటుంది. మేరీద్వారా కోర్కెలు నెరవేరేందుకు క్రైస్తవులు ఆమెను కూడా ప్రార్థిస్తారు.

క్రైస్తవ మతంలోని శాఖలు

హజ్రత్ ఈసా (అలైహి) తదనంతరం క్రైస్తవులు అనేక శాఖలుగా చీలిపొయ్యారు. వాటిలో ఈ రెండు శాఖలు ప్రత్యేకించి చెప్పుకోదగ్గవి:

- క్యాథలిక్
- ప్రొటెస్టెంట్.

హజ్రత్ ఈసా (అలై)ను విశ్వసించినవారిలో మొట్టమొదటి వర్గం బెస్తవారు. వారిని హవారీలు అంటారు. వారు పన్నెండు మంది. తర్వాత కాలంలో వీరంతా ప్రవక్తలుగా పిలువబడ్డారు. హజ్రత్ ఈసా (అలై) తర్వాత వీరే క్రైస్తవ మతప్రచారం ఆరంభించారు. వారిలో ఇద్దరు సుప్రసిద్ధులు.

1) పేతురు: క్రీస్తును మొట్టమొదట విశ్వసించినవారిలోని వ్యక్తిగా పరిగణిస్తారు. తర్వాత అతడు రోమన్ చర్చ్‌కు ఫాదర్ అయ్యాడు. పోప్‌ల

వ్యవస్థ ఆరంభం ఈయనతోనే మొదలయింది. ఈయన పేరిట బైబిల్ క్రొత్త నిబంధనలో రెండు గ్రంథాలు చోటుచేసుకున్నాయి.

2) సెయింట్ పాల్: ఇతడ్ని పౌలస్ అని కూడా అంటారు. ప్రారంభంలో ఇతను క్రైస్తవవిరోధి అని అంటారు. కాని డెమాస్కస్ ప్రయాణంలో అకస్మాత్తుగా ఈయనకు క్రీస్తు ప్రత్యక్షమయ్యాడట. ఆ తర్వాత నుండి సెయింట్ పాల్, క్రియాశీలక క్రైస్తవమత ప్రచారకుడుగా మారిపొయ్యాడు. సెయింట్ పాల్ బోధనల్లో ప్రాయశ్చిత్త సిద్ధాంతం అన్నిటికన్నా ముఖ్యమైనది. క్రొత్త నిబంధనలో పధ్నాలుగు గ్రంథాలు ఈయన పేరిట వున్నాయి.

పోప్ అధికారాలు

రోమ్‌లోని క్యాథలిక్ చర్చి ఫాదర్ అధికారాలు ఒకప్పుడు విస్తృతంగా ఉండేవి. పోప్‌కు అత్యున్నత హోదా క్రీ.శ. 800 నుండి మొదలయ్యింది. పోప్ సూచన మేరకే రోమ్ సామ్రాజ్యానికి చక్రవర్తి ఎంపిక జరిగేది. అప్పట్లో పోప్‌కు రోమ్ చక్రవర్తిని మించిన వైభవం, పటాటోపాలు లభించేవి. ఆయన కిరీటంలో లక్షల విలువైన వజ్రాలు ఉండేవి. ఆయన ఒక పెద్ద మహలులో వుండేవాడు. కాని చర్చి తన అధికారాలను సక్రమంగా వినియోగించుకోలేక పోయింది. పోప్‌ను ఏమాత్రం ధిక్కరించినట్లు అనుమానంవచ్చినా అలాంటి వారిని వధించడం జరిగేది. 1481 నుండి 1818 వరకు మూడు లక్షల నలభయి వేల మందికి వివిధరకాల శిక్షలు వెయ్యబడ్డాయి. అందులో 32వేల మందిని భగభగ మండే అగ్నికి ఆహుతి చెయ్యడం జరిగింది.

సంస్కరణా ఉద్యమం

చివరకు పోప్‌ల దౌర్జన్యానికి వ్యతిరేకంగా కొందరు నడుంకట్టారు. వారిలో పీటర్ డోనాల్డ్, జాన్ వైక్లిఫ్, మార్టిన్ లూథర్‌లు సుప్రసిద్ధులు. చర్చి ద్వారా నానాటికి పెరిగిపోతున్న దౌర్జన్యం, రోజురోజుకీ శ్రుతిమించుతున్న మతవర్గాల విలాసజీవితానికి వ్యతిరేకంగా వారు ఉద్యమించారు. ప్రతి పట్టణంలోనూ మతం యొక్క అసలు సందేశాన్ని ప్రజలకు అందజేశారు.

అనేకులు వీరికి మద్దతు పలికారు. కాని వారు పోప్ ఆగ్రహానికి గురికావలసి వచ్చింది. దానికి ప్రతిక్రియగా ప్రజల పెద్ద సమూహం వారికి తోడయ్యింది. ఈ ఉద్యమం రోజురోజుకు బలం పుంజుకోసాగింది. అప్పట్లో ఈ ఉద్యమం పోప్ వ్యవస్థకు వ్యతిరేకంగా ఒక నిరసన కావటంచేత దానికి ప్రొటెస్టెంట్ అన్న పేరుపడింది. క్రమంగా వీరి చర్చీలు రోమన్ క్యాథలిక్కుల నుండి వేరుపడ్డాయి. ఇప్పుడు వీరు ఒక శాఖగా రూపొందారు.

క్రైస్తవంలోని పవిత్ర గ్రంథాలు

హజ్రత్ ఈసా (అలై) తన అనుచరులకు దైవిక బోధనల్ని ఇంజీల్ రూపంలో ఇచ్చారు. అవిప్పుడు ప్రపంచంలో ఎక్కడా లేవు. అయితే తర్వాత కాలంలో కొందరు తమకు జ్ఞాపకమున్న బోధనల్ని విడివిడిగా ప్రోగుచేశారు.

వాటి పేర్లు ఇవి:

1) ఇంజీల్ మాథ్యూస్

2) ఇంజీల్ లూకా

3) ఇంజీల్ మత్తయి

4) ఇంజీల్ యోహన్న.

ప్రస్తుతం వీటి అనువాదాలు కూడా బజారులో దొరుకుతున్నాయి.

క్రైస్తవ మతంలో ఆచారాలు

పోప్ వ్యవస్థలో కొన్ని ప్రత్యేక ఆచారాలు పాటించబడేవి. వాటిని ఫాదర్ మాత్రమే నిర్వర్తింపజేయగలడు. వాటిని విస్మరించేవాడు పరలోకంలో మోక్షానికి నోచుకోడన్న గట్టి విశ్వాసం వుండేది. అవి:

◆ మత నాయకుడు లేక ఫాదర్‌ను ఏర్పాటుచేసే ఆచారం.

◆ ఫాదర్ ఎదుట తన గతపాపాలను అంగీకరించడం. తద్వారా ఫాదర్ అతడ్ని పాపాల నుండి పునీతుడుగావించి, స్వర్గార్హత సర్టిఫికెట్ ఇవ్వటం.

◆ హజ్రత్ ఈసా (అలై)పై జరిగిన దౌర్జన్యాన్ని సంస్మరించుకునే ఆచారం లేక పవిత్రమైన రాత్రి. ఈ ఆచారం హజ్రత్ ఈసా (అలై) శిలువపై ఎక్కించబడటాన్ని గుర్తుచేసుకునేందుకు ప్రతిఏడూ డిసెంబర్ నెలలో జరప బడుతుంది. ఈ ఉత్సవంలో సారాయిలో ముంచబడిన రొట్టెను సభికులకు పంచుతారు. ఈ రొట్టె, సారాయి, హజ్రత్ ఈసా(అలై) రక్తంగా మారిపోతాయి, సభలో స్వయంగా ఈసా (అలై) పాల్గొంటారని వీరి నమ్మకం.

◆ వివాహ వేడుకలు చర్చికి వెళ్ళకుండా, ఫాదర్ అనుమతి లేకుండా జరగవు.

◆ మరణావస్థలో ఉన్నవాని తలపై ఫాదర్ నూనె మర్దన చెయ్యటం.

ఫాదర్‌ల గుత్తాధిపత్యం అంతమయిపోవాలని మార్టిన్ లూథర్ ఈ ఆచారాలన్నింటికీ వ్యతిరేకంగా పిలుపునిచ్చాడు.

ఇస్లాం ధర్మం

ప్రపంచంలోని పెద్ద మతాలలో ఒకటి ఇస్లాం. ఈ మతావలంబీకులు ప్రపంచంలోని ప్రతి భూభాగంలో ప్రతి దేశంలోనూ వున్నారు. జనాభానుబట్టి వీరి సంఖ్య వంద కోట్లు మించింది.

అయితే ప్రపంచంలోని ఇతర మతాలు ఒక ప్రత్యేక వ్యక్తి లేక వర్గానికి సంబంధించినవై ఉన్నాయి. అదేవిధంగా ఇస్లాం వ్యవహారమూ అలాంటిదే అని కొందరు అపోహకు గురయ్యారు. గౌతమ బుద్ధుడు స్థాపించాడు కనుక అది బౌద్ధమతం అయిందని, జొరాస్టర్ నడిపించిన మతం కాబట్టి అది జొరాస్టర్ మతం అయినట్లే, యూదు, క్రైస్తవ మతాల్లాంటిదే ఇస్లామ్ మతం కూడా అని వారు భావిస్తారు.

కాని ఇస్లాం వీటన్నింటికీ భిన్నంగా ఒక వ్యక్తి లేక జాతి స్థాపించిన మతం కాదు. లేక ఒక ప్రత్యేక భూభాగానికి చెందినదీ కాదు. ఇస్లాం ఆది మానవుడు జన్మించిన కాలమంత ప్రాచీనమయినది. ఈ సృష్టికి నిర్మాత

ఏకైక దేవుడయిన అల్లాహ్ అనీ, ఆయన దైవత్వంలో ఎవరూ భాగస్వాములు లేరని ఇస్లాం తెలుపుతోంది. ఈ సువిశాల సృష్టికి ఆయనే యజమాని. ఇక్కడ ఆయన తప్ప మరెవరి అధికారమూ చెల్లదు. అణువు మొదలు ఆకాశందాకా చీమ నుండి మానవుని వరకూ సమస్తమూ ఆయన ఆజ్ఞకు లోబడి వున్నాయి. సర్వాధికారాలూ ఆ యజమాని, పాలకుని చేతుల్లోనే వున్నాయి.

ఆ ప్రభువే ఆది మానవుడ్ని సృజించి అతనికి వివిధ శక్తి సామర్థ్యాలు అనుగ్రహించాడు. తర్వాత అతడి జంటను సృష్టించాడు. ఈ జంట సంతానమే లక్షల శతాబ్దాల తరబడి విస్తరిస్తూ, ప్రపంచమంతటా వ్యాపించింది.

ఆదిమానవుడ్నే ఆదమ్ అంటారు. దేవుడు ఆదమ్‌ను తన ప్రతినిధిగా, ప్రవక్తగా చేశాడు. తమ సంతానానికి సత్కార్యాలు, నైతికతల్ని గురించి బోధించమని ఆయన్ని ఆజ్ఞాపించాడు. "నీకు, యావత్తు సృష్టికి ఆరాధ్యుడు అల్లాహ్ మాత్రమే. ఆయనే నీ ప్రభువు, పోషకుడు, సంరక్షకుడు. ప్రాణం తీసేవాడు, బ్రతికించేవాడు ఆయనే. కనుక నీవు ఆయన్నే ఆరాధించు. ఆయన ఎదుట తలవంచు. సమస్త వ్యవహారాలలో ఆయన సహాయం అర్థించు. ఆయన అభీష్టానుసారమే జీవితం గడుపు." ఈ బోధనల పేరే ఇస్లాం.

హజ్రత్ ఆదమ్ (అలై) సంతతిలోని సజ్జనులు తమ తండ్రి చూపిన సన్మార్గంలో నడవసాగారు. కాని దుర్మార్గులు ఆ మార్గాన్ని వదలి తమ మనసుకు నచ్చిన విధానాలు అవలంబించారు. ఈ విధంగా వారిలో క్రమంగా రకరకాల చెడులు, అజ్ఞాన భావాలు చోటుచేసుకున్నాయి. మంచీ చెడుల విచక్షణాజ్ఞానం నశించింది.

దేవుడు మానవులకు సన్మార్గం బోధించడానికి ప్రతి యుగంలోనూ తన ప్రవక్తల్ని పంపుతూ వచ్చాడు. ఇలా దైవ ప్రవక్తలు ప్రతి జాతిలోనూ ప్రతి దేశంలోనూ ఉద్భవించారు. వీరు ఆదమ్ సంతానానికి వారు మరచిపోయిన పాఠాన్ని గుర్తుచేశారు. వారికి దైవాభీష్టం ప్రకారం నడచుకునే విధానం నేర్పారు. భారత్, చైనా, ఇరాక్, ఈరాన్, ఈజిప్టు, ఆఫ్రికా, యూరప్ మొదలైన అనేక దేశాలలో దైవప్రవక్తలు ఉద్భవించారు. ప్రపంచంలో ప్రవక్తలు ఉద్భవించని ప్రాంతం ఏదీ లేదు. ఆ ప్రవక్తలందరి ధర్మం ఒక్కటే. దాన్ని ఇప్పుడు అరబీ

భాషలో ఇస్లాం అంటున్నారు. అయితే ప్రజలు ప్రతిసారీ ప్రవక్తల బోధనల్ని విస్మరించేవారు. చివరిసారిగా దేవుని తరఫున ఈ బోధనలనే హజ్రత్ ముహమ్మద్ (సల్లం) కూడా ప్రజలకు అందజేశారు.

అనాడు అరేబియాలో అనేక దురాచారాలు, మూఢనమ్మకాలు ఉండేవి. విధ్వంసం, రక్తపాతం విచ్చలవిడిగా సాగేవి. మద్యసేవనం, జూదమాడటం ప్రజల నిత్యకృత్యాలుగా ఉండేవి. విగ్రహారాధన పరాకాష్ఠకు చేరింది. హజ్రత్ ఇబ్రాహీం (అలై) కాలంలో ఏకదైవారాధనా కేంద్రంగా ఉండిన కాబాలో ఆ తర్వాత క్రమంగా 360 విగ్రహాలు ప్రతిష్ఠించబడ్డాయి. అంతేకాదు, అనాడు ఆడపిల్లలను సజీవంగా పూడ్చిపెట్టే ఆచారం కూడా వుండేది.

దాదాపు ఇలాంటి పరిస్థితులే ప్రపంచంలోని ఇతర దేశాలలోనూ ఉండేవి. స్వార్థపరులు దైవ ప్రవక్తల బోధనల్ని మార్చివేశారు. దైవ గ్రంథాలలో తమ భావనల్ని జొప్పించి వక్రీకరణకు పాల్పడ్డారు. ఆరాధనల్లో తమ ఇష్టం వచ్చిన విధానాల్ని అవలంబించారు. దైవ ప్రవక్తలనే దేవుని అవతారాలుగా భావించి వారిని పూజించసాగారు. అంటే విగ్రహాలను నాశనం చెయ్యడానికి వచ్చినవారి విగ్రహాలనే తయారుచేసి ఆరాధించసాగారు. చక్రవర్తులకు దైవత్వం ఆపాదించబడింది. ప్రజలు తమ హక్కులు కోల్పోయి, బానిస జీవితం గడపటం తప్పనిసరి అయ్యేలా చేశారు. అప్పట్లో బానిసలపట్ల పశువుల్లా వ్యవహరించేవారు. భారతదేశంలో ఆర్యుల జాత్యోన్మాదంవల్ల అంటరానివారి వర్గం ఒకటి ప్రత్యేకంగా ఏర్పడింది. ఆ వర్గాన్ని సమాజంలో నీచదృష్టితో చూసేవారు. మద్యసేవనం, జూదమాడటం, అశ్లీల కార్యాలలో పాలుపంచుకోవడం సర్వసాధారణమయి పోయింది.

అంతిమ దైవ ప్రవక్త

ఇలాంటి కఠిన పరిస్థితులలో దేవుడు తన చివరి ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లం)ను మక్కా నగరంలోని ఖురైష్ వంశంలో పుట్టించాడు. ఆయన (సల్లం) బాల్యం నుండియే సత్యసంధుడు, నిజాయితీపరుడు. ఈ కారణంగానే ప్రజలు ఆయన్ని 'సాధిఖ్' అని, 'అమీన్' అని పిలిచేవారు.

పెద్దవారయిన తర్వాత కూడా ఆయన గుణగణాలు, నడవడికలు ఎంతో పవిత్రంగా వుండేవి. ఆయన ఏనాడూ అబద్ధం పలకలేదు, దుర్భాషలాడలేదు. ఆయన నిజాయితీని గమనించిన ప్రజలు తమ విలువయిన వస్తువులను ఆయన వద్ద భద్రపరచుకునేవారు. జాతి యావత్తూ ఆయన నిజాయితీని విశ్వసించేది. ఆయన దగ్గరికెళ్ళి తమ వివాదాలను పరిష్కరింపచేసుకునేవారు. ఆయన అందరి బాధలలో పాలుపంచుకునేవారు. అనాధలు, వితంతువులు, అగత్యపరులను ఆదుకునేవారు. ఆయన వంశంవారు విగ్రహారాధన చేసే వారు. కాని ఆయన ఏనాడూ అటువైపు దృష్టి సారించలేదు.

కాని తన జాతిలో నెలకొన్న ఈ పరిస్థితుల్ని చూసి ఆయన బాధపడు తుండేవారు. చివరకు ఆయన ఈ అజ్ఞాన, అనైతిక, దుష్టచేష్టలపట్ల విసుగెత్తి జనావాసాలకు దూరంగా ఒక కొండగుహలోకెళ్ళి ఒంటరిగా దైవ చింతనలో గడపసాగారు. తన జాతికి పట్టిన దుర్గతిని, సమాజంలో నెలకొన్న కాలుష్యాన్ని ఎలా దూరం చేయాలా అని పరిపరి విధాలా ఆలోచిస్తుండేవారు.

ఒక రోజు అకస్మాత్తుగా ఆయనకు సత్యజ్ఞానం లభించింది. ఆయన గుహ నుండి బయటికి వచ్చి తన జాతివారికి సత్యసందేశం వినిపించారు. "మీరు పూజిస్తున్న ఈ విగ్రహాలు ఎందుకూ కొరగానివి. ఈ ప్రపంచానికి అసలు యజమాని, దేవుడయిన అల్లాహ్ మాత్రమే. ఆయనకు సాటి ఎవరూ లేరు. ఆయనే సమస్తాన్నీ సృష్టించాడు. కాబట్టి అందరినీ వదలి ఆయన్నే ఆరాధించండి. సత్యం పలకండి. పుణ్యకార్యాలు చేస్తూ పవిత్ర జీవితం గడపండి. ఎవరి సొమ్మూ అన్యాయంగా కబళించకండి. సారాయి, జూదం, వ్యభిచారం- ఇవన్నీ పాపకార్యాలు, వాటిని మానేయండి."

ఆయన (సల్లం) మానవులందరూ ఒకే తల్లిదండ్రుల సంతానం అని కూడా చెప్పారు. "కాబట్టి అందరూ సమానులే. రంగు, జాతి, వంశం, దేశం ఏవీ ఆధిక్యతకు కారణం కావు. మీలో అందరికన్నా ఎక్కువ దైవభీతి కలవాడే దేవుని దృష్టిలో అందరికన్నా శ్రేష్ఠుడు. గుర్తుంచుకోండి, ఈ జీవితం ఒకనాడు అంతమయిపోతుంది. తిరిగి దేవుడు తలచుకున్నప్పుడు మానవులందర్నీ బ్రతికిస్తాడు. ఆ రోజు కర్మవిచారణ జరుగుతుంది. అక్కడ ఎటువంటి సిఫారసు

గానీ, ఏ విధమైన లంచంగానీ స్వీకరించబడవు. అక్కడ సరైన విశ్వాసాలు, సత్కార్యాలు మాత్రమే పనికొస్తాయి. ప్రపంచంలో జీవితాంతం సత్కర్మలు ఆచరిస్తూ పవిత్ర జీవితం గడిపినవారు స్వర్గంలో ప్రవేశిస్తారు. దుష్కర్మలు చేసినవారు నరకానికి పోతారు."

ఇవన్నీ మనస్సును ఆకట్టుకునే మంచి మాటలు, జీవితాన్ని తీర్చిదిద్దే విషయాలు. కాని మూఢులైన అరబ్బులు వాటిని పెడచెవిన పెట్టి మహనీయ ముహమ్మద్ (సల్లం)కు శత్రువులయిపోయారు. అయన్ని రాళ్ళతో కొట్టారు. జీవితం దుర్భరంచేశారు. ఆఖరికి చంపడానికి కూడా సిద్ధపడ్డారు. ఒకటి రెండు రోజులు కాదు, పదమూడు సంవత్సరాలపాటు దుర్భర దౌర్జన్యాలకు గురి చేశారు. చివరకి ఆయన స్వస్థలం విడిచి మదీనాకు వలస పోవలసి వచ్చింది. ఆతర్వాత కూడా వారు ఆయన్ని ప్రశాంతంగా ఉండనీయలేదు. పెద్ద పెద్ద సైన్యాలతో దాడులు చేశారు. వాటిని ఆయన ఎదుర్కొన్నారు. చివరకు అజ్ఞానయుగం అంతరించింది. బహుదైవారాధనా మేఘాలు చెదరి పోయాయి. ప్రపంచంలో ఏకేశ్వరోపాసన పరిఢవిల్లింది. హిజ్రీ శకం 11వ సంవత్సరం, రబీవుల్ అవ్వల్ మాసం 12వ తేదీన ఆయన పరమపదించారు. ఆయన కాలంలోనే అరేబియా మొత్తం ఆయన పాదాక్రాంతమయ్యింది. ఆ తరువాత ఇస్లాం ప్రపంచంలోని ఇతర అనేక దేశాలకు విస్తరించింది.

దైవ గ్రంథం, ప్రవక్త సంప్రదాయం

దైవ గ్రంథం అంటే దివ్య ఖుర్ఆన్. దేవుడు మూసా, దావూద్, ఈసా (అలైహి)లపై తన గ్రంథాలను అవతరింపజేసినట్లే తన చిట్టచివరి ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లం)పై ఖుర్ఆన్‌ను అవతరింపజేశాడు. దైవ గ్రంథాలన్నింటిలో ఇది అన్నింటికన్నా చివరి గ్రంథం. ఇదిప్పుడు ప్రపంచంలో లభిస్తున్న గొప్ప ప్రామాణిక గ్రంథం.

దివ్య ఖుర్ఆన్ అవతరించక పూర్వం మానవుడు అసంఖ్యాక దేవుళ్ళకు బానిస అయ్యాడు. అతడి కాళ్ళకు చక్రవర్తులు, పురోహితులు, పెట్టుబడి దారుల పెత్తనపు సంకెళ్ళు పడివున్నాయి. అతడికి తన నిజస్థానం ఏమిటో,

హోదా ఏమిటో తెలియదు. ఖుర్‌ఆన్ అతడికి అతని నిజస్థానం ఏదో తెలియ జేసింది. ఈ విశ్వానికి ఒక ప్రభువు వున్నాడు, విధేయతకు అర్హుడు ఆయనే, ఆయన ఆజ్ఞల్నే పాటించాలి. ఆయన చూపిన చట్టం ప్రకారమే నడుచుకోవాలి. ఆయన ఆగ్రహం నుండే తప్పించుకోవాలి. ఇతర దేవుళ్ళందరూ బూటకపు దేవుళ్ళు. ఈ బూటకపు దేవుళ్ళను ధిక్కరించనంత వరకూ మోక్షం లభించదని కూడా ఖుర్‌ఆన్ తెలిపింది.

దీంతోపాటే, అజ్ఞానభావనలు, మూఢాచారాలను ఖండించింది. ప్రజల గుణగణాలు, కర్మలను మార్చింది. వారి సమాజం, సంప్రదాయాలు, సభ్యతా సంస్కృతులను సమూలంగా సంస్కరించింది. వారి రాజకీయాన్నీ మలుపు తిప్పింది. ఖుర్‌ఆన్ ఒక సందేశాత్మక గ్రంథం. అది మానవ జీవితంలో సంపూర్ణ విప్లవం తెచ్చింది. ప్రజలు ఏమరుపాటుతో మరచిపోయిన గత ప్రవక్తల బోధనల్ని వారికి మరోమారు గుర్తుచేసింది.

దివ్య ఖుర్‌ఆన్ సృష్టికర్త తరపు నుండి, ఆయన పవిత్ర దూత ద్వారా దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లం)పై అవతరించింది. దైవసందేశ అవతరణ విధానాన్నే "వహీ" అని అంటారు. హిరా కొండగుహలో హజ్రత్ ముహమ్మద్ (సల్లం)పై మొట్టమొదటిసారిగా వహీ అవతరించింది. ఈ పరంపర ఇరవై మూడేళ్ళ వరకు కొనసాగింది. సమయం సందర్భాలనుబట్టి ఆదేశాలు అవతరిస్తూ వుండేవి. వాటిని అప్పటికప్పుడు కంఠస్థం చేయించడం జరిగింది. ప్రతి సూక్తిని వ్రాసివుంచడం జరిగింది. ఈ విధంగా అనేక జాగ్రత్తలతో పూర్తి ఖుర్‌ఆన్ ఆయన (సల్లం) జీవితకాలంలోనే గ్రంథస్థం చేయబడింది. ఆ తరువాత నలుగురు శ్రేష్ఠ ఖలీఫాల కాలంలో ఖుర్‌ఆన్ నకళ్ళు చేయించి వివిధ ప్రాంతాలకు పంపబడ్డాయి. అంతేకాక ఖుర్‌ఆన్‌ను ఆనాడు కూడా కంఠస్థం చేసే ఆసక్తి, ఉత్సాహం ప్రజల్లో ఉండేది. కనుక ఖుర్‌ఆన్‌ను ప్రస్తుతం వున్న ఆయతుల, సూరాల క్రమం ప్రకారం వారు ఆనాటి నుండీ కంఠస్థం చేస్తూ, రమజాన్ మాసంలో తరావీహ్ నమాజ్‌లో పూర్తి ఖుర్‌ఆన్ పఠిస్తూ వచ్చారు. ఈ విధంగా ప్రతి కాలంలో ప్రతి దేశంలో ఖుర్‌ఆన్‌ను కంఠస్థం

చేసినవారు (హాఫిజ్‌లు) వుంటూ వచ్చారు. అందువల్ల దైవ గ్రంథాలన్నింటిలో ఒక్క ఖుర్‌ఆన్ మాత్రమే షైతాన్ బారిన పడకుండా సురక్షితంగా వుందని చెప్పవచ్చు.

సున్నత్ (మహాప్రవక్త సంప్రదాయం)

సున్నత్ అంటే విధానం, మార్గం అని శాబ్దిక అర్థాలు ఉన్నాయి. కాని పారిభాషిక అర్థంలో మహనీయ ముహమ్మద్ (సల్లం) దైవప్రవక్త అయిన తర్వాత చెప్పిన మాటలను, చేసిచూపిన పనులను "సున్నత్" అంటారు. ఇస్లాం ధర్మంలో దివ్య ఖుర్‌ఆన్ తర్వాత స్థానం సున్నత్‌దే. 23 సంవత్సరాల వ్యవధిలో మహాప్రవక్త(సల్లం) ఎల్లవేళలా బోధనా, శిక్షణల కార్యంలో నిమగ్నులయి ఉండేవారు. దైవాభీష్టం ప్రకారం జీవితం గడిపే విధానం ఏదో, ఆయన తన మాటల ద్వారా, చేతల ద్వారా ప్రజలకు తెలియజేస్తూ వచ్చారు. ఆయన ప్రవచనాలను అనుచరులు శ్రద్ధగా విని గుర్తుంచుకున్నారు. మరికొందరు వాటిని వ్రాసుకున్నారు. ఈ విధంగా దైవప్రవక్త (సల్లం) మాటలు, చేతలు ఒకచోట కూర్చబడ్డాయి. వాటినే హదీసులు అంటారు. ఇవి అనేక గ్రంథాలలో ఉన్నాయి. వాటిలో ఇమామ్ మాలిక్ (రహ్మాలై), ఇమామ్ బుఖారీ (రహ్మాలై), ఇమామ్ ముస్లిం (రహ్మాలై), ఇమామ్ తిర్మిజీ (రహ్మాలై), ఇమామ్ అబూదావూద్ (రహ్మాలై), ఇమామ్ నసాయి (రహ్మాలై), ఇమామ్ ఇబ్నుమాజ (రహ్మాలై) గార్ల గ్రంథాలు ఎంతో ప్రామాణికమైనవిగా భావించబడుతున్నాయి.

ఈ హదీసు గ్రంథాలు రూపొందటానికి మరో కారణం కూడ వుంది. దైవప్రవక్త (సల్లం) తన మాటలను విన్నవారు వాటిని వినలేకపోయినవారికి అందజేయాలని ఉపదేశించి వున్నారు. అందువల్లనే ప్రవక్త ప్రవచనాలను ఇతరులకు అందజేయలేదన్న ఆరోపణ తమపై రాకూడదన్న ఉద్దేశ్యంతో కొందరు అవసాన దశలో వున్నప్పటికీ వాటి ప్రచార, ప్రచురణా కార్యక్రమాన్ని కొనసాగించారు.

ఇస్లాం మౌలిక విశ్వాసాలు

మానవుడు ఏదైనా సిద్ధాంతం అవలంబించడం ద్వారా ఏర్పరచుకున్న పరిపక్వ భావాలను అఖీదా (నమ్మకం) అంటారు. పరిపక్వ నమ్మకాన్నే ఈమాన్ (విశ్వాసం) అని కూడా అంటారు. దీన్ని గురించి మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) అయిదు సూత్రాలు బోధించారు.

దేవుని పట్ల విశ్వాసం

ఈ సువిశాల విశ్వవ్యవస్థకు, అందులోని యావత్తు సృష్టితాలకు సృష్టికర్త, యజమాని, ప్రభువు, పోషకుడు ఒక్క దేవుడు మాత్రమే. ఆయనే అల్లాహ్. ఆ పరమ ప్రభువు దైవత్వంలో, గుణగణాలలో, శక్తిసామర్థ్యాలలో ఆయనకు మరెవరూ సాటి లేరు. గోచర, అగోచర విషయాలన్నీ ఆయన దృష్టి పథంలో ఉన్నాయి. ఈ విధంగా మనిషి తన సృష్టికర్తను విశ్వసించిన తర్వాత సమస్త పాపకార్యాలను విడనాడి, పుణ్యకార్యాలను అవలంబించడం, దుష్టభావాలను మనసులోకి రానీయకుండా పవిత్ర జీవితం గడపడం అతని విధి అవుతుంది.

దైవదూతలపై విశ్వాసం

దైవదూతలు (ఫరిష్తే) దేవుని సామ్రాజ్యంలోని కార్యకర్తలు. వీరు జోతితో సృష్టించబడ్డారు; మానవుల కంటికి కన్పించని అగోచర జీవులు. వారు ఎల్లప్పుడూ దైవారాధనలో నిమగ్నులయి వుంటారు. స్వభావరీత్యా దైవదూతలు అల్లాహ్ ఆజ్ఞలకు బద్ధులయి ఉంటారు. వారిలో నలుగురు దైవదూతలు ముఖ్యమైనవారు.

★ హజ్రత్ జిబ్రయీల్ (అలైహి):

ఈయన దైవసందేశాన్ని దైవప్రవక్తలకు అందజేసే దైవదూత.

★ హజ్రత్ ఇస్రాఫీల్ (అలైహి):

ఈయన ప్రళయ దినాన శంఖం పూరించే దైవదూత.

★ **హజ్రత్ మీకాయిల్ (అలైహి):**

ఈయన వర్షం కురిపించే, ఆహార ఏర్పాట్లుచేసే పనుల కోసం నియమించబడిన దైవదూత.

★ **హజ్రత్ ఇజ్రాయీల్ (అలైహి):**

ఈయన మానవుల ప్రాణాలు తీసే దైవదూత.

బహుదైవారాధకులు దైవదూతల్ని దేవుని సంతానంగా భావించి వారి కల్పితరూపాల విగ్రహాలు చేసి వాటిని పూజిస్తుండేవారు. కాని దైవదూతలు కూడ దేవుని సృష్టితాలే అని, దైవత్వంలో వారికి ఎటువంటి ప్రమేయమూ లేదని, వారు ఎవరి గురించీ సిఫారసు చేయలేరని, అందువల్ల వారిని ఆరాధించడం అజ్ఞానం అని ఇస్లాం మనకు తెలిపింది.

దైవప్రవక్తలపై విశ్వాసం

హజ్రత్ ఆదమ్ (అలైహి) నుండి హజ్రత్ ముహమ్మద్ (సల్లం) వరకు ఎందరో ప్రవక్తలు అల్లాహ్ అభీష్టం ఏమిటో ప్రజలకు తెలియజేయడానికి పంపబడ్డారు. దైవప్రవక్తలు వివిధకాలాల్లో, వివిధజాతుల్లో ఉద్భవించిన పుణ్య పురుషులు. తాము దైవాదేశాల ప్రకారం జీవితం గడిపి అనుచరుల ఎదుట ఓ సమగ్ర ఆదర్శం ప్రదర్శించేందుకు పంపబడిన మానవోత్తములు. దైవప్రవక్త లంతా ఇస్లాంధర్మాన్నే బోధించారు కనుక వారందర్నీ విశ్వసించటం అవసరం. వారిలో ఏప్రవక్తను తిరస్కరించినా దేవుడ్ని తిరస్కరించినట్లే అవుతుంది. కాబట్టి వారంతా సృష్టికర్తచేత నియమించబడిన ప్రవక్తలని విశ్వసించాలి.

దైవగ్రంథాలపై విశ్వాసం

దేవుడు తన దాసులకు సన్మార్గం చూపడానికి ప్రతియుగంలో, ప్రతి జాతిలో, ప్రతిదేశంలో తన ప్రవక్తలను పంపే ఏర్పాటుచేశాడు. వారిలో కొందరు ప్రవక్తలకు తన బోధలను గ్రంథరూపంలో ప్రసాదించాడు. ఉదాహరణకు- హజ్రత్ మూసా (అలై)పై తౌరాత్, హజ్రత్ దావూద్ (అలై)పై జబూర్, హజ్రత్ ఈసా (అలై)పై ఇంజీల్ గ్రంథాలు అవతరించాయి. ఇవి విశ్వసించదగిన సత్యపూరితమైన దివ్యగ్రంథాలు.

అయితే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)కు పూర్వం వచ్చిన ప్రవక్తల బోధనలు ఒక ప్రత్యేక కాలానికి, ఒక ప్రత్యేక జాతికే పరిమిత మయ్యాయి. పైగా ఆ బోధనలు కాలక్రమంలో అనేక మార్పులు, చేర్పులకు గురయి వాటిలో దైవప్రోక్త విషయాలేమిటో, మానవ మేధాజనిత విషయా లేమిటో తెలుసుకోలేనంతగా మారిపోయాయి. అందువల్ల ఆ బోధనలను ఇప్పుడు మనం అనుసరించలేము. వాటికి భిన్నంగా అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) తెచ్చిన ఖుర్‌ఆన్ బోధనలు ఎలాంటి మార్పులకు గురికాకుండా ఈనాటికీ సురక్షితంగా ఉన్నాయి. ముస్లింలు ఖుర్‌ఆన్‌ని కంఠస్థం చేసి పారాయణంచేసే పరంపర గత 1400 సంవత్సరాల నుంచి కొనసాగుతోంది. ఈనాడు కూడా ప్రపంచ వ్యాప్తంగా లక్షల మంది ఖుర్‌ఆన్ స్మర్తలు (హాఫిజ్‌లు) ఉన్నారు. అదీగాక ప్రతి సంవత్సరం రమజాన్ నెలలో మసీదుల్లో పూర్తి ఖుర్‌ఆన్ పఠించే, వినే సంప్రదాయం కూడా కొనసాగుతోంది. మరణానంతరం మానవుని జీవిత పర్యవసానం ఖుర్‌ఆన్ బోధనలపైన్నే ఆధారపడి ఉంటుంది. కాబట్టి సత్యాన్ని ప్రేమించేవారు వాటిని విశ్వసించ వలసిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రపంచంలోని వివిధ జాతుల వద్ద ఉన్న మత గ్రంథాలలో ఏ ఒక్కటీ ఫలానా కాలంలో అవతరించిందన్న చారిత్రక ఆధారాలు మనకు లభించవు. ఖుర్‌ఆన్‌లోని ఒక్కొక్క విషయాన్ని అది ముమ్మాటికీ దైవవాణి అని చారిత్రక దర్పణంలో రుజువు చేయవచ్చు.

ఇతర మతగ్రంథాలు ఒక ప్రత్యేక జాతిని సంబోధించాయి. కాని ఖుర్‌ఆన్‌లో మానవుడ్ని సంబోధించడం జరిగింది. అంటే యావత్తు మానవులు దాని సంబోధితులు అన్నమాట. ఈవిధంగా ఖుర్‌ఆన్ బోధనలు సార్వజనీన మైనవి, సార్వకాలికమైనవని తెలుస్తోంది.

పరలోకం గురించిన నమ్మకాలు

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) పరలోకాన్ని కూడా విశ్వసించాలని అన్నారు. మరణానంతగం పరలోకంలో సంభవించే పునరుత్థానం (Resur-

rection), కర్మల విచారణ, స్వర్గనరకాల రూపాలలో పుణ్యఫలం, పాపఫలితం మొదలైన విషయాలను విశ్వసించనిదే మానవులకు మోక్షం లభించదు. అందువల్ల మహాప్రవక్త (సల్లం) దీన్ని గురించి ఇలా నొక్కి చెప్పారు. "ఒకరోజు దేవుడు సమస్త లోకాల్ని, ప్రాణుల్ని అంతమొందిస్తాడు. ఆ రోజుపేరు ఖియామత్ (ప్రళయ దినం). తిరిగి ఆయన అందర్నీ తాను కోరినప్పుడు బ్రతికిస్తాడు. ప్రపంచజీవితంలో చేసిన కర్మలను గురించి లెక్క తీసుకుంటాడు. దేవునికి, దైవప్రవక్తకు విధేయులయి పుణ్యకార్యాలు చేసినవారు స్వర్గానికి పోతారు. వారికి అవిధేయులయి పాపకార్యాలు చేసినవారు నరకంలో విసిరేయబడతారు."

పరలోకం గురించిన విశ్వాసాలు

పరలోకం గురించి ప్రపంచంలో ముఖ్యంగా మూడు రకాలయిన విశ్వాసాలు ఉన్నాయి.

- మొదటి వర్గం విశ్వాసం: మనిషి మరణించిన తర్వాత నశిస్తాడు. ఆ తర్వాత ఎటువంటి జీవితమూ ఉండదు- ఈ విశ్వాసం కలవారు నాస్తికులు.
- రెండో వర్గం విశ్వాసం: మనిషి కర్మల ఫలం అనుభవించటానికి ప్రపంచంలో అనేకసార్లు జన్మిస్తాడు. ఈ విధంగా 84 వేల సార్లు జన్మనెత్తిన తర్వాత అతడికి మోక్షం లభిస్తుంది.
- మూడో వర్గం విశ్వాసం: వీరు ప్రళయం, పునరుత్థానం, దైవదర్బారులో హాజరుకావటం, కర్మవిచారణ, స్వర్గనరకాలను విశ్వసిస్తారు. ఇది దైవప్రవక్తలు, వారి అనుచరుల విశ్వాసం. ఇది బుద్ధికి అనుగుణమైనది, హేతుబద్ధమైనది. మొదటి వర్గం విశ్వాసం వెనుక ఎలాంటి హేతువు, నిరూపణలు లేవు. రెండో వర్గం విశ్వాసం ప్రకారం ప్రతి జన్మకు ముందు ఒక జన్మ అంటూ ఉండటం అవసరం. తద్వారా ఈ రెండవ జన్మను మొదటి జన్మ కర్మల ఫలితం అని చెప్పడానికి ఆస్కారం ఏర్పడుతుంది. అయితే ప్రతి జన్మలోనూ పాపాల చిట్టా

తప్పక తయారవుతుంది. ఈ పరంపర ఎన్నటికీ అంతం కాదు. ఇది బుద్ధికందని విషయం.

మతంలో కానవచ్చే సమిష్టి విషయాలు

వెనుకటి పేజీలలో నేను వివిధ మతాల మౌలిక బోధనల్ని సంక్షిప్తంగా పేర్కొన్నాను. వాటి ద్వారా ఈ క్రింది విషయాలు స్పష్టమవుతాయి:

❀ అన్ని మతాలలో (దైవభావన) దేవుని అస్తిత్వం ఏదో ఒక రూపంలో కనబడుతోంది.

❀ అన్ని మతాలూ న్యాయం, సత్యం, సదాచరణలను గురించి నొక్కి చెబుతున్నాయి.

❀ అన్ని మతాలూ దైవారాధనను దినచర్యలో తప్పనిసరి భాగంగా పరిగణిస్తున్నాయి.

❀ దాదాపు ముఖ్యమైన మతాలన్నిటిలో శిక్షా, బహుమానాలపై విశ్వాసం వుంచడం అవసరమని ఉంది.

❀ అన్ని మతాలలో ఇతరులకు సేవ చేయడం, గ్రుడ్డివారికి దారి చూపడం, అన్నార్తులకు భోజనం పెట్టడం, వస్త్రహీనులకు వస్త్రదానం చేయడం గురించి నొక్కి చెబుతున్నాయి. అంతేగాక-

❀ ఫిన్లాండ్, హంగరీ, టర్కీ, అరేబియా వాసులు తప్ప, యూరప్‌లోని జాతులన్నీ ఆర్యసంతతితో సంబంధం కలవారే. వీరు ఈరానియన్లు, హిందువులకు గొప్ప వారసులు. ఈ జాతులన్నింటిలోనూ జాత్యాభిమానం, జాత్యహంకారం ఆది నుండే ఉంటూవస్తోంది.

❀ దేవతల భావన చరిత్రకాలం ముందునుంచే ప్రపంచ జాతులన్నిటిలోనూ ఉండేది. ఈ దేవతలలో కొందరు జాతి నాయకులను కూడా చేర్చారు. హిందువులలో రాముడు, కృష్ణుడు; గ్రీకుల ఆకాశ దేవుడు ఒలంపస్ పర్వతంపై వుండేవాడు. అక్కడే ఆయన స్వర్గం వుండేది.

ఈరానీయులలో కూడా అల్‌బర్జ్ పర్వతానికి ఇలాంటి ప్రత్యేకతే వుండేది. అలాగే హిందువుల దేవుడు కైలాస పర్వతంపై ఉన్నాడు.

❀ కొన్ని దేశాలలో కొందరు దేవతలు ప్రతి ఏడూ మరణించేవారూ, తిరిగి బ్రతికేవారు. ఆ సందర్భంగా ప్రజలు వారి ఉత్సవాలు అట్టహాసంగా జరిపేవారు. ఊరేగింపులు, రకరకాల వేషాల వేడుకలు జరిగేవి. పంటలు చేతికి రావడం, వసంతకాలం రూపంలో భూమి పంటలు పండించే శక్తి కోల్పోవడం జరిగినప్పుడు ఈ ఉత్సవాలు, వేడుకలు జరుపుకుంటారు. లేదా భారతదేశంలో హోలీ, దీపావళి పండుగల్లా జ్ఞాపకార్థం జరుపుకుంటారు.

ఇవేగాక ప్రాచీన మతాలన్నింటిపై దృష్టి సారిస్తే ఈ క్రింది విషయాలు కూడా తెలుస్తాయి:

1) మూఢకాలంలో మనిషి తనకు సంబంధించిన ఒక నీడ లేక ప్రతిబింబం ఉండేదని, తాను చనిపోయిన తరువాత తన ఆత్మ ఈ లోకంలోనే వుంటుందని నమ్మేవాడు.

2) పవిత్రాత్మలు, అపవిత్రాత్మలు అని రెండు రకాల ఆత్మలుంటాయని, అవి మనుషులకు లాభంగాని, నష్టంగానీ కలిగిస్తాయని నమ్మేవారు.

3) సృష్టిలోని భూమి, గాలి, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు వగైరా ప్రతి వస్తువులో దేవతలు లేక ఆత్మల భావన జనించింది. దాంతో అవి వందలాది దేవతలుగా మారిపోయాయి.

4) అసంఖ్యాక దేవతలలో కొందరికి ఉన్నత స్థానం ఇవ్వబడింది. వారిలో దైవత్వం వుందని నమ్మేవారు.

5) అనేక దేవతలపై ఒక దేవతను పెద్ద దేవతగా పరిగణించి ఆ దేవతను దేవదేవుడని లేదా పరమేశ్వరుడని నమ్మేవారు.

6) దేవతల ఊహాచిత్రాలు కల్పించబడ్డాయి. వాటిని మట్టితో, కంచుతో, రాగితో, బంగారంతో విగ్రహాలుగా మలచి ఒక ప్రత్యేక స్థానంలో వుంచి పూజించటం ఆరంభించారు.

7) విగ్రహాల ముందు నృత్యం చేయడం, పాటలు పాడటం, హారతి ఇవ్వడం, నైవేద్యం సమర్పించడం తప్పనిసరి చేయబడ్డాయి.

మతాలలోని వ్యత్యాసాలు

వివిధ మతాల అధ్యయనం ద్వారా బుద్ధికందని ఎన్నో విషయాలు ముందుకు వస్తాయి.

◆ ఉదాహరణకు కొన్ని మతాలు దైవాన్ని సర్వశక్తిమంతుడుగా అంగీకరిస్తూనే ఆయనకు వందలాది రూపాలు వున్నాయని అంగీకరిస్తారు. దీనివల్ల బహుదైవారాధన పరిధి విస్తృతమయి మానవ ఉత్కృష్టత ఈ ఊబిలో పడి దిగజారిపోతుంది. చెట్లు, కొండలు, జంతువులు, సముద్రాలు, సజీవులు మృతులయిన మానవులు, రాతి విగ్రహాల ముందు మోకరిల్లుతూ మానవుడు తన మానవీయ ఉత్కృష్టతను గురించి ప్రశాంత మనస్సుతో ఆలోచిస్తే అవి అతనికే నవ్వు కలిగిస్తాయి. మానవ స్వభావం విచిత్రమైనది. మరపు అతని వెన్నంటి వుంటుంది. అందుకే అతడు తన స్థాయిని, సర్వశక్తిమంతుడైన తన సృష్టికర్తను మరచి నీచమైన వస్తువుల ఎదుట తల వంచుతున్నాడు. ఇంతకంటే దిగజారుడుతనం మరేముంటుంది? బహుశా అతడు సృష్టికర్త, సర్వశక్తిమంతుడైన దేవుడ్ని ప్రాపంచిక చక్రవరఉత్తల్లాంటివానిగా భావిస్తున్నాడు కాబోలు!

ఈ సందర్భంగా మౌలానా మౌదూదీ (రహ్మలై) గారి "రిసాలె దీనియాత్" పుస్తకంలోని కొన్ని విషయాలు గమనార్హమైనవి. మౌలానా మౌదూదీ (రహ్మలై) మానవుని వింత ప్రవృత్తిని విశ్లేషిస్తూ ఇలా వ్రాశారు:

"మానవుడు అనాది నుండి ఒక పెద్ద దేవుడ్ని అంగీకరిస్తున్నాడు. ఆయన్ని అతడు అల్లాహ్ అని, పరమేశ్వరుడని, పరబ్రహ్మ అని, దేవదేవుడని వివిధ పేర్లతో పిలుస్తున్నాడు. కాని ఆరాధనా విషయానికి వచ్చేటప్పటికి ఆ దేవుడి దైవత్వంలో చిల్లర దేవుళ్ళను కూడా చేర్చుతున్నాడు. దైవత్వం కూడ ప్రపంచ వ్యవహారాల్లాంటిదే అని భావిస్తున్నాడు. ప్రపంచంలో

ఒక చక్రవర్తికి అనేకమంది మంత్రులు, కార్యదర్శులు, సేనాపతులు, ఇతర అధికార్లు వున్నట్లే ఈ సృష్టికి కూడా ఒక పెద్ద దేవుడు ఉన్నాడని, ఆయన క్రింద ఎందరో చిన్న దేవుళ్ళు వున్నారని, ఆ చిన్న దేవుళ్ళను ప్రసన్నం చేసుకోనిదే, పెద్ద దేవుడి సాన్నిధ్యం పొందడం సాధ్యం కాదని భావిస్తున్నాడు. కనుక ఆ దేవుళ్ళను కూడా ఆరాధించాలి, వారి ముందు కూడా తలవంచాలి. వారి ఆగ్రహానికి కూడా భయపడాలి. వారిని పెద్ద దేవుణ్ని చేరుకునే సాధనాలుగా చేసుకోవాలి. మొక్కుబడులు, నివేదనల ద్వారా నైవేద్యం, సమర్పణల ద్వారా వారిని కూడా తృప్తిపరచాలి అని మనిషి భావిస్తున్నాడు." (రిసాలె దీనియాత్- పేజి. 86)

మరో చోట ఇలా వ్రాశారు:

"దేవుడు మనలాగే శరీరం కలిగి ఉన్నాడని, ఒక చోట కూర్చుని వున్నాడని భావిస్తున్నారు కొందరు. ఆయనకూ భార్యాపిల్లలు ఉన్నారని మనిషిలాగే ఆయనకూ సంతాన పరంపర వుందని భావిస్తున్నారు మరికొందరు. దేవుడు మనిషి రూపంలో భూమిపై అవతరిస్తాడని కొందరి నమ్మకం. దేవుడు ఈ విశ్వవ్యవస్థను సృష్టించి ఊరుకున్నాడని ఇప్పుడాయన విశ్రాంతి తీసుకుంటున్నాడని మరికొందరి ఊహ.

దేవుని వద్దకు మహాపురుషుల, ఆత్మల సిఫారసుతో వెళ్ళడం అవసరమని, వారిని మాధ్యమంగా చేసుకోకుండా పని జరగదని కొందరి అభిప్రాయం. కొందరు దేవుడికి ఒక రూపాన్ని ఊహించుకుని, ఆరాధనకు ఆయన రూపాన్ని ఎదుట వుంచుకోవడం అవసరమని భావిస్తారు."

(రిసాలె దీనియాత్- పేజి. 87)

కాని ఈ అసంఖ్యాక దేవుళ్ళు మనిషిని సన్మార్గం నుండి తప్పించి అసలు గమ్యానికి ఎన్నటికీ చేర్చలేరు. రెండు బిందువుల మధ్య సరళరేఖ ఒక్కటే వుంటుందని అందరికీ తెలుసు. మిగతా రేఖలు ఎన్ని గీసినా అవన్నీ వక్రరేఖలే అవుతాయి. వాటిమీద నడిచేవారి జీవితం వేలకొలది ప్రమాదాలు, అపమార్గాలతో కూడి వుంటుంది. మౌలానా మౌదూది (రహ్మాలై) చెప్పినట్లు-

"బహుదైవారాధకులు, సత్యతిరస్కారులు ఎప్పుడూ పనికిమాలిన ఆశలతో ఊహాజీవితం గడుపుతుంటారు. దేవుని కుమారుడు మన మన పాపాలు తన మీద వేసుకొని ప్రాయశ్చిత్తం చేసుకున్నాడని వారిలో కొందరు భావిస్తారు. మేము దేవునికి ప్రియమైనవాళ్ళంగనక మాకు పరలోకంలో శిక్షే ఉండదని కొందరి భావన. మనం గతించిన మన పెద్దల ద్వారా దేవుని వద్ద సిఫారసు చేయించుకోవచ్చని కొందరు అంటారు. మరి కొందరు తమ దేవతలకు మొక్కులు, నివేదనలు అర్పిస్తే చాలు, ఇక తాము ఎలా తలచుకుంటే అలా చేయడానికి లైసెన్సు లభిస్తుందని భావిస్తారు. ఇటువంటి తప్పుడు విశ్వాసాలు వారిని ఎల్లప్పుడూ పాపాలు, దుష్కార్యాల వలయంలో బంధించి వుంచుతాయి. ఈ నమ్మకాల కారణంగానే వారు ఆత్మశుద్ధి, సదాచారాల నుండి పారిపోతారు."

(రిసాలె దీనియాత్- పేజి. 93)

పైన మౌలానా పేర్కొన్న వివిధ మతాల స్థితిగతుల్ని గమనిస్తే ఇస్లాం తప్ప ఇతర మతాల జీవన వ్యవస్థలు ఎంతో అసంపూర్ణం, అసమగ్రమయిన వని తెలుస్తుంది. సమగ్ర జీవన వ్యవస్థకు తగిన ధర్మం ఇస్లాం మాత్రమే. అది జీవితంలోని ప్రతి కోణాన్నీ స్పృశిస్తుంది. ముందుగా అది దేవుణ్ని గురించి శాశ్వతమైన విశ్వాసం బోధిస్తుంది. యావత్తు సృష్టికి సృష్టికర్త, సర్వశక్తి మంతుడు, యజమాని ఒక్కడేనని, అతనికి సాటి ఎవరూ లేరని చెబుతుంది. సూర్యుడు, చంద్రుడు, భూమి, గ్రహాలు, నక్షత్రాలు, మానవులు, జంతువులు, పక్షులు, చెట్లు, కొండలు, నదులు, సముద్రాలు సమస్తం దేవుని సృష్టితాలే. కనుక సర్వోత్కృష్టుడయిన మానవుడు, దేవుని ఎదుట తప్ప మరెవరి ఎదుటా తలవంచకూడదు. అలాగే అతడు తోటి మానవులు ఎంత గొప్పవాళ్ళ యినా వారి ఎదుట కూడా తలవంచకూడదు. మానవుడు సృష్టికర్త, సర్వశక్తి మంతు డయిన దేవుని ముందే సాష్టాంగపడాలి; ఆయనకే భయపడాలి; సహాయం కోసం ఆయన్నే మొరపెట్టుకోవాలి. ఈవిధంగా జీవిత సమస్త రంగాల్లో ఆ ఒక్క దేవునికే భయపడుతూ, ఆయన్నే ఆరాధిస్తూ పవిత్ర జీవితం గడిపినప్పుడే మానవునికి మరణానంతరం మోక్షం లభిస్తుందని, ఇహలోకం లోనూ అతడు **ప్రశాంత జీవితం** గడపగలడని ఇస్లాం చెబుతోంది.

అన్నింటికన్నా పెద్ద రోగం

దాదాపు ప్రతి మతంలోనూ షిర్క్ (బహుదైవారాధన) రోగం వుంది. ఇది ఎంతటి ప్రమాదకరమైన రోగమంటే దీని ముందు ఎలాంటి సుగుణాలైనా బలాదూర్ అన్నమాటే. ఉదాహరణకు ఒక మనిషి హత్యచేసి మేజిస్ట్రేటు ఎదుట హాజరయి, నేను ఫలానా వ్యక్తిని హత్య చేశానని నేరాన్ని ఒప్పుకుంటే, మేజిస్ట్రేటు అతడికి ఉరిశిక్ష విధిస్తాడు. కాని నేరస్తుడు, నేను నిజం చెప్పి నా నేరాన్ని ఒప్పుకున్నాను కాబట్టి నన్ను విడుదల చేయండి అంటాడు. అయినప్పటికీ అతడి ఈ గుణం (సత్యం) అతడ్ని ఉరిశిక్ష నుండి కాపాడ జాలదు. అతడ్ని అలాగే వదలివేస్తే సమాజానికి క్షేమకరం కాదు.

అదేవిధంగా ఒక మనిషిలో షిర్క్‌కు వ్యతిరేకంగా కొన్ని నైతిక గుణాలు ఉన్నప్పటికీ ఏకదేవుని స్థానంలో రాళ్ళు, విగ్రహాలను పెట్టి పూజించడం వల్ల ఏర్పడే అగాధాన్ని అవి పూడ్చలేవు. బహుదైవారాధనవల్ల మనిషికి నిజమైన మనశ్శాంతి లభించదు. అతడు ఎల్లప్పుడూ సందేహాల మాయాజాలంలో కొట్టుమిట్టాడుతుంటాడు. అతడి బుద్ధి అపమార్గంలో పయనిస్తుంది. ఇలాంటి మనిషి స్వార్థానికి లోనయి ఇతరుల హక్కుల్ని కబళించడంలో, హింసా దౌర్జన్యాలు చేయడంలో ఏమాత్రం వెనుకాడడు. అతడి చేష్టల వలన లోకంలో అశాంతి ప్రబలిపోతుంది. హత్యలు, ఘోరాలు వేడెక్కుతాయి. వివిధ జాతుల గతచరిత్ర ద్వారా ఈవిషయం స్పష్టమవుతోంది. రోమ్ సామ్రాజ్యంలో, ఈజిప్టు ఫిరౌన్‌ల కాలంలో ప్రజలపై ఎంతటి ఘోరమైన హింసాదౌర్జన్యాలు జరిగాయో అందరికీ తెలిసిందే. ఇదంతా ఏక దేవునిపై సంపూర్ణ విశ్వాసం లేనందువల్లే జరిగింది.

హిందూ మతంపై పరిశీలనా దృష్టి

ఈ మతంలో మొదటి నుండీ షిర్క్ తప్ప మరేమీ కనబడదు. యావజ్జాతి వేల వర్గాలుగా విభజించబడివుంది. ప్రతివర్గం దేవత ఇతర వర్గాల దేవతలకు భిన్నంగావుంది. దేవుని కుటుంబం శాఖోపశాఖలుగా

విస్తరించింది. సూర్యుడు, చంద్రుడు, భూమి, కొండలు, చెట్లు, రాళ్ళు నదులు, జంతువులు, అగ్ని, గాలి, పాములు- ఇలా అసంఖ్యాకమైన సృష్టితాల ముంధు తలవంచడం, వాటిని పూజించడం జరుగుతోంది. కాని దీన్ని నేటి అభ్యుదయ మానవుని బుద్ధి ససేమిర అంగీకరించదు. కారణం, నిన్నటి వరకు మానవునికి సాధ్యపడవని భావించబడుతూ వచ్చిన విషయాలన్నీ మానవుడు చంద్రమండలంపై దిగిన తర్వాత వాటి వాస్తవాలు వెలుగులోకి రాసాగాయి.

హిందూమతం అతి ప్రాచీన మతాలలో ఒకటిగా పరిగణించబడు తున్నప్పటికీ చరిత్రపరంగా ఈ మతంలో మతపురుషుల జీవిత విశేషాలు లేవు. ఆ మత భావాలను సరైన విధంగా ఎత్తి చూపలేము. హిందూమతంలో ఫలానా నియమాలను విధిగా నమ్మాలని మౌలిక విశ్వాసాలను గురించి వేలెత్తి చూపలేము. హిందూ తత్వశాస్త్రం ఎప్పుడు ఆరంభమయిందో కూడా తెలియదు. కొందరు చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం దీని ప్రారంభం ఆర్యులు పాడుతుండే పవిత్రరాగాల నుండి జరిగింది. తర్వాత అవి రుగ్వేదంలో చేర్చబడ్డాయి. మొత్తానికి ఈ రాగాలలో ఎంతో విశాలత వుంది. ఆ రాగాలే వివిధ హిందూ తాత్విక వ్యవస్థలకు జన్మనిచ్చాయి. ఆ తర్వాత ఈ తాత్విక చింతనలు అసంఖ్యాకమైన విభిన్న మార్గాలు అవలంబించాయి. ఆ చింతనల్లో ఏ ఒక్కటీ నిక్కచ్చిగా ఏ ఒక్క సిద్ధాంతాన్నీ ప్రతిబింబింపజేయదు. ఈ మతంలో ఆపాదమస్తకం అనేక విభేదాలున్నా వాటిని అవలంబించే వారంతా హిందువులుగానే పరిగణించబడతారు. ఇది మా అభిప్రాయం కాదు, సుప్రసిద్ధ పండితుడు గురుప్రసాద్ సేన్ వెలిబుచ్చిన అభిప్రాయం. ఆయన తన ప్రఖ్యాత గ్రంథం 4వ పేజీలో ఇలా వ్రాశారు:

> "హిందూధర్మం ఎలాంటి మతం కాదు. ఇప్పుడూ కాదు, ఇంతకు పూర్వమూ కాదు. ఇదొక సమాజం, కొన్ని సామాజిక కట్టుబాటులను నెరవేర్చాలని హిందువులకు నొక్కిచెప్పే వ్యవస్థ. అది ఏ సిద్ధాంతాన్నయినా నమ్మమని లేదా నమ్మవద్దని చెప్పదు. అందువల్ల ఒక హిందువు ఆస్తికుడూ కావచ్చు, నాస్తికుడూ కావచ్చు. అలాగే అతను

ఏకదైవారాధకుడూ కావచ్చు, బహుదైవారాధకుడూ కావచ్చు. వాటిని అంగీకరించని వాడు కూడా హిందువుగానే లెక్కించబడతాడు. ఏదైనా మంచి మాటను అంగీకరించడంవల్ల లేదా తిరస్కరించడంవల్ల అతని హిందుత్వంలో ఎలాంటి తేడా రాదు. అతడి హిందుత్వం గురించి ఎవరూ అనుమా నించరు. కొన్ని హిందూ ఆచారాలు పాటిస్తున్నంతవరకు అతడు హిందువు గానే కొనసాగుతాడు."(రిసాల మౌల్వీ,రసూల్ నం.1358హి.)

◆ హిందువులు, క్రైస్తవులు, యూదులలో మత విద్యల నాయకత్వం కొందరు వ్యక్తులు లేక ప్రత్యేక సంస్థల చేతుల్లో ఉంది. వారు మత వ్యవహారా లలో గుత్తాధిపత్యం ఎంతో చాకచక్యంగా తమ కోసం ప్రత్యేకించుకున్నారు. ప్రాచీనకాలం నుండీ ఇదే పరిస్థితి వుంది. బ్రాహ్మణులు తప్ప ఇతరులు ఎవరూ మతవిద్య అభ్యసించలేరు. మతంపై గుత్తాధిపత్యం వహించినవారు చెప్పిందే జనానికి వేదవాక్యం అవుతుంది. దానికి వ్యతిరేకింగా ఎవరైనా ఏమాత్రం గళమెత్తినా అతడు దోషిగా పరిగణించబడతాడు.

కుల భేదభావాలు

హిందూమతంలో సామాజికంగా అగ్రవర్గాలు, నీచవర్గాలన్న నిమ్నోన్నతా భావాలు ఉన్నాయి. శూద్రులు అనబడే ఒక ప్రత్యేక వర్గంపట్ల తీవ్రమయిన వివక్ష ఉంది. దానికోసం రకరకాల తాత్విక సిద్ధాంతాలు కనిపెట్టి వాటికి అనుగుణమైన శాసనాలు రూపొందించారు. ద్వేషం, విరోధం, అవమానం, పరాభవాల కోసం అనుమతి లభించింది. సమాజంలో అందరి కన్నా బ్రాహ్మణుల స్థాయే అత్యున్నతమైనదని; హరిజనులుగా పిలవబడే శూద్రులు కూడా అందరికన్నా అత్యంత నీచులని, అపవిత్రులు, మ్లేచ్ఛులని చాట బడుతోంది. అంతేకాదు, వారు సప్తసముద్రాలలో స్నానం చేసినా అపవిత్రులు గానే ఉంటారట! జాతీయ స్వాభిమానానికి పెద్ద పీట వేయబడిన ఆర్యుల మనస్తత్వానికి ఈ ధోరణి అద్దం పట్టుతోంది. అందువల్లనే హిందూ చట్టం దృష్టిలో బ్రాహ్మణుడు దొంగతనం చేస్తే, సాధారణ శిక్షే ఉంటుంది. కాని శూద్రుడు దొంగతనం చేస్తే కఠిన శిక్ష విధించబడుతుంది. ఇది క్రైస్తవులలో పోప్‌ను పాపరహితుడుగా భావించడంలాంటిదే. ఆర్యులు భారతదేశంలోని

అస్పృశ్యులను మాత్రమే నీచంగా చూడటంగాకుండా ఆర్యేతర జాతుల వారిని మ్లేచ్ఛులని, రాక్షసులని, చండాలురని కూడా పిలిచేవారు. పాత తరహా పండితులు నేటికీ ఇదే విశ్వాసం కలిగివున్నారు. మొత్తానికి ఆర్యుల జాతి ఆధిక్యతగల జాతి అన్న భావన హిందూ మత విశ్వాసాలలో ప్రముఖ అంశం. ఈ విశ్వాసం ఎంత ప్రగాఢమైనదంటే ఒక హిందువు వ్యభిచారం, మద్యపానం, దొంగతనం, దోపిడీ, హత్య, నమ్మక ద్రోహం, మరెలాంటి నీచాతినీచమైన పనులైనా సహించగల్గుతాడు. కాని అతడు అస్పృశ్యుని చేతి వంట తింటే మాత్రం అతని హిందుత్వం అత్తిపత్తి ఆకులా ముడుచుకుపోతుంది.

నాగరికత అభివృద్ధిచెందిన నేటికాలంలో నిమ్నోన్నతా భేదభావాలకు వ్యతిరేకంగా చట్టాలు చేయబడినప్పటికీ, అస్పృశ్యులుగా ముద్ర వేయబడిన వారు ఇప్పటికీ తమ న్యాయబద్ధమైన హక్కుల్ని సాధించుకోలేక పోతున్నారు. బావులలో నీళ్లు తోడుకోవడానికి, దేవాలయాలలో ప్రవేశానికి సైతం వారికి అనుమతి లేదు. స్వామి శంకరాచార్య తమ వేదాంత దర్శనంలోని 3/38వ సూత్రంపై వ్యాఖ్యానిస్తూ ఇలా సెలవిచ్చారు:

"శూద్రుడు వేదపఠనం వింటే అతని చెవుల్లో సీసం కరిగించి పోయాలి. శూద్రుడు శ్మశానంలాంటివాడు. కనుక బ్రాహ్మణుల దృష్టిలో శూద్రులకు వేదాలు చదవనీయరాదు. శూద్రులకు ఉపదేశం కూడా చెయ్యరాదు."

(ఆర్యమిత్ర ఆగ్రహ 35వ సం.)

ఇటువంటి అభిప్రాయాలే తులసీదాస్ కూడ వెలిబుచ్చాడు. ఆయన మాటలు ఇలా ఉన్నాయి:

"డోల్, గన్వార్, శూద్, పశూ, నారీ
ఏ సబ్ తాడన్‌కే అధికారీ."

(అంటే శూద్రుడు, మద్దెల, మూర్ఖుడు, స్త్రీ ఇవన్నీ దెబ్బతినడానికే అర్హులన్న మాట.)

అస్పృశ్యుల పట్ల అగ్రవర్ణాలవారు అవలంబించిన ఈ అసమానతా వైఖరి తమ మతశాస్త్రాలు, వాటి వెలుగులో ఋషులు, మునులు, అవ

తారాల ఏకగ్రీవ ఆదేశం ప్రకారమే సాగుతోంది. శూద్రులతో కలసి కూర్చోవడం, భోజనం చేయడం, నీళ్ళు త్రాగడం, వారిని పెళ్ళి చేసుకోవడం- ఇవన్నీ దోషాలే. శాస్త్ర ప్రకారం వారు పాపులు, అపవిత్రులు, దుష్టులు.

హిందూ ధర్మం- సన్యాసత్వం

హిందూమతంలో ఐహిక ప్రపంచం దుఃఖభూయిష్టంగా భావించబడుతోంది. ఉపనిషత్తులలో దానికి దూరంగా ఉండాలని తాకీదు చేయబడింది. హిందూ ఋషులు, మునులు ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తూ ఐహిక సుఖాలు త్యజించి అడవులకు వెళ్ళినవారే. సన్యాసాశ్రమంలో ప్రతి హిందువు డెబ్భయి అయిదేళ్ళ వయస్సు తర్వాత వనవాసం చెయ్యడం ఆర్య సమాజంలో ప్రాచీన కాలం నుండీ పాటించబడుతోంది. క్రైస్తవులు కూడ వారి అనుసరణలో సన్యాసత్వాన్ని జీవిత లక్ష్యంగా భావించారు.

కాస్త ప్రశాంతంగా ఆలోచిస్తే ఈ దృక్పథం వలన సంస్కృతీ నాగరికతల అభివృద్ధి స్తంభించిపోయే ప్రమాదం ఉంటుంది. సామూహిక జీవితం కూడ సార్ధకం కాదు. ఈ దేశంలోనే గౌతమ బుద్ధుడు, మహావీరుడు తమ భార్యా బిడ్డల్ని వదలి అడవులకు వెళ్ళారు. కాని నాగరికులు అందరూ భార్యాబిడ్డల్ని వదలి సన్యాసత్వం స్వీకరిస్తే ఇక వెనుక వుండిపోయేవారి గతి ఏం కావాలన్న ప్రశ్న తలెత్తుతోంది.

బౌద్ధ, జైన మతాలు

ఈ మతాలలో దేవుడ్ని గురించిన భావనే లేదు. ఫలితంగా ఆ మతాల సంస్థాపకుల తదనంతరం వారి అనుయాయులు వారికి దైవత్వం ఆపాదించి వారి విగ్రహాలు తయారుచేసి పూజించసాగారు. ఈ విధంగా వీరికి కూడా షిర్క్ (బహుదైవారాధన) రోగం అంటుకుంది.

కొన్ని నైతికసూత్రాలు తప్ప ఈ మతాలలో సత్సమాజ నిర్మాణానికి కావలసిన విషయాలేమీ కానరావు. వ్యాపారస్తులకు, యుద్ధమైదానంలో

పాల్గొనేవారికి, హత్యలూ లూటీలు చేసే నేరస్తుల కోసం మార్గదర్శన సూత్రాలు అంటూ ఏవీ లేవు. అందువల్లనే యూరప్ పరిశోధకుడు డాక్టర్ మార్కస్, డవాసిస్ ఇలా అంటున్నాడు:

"బౌద్ధ మతం నిజానికి మతం కాదు. అదొక నైతిక ఫిలాసఫీ."

గౌతమ బుద్ధుడు ఆత్మవికాసం అన్వేషణలో విశ్వాసం గురించిన కోణాన్ని వదలి వేశాడు. అందువల్ల ఆ తర్వాత వచ్చినవారు ఆయన్ని దేవునిగా భావించి పూజించసాగారు. ఇది ఒక తప్పుడు భావనపై ఆధారపడిన విషయం.

వారి దృష్టిలో చినిగిన పాత దుస్తులు ధరించడం, భిక్షాటన చేసి జీవించడం, కూటి కోసం ఏ విధమయిన వృత్తినీ అవలంబించకపోవడం, అడవులలో నివసించడం, వివాహం గురించిన భావనను కూడా మనసులో చోటివ్వకపోవడం, పైగా స్త్రీ ముఖం కూడా చూడటానికి సిద్ధమవకపోవడం ఉత్తమ మానవునికి ప్రమాణాలు అయ్యాయి. అంతేకాదు ఒక స్త్రీ నీటిలో మునిగిపోతున్నా రక్షించే ప్రయత్నం చెయ్యకూడదు. చెట్ల క్రింద జీవించాలి. ఒకవేళ నిద్ర ముంచుకువస్తే చెట్టు బోదెకు ఆనుకుని రెప్పవాల్చాలి.

బుద్ధుడు జీవితాన్ని యాతనగా వర్ణించాడు. ఈ యాతన నుండి విముక్తి కోసం ప్రాపంచిక సుఖాలకు దూరంగా వుండాలని బోధించాడు. తత్ఫలితంగానే లక్షల మంది భిక్షువులు ఐహిక జీవితాన్ని వదలి అడవుల పాలయ్యారు. రెండు చేతులా దోచుకోవడానికి వీలుగా వారు ప్రాపంచిక వ్యవహారాల్ని దుర్మార్గులకు, తప్పుడు వ్యక్తులకు వదిలేశారు.

నకారాత్మక భావన

గౌతమ బుద్ధుని మోక్షభావన నకారాత్మక (నెగిటివ్) భావనపై ఆధార పడింది. అందులో సకారాత్మక కోణం అంటూ లేదు. ఆయన దృష్టిలో మానవుడి పరమపదానికి ఆఖరి మెట్టు నిర్యాణం పేరుతో ప్రతిదానినీ వ్యతిరే కించాలి. వ్యక్తిగతంగా ఆత్మను తోముతూ వుండాలి. సామూహిక జీవితంతో ప్రమేయం లేకుండా ప్రపంచంలో వ్యాపించిన అంధకారం నుండి తనను

తాను కాపాడు కొని ముందుకు సాగిపోవడంలోనే క్షేమం వుందని భావించాలి. ఈ వైఖరి కారణంగా ప్రపంచం అనర్థాలకు ఆటపట్టు అయిపోయినా లెక్క చెయ్యకూడదు. ఎందుకంటే తాను హాయిగా కూర్చున్నాడు కనుక. కాని సమాజంలోని పేరుకుపోతున్న మాలిన్యం ఎంతటి వినాశకారి అవుతుందో అతడు ఏనాడూ గమనించలేదు.

జైన మతం

జైనులలో ఆరాధనకు ఏకైక మార్గం తపస్సు. ఇందులో ఆత్మ నిగ్రహం, కోర్కెలను జయించడం, ప్రాపంచిక సుఖాలను విడనాడటంపై అత్యధిక ప్రాధాన్యం ఇవ్వబడింది. ఇదే అత్యున్నత వైరాగ్య విధానం.

ప్రారంభంలో జైన మతంలో ఎటువంటి ఆరాధనాలయం ఉండేది కాదు. కాని తర్వాత కాలంలో జైన మందిరాలు నిర్మించబడ్డాయి. వాటిలో జైనమత స్థాపకుడు మహావీరుని విగ్రహాలు ఉంచడం జరిగింది. ప్రారంభంలో ఆయన్ని పూజించే ఆచారం ఉండేది కాదు. తర్వాత క్రమంగా ఈ విగ్రహాలే జైనుల దేవతలు అయిపోయాయి. ఆయన అనుయాయులు దైవారాధనను వదలి వ్యక్తి ఆరాధనలో పడి దారితప్పారు. ఆత్మ, పదార్థమూ అనాది నుండి వున్నవే కనుక మరో రూపాన్ని ఆరాధించవలసిన పనేముంది అంటారు వారు.

విపరీత పోకడల ఫలితం

అహింస విషయంలో జైనులు విపరీతమైన పోకడలు పోయారు. జైన మునులు ఏదైనా ప్రాణి తమ నోటిలో దూరి చస్తుందేమోనని నోటికి అడ్డంగా గుడ్డ కట్టుకునేవారు. ఈ జాగ్రత్త దృష్ట్యా వారు నీళ్ళను కూడ వడబోసి మరీ త్రాగేవారు.

మరోవర్గం దిగంబరులది. వారి మునులు వంటి మీద నూలు పోగు కూడా లేకుండా పూర్తి నగ్నంగా వుండటానికి ఇష్టపడతారు. వారు ముక్తిమార్గం అదేనని భావించేవారు. మనోకాంక్షలను అణచటం, శారీరక సుఖాలకు దూరంగా వుండటం గొప్ప విషయాలుగా భావించేవారు.

కాస్త నిదానంగా ఆలోచిస్తే ఈ వర్గం ఎంతో అసహజమైన మార్గం అవలంబించినట్లు మనం గమనించగలం. మానవజీవితం శరీరం, సమాజం, దేవుడు, ఇతర అవసరాలతో సంబంధం కలిగివుంది. ఈ సంబంధం ఎల్లప్పుడూ ఉంటుంది. ఆకలి సహజమైనట్లే లైంగికవాంఛ కూడా సహజమే. దీనిద్వారా సంతతి అభివృద్ధి చెందాలన్నది ప్రకృతి ధర్మం. మనం ఇంద్రియ నిగ్రహంతో సహజసిద్ధమైన ఈ కోర్కెను అణచివేస్తే ప్రకృతి ధర్మాన్ని వ్యతిరేకించినట్లు అవుతుంది. పైగా మానవ సంతతిని అంతమొందించిన నేరస్తులం కూడా అవుతాము.

ఇంద్రియ నిగ్రహంపై అదుపు సాధించడానికి ప్రయత్నించే వేలాది మందిలో ఒకరిద్దరు మాత్రమే సఫలీకృతులవుతారు. మిగిలినవాళ్ళు పులితోలు కప్పుకున్న గాడిదల్లా గుంపులో చేరిపోవడమైతే జరుగుతుందిగాని, వారు అంతర్గత కామవాంఛను అణచుకోలేక తప్పుడు పనులకు పాల్పడతారు. ఈ విషయంలో యూరప్‌లోని క్రైస్తవ సన్యాసుల అశ్లీలగాధలు ప్రసిద్ధి చెందాయి. ఆ సన్యాసులు చాటుమాటుగా ఇలాంటి చేష్టలు సాగించడానికే అనేక చర్చీలలో సన్యాసినులతో కలసి ఉండేవారు.

ఇతర మతాలు

షిర్క్ రోగం

జైన, బౌద్ధ మతాలతోపాటు ఇతర మతాల ప్రజలు కూడా ఎల్లప్పుడూ షిర్క్ (బహుదైవారాధన)వ్యాధికి లోనయివున్నారు. ఉదాహరణకు మజూసీలు జొరాస్టర్‌కు, చైనీయులు కన్‌ఫ్యూషియస్‌కు, గ్రీకులు అపాలూకు, ఇష్రాఖీ తాత్విక చింతనాపరులు ప్లాటోకు దైవిక గుణాలు ఆపాదించి, ఆ నాయకులను గుర్తు చేసుకునే వంకతో వారిని పూజించసాగారు.

ఈ సందర్భంగా మంత్రపఠనాలు, పూజాదికాలు, తపస్సులు, ధ్యానాలు, యజ్ఞాలు, మొక్కుబడులు, బ్రహ్మచర్యం, వైరాగ్యం, పరధ్యానం తదితర అనేక విధానాలు అవలంబించబడ్డాయి. వీటివల్ల పరస్పర మత విభేదాలు పెరిగిపోయి ప్రజలు అసలు దైవాన్ని పూర్తిగా విస్మరించారు.

యూద మతంపై ఒక దృష్టి

జాత్యహంకార భూతం

యూదులు అనేక శతాబ్దాల నుండి తమను తాము జాతి, వర్ణం ప్రాతిపదికలపై దేవునికి ప్రియమైనవారమని చెప్పుకుంటున్నారు. ఈ భావనతో వారు తమ మతాజ్ఞలలో ఇస్రాయీలుల హక్కులు, హోదాలను ఇస్రాయీలేతరుల హక్కులు, హోదాలకన్నా ఆధిక్యతలోవుంచారు. వారి దృష్టిలో స్వర్గం కేవలం యూదుల కోసమే ఉంది; ఇతర మానవులందరూ నరకం కోసం పుట్టించబడ్డారు.

ఇతర విశ్వాసాలు

యూదులు తమ ఆచరణలు ఎలా ఉన్నా, వాటిలో ఎన్ని లోపాలున్నా తాము దేవునితో ప్రత్యేక సంబంధం కలిగివున్న జాతి అని నమ్ముతారు.

ఇలాంటి నమ్మకాలు వారి దైనందిన జీవితంపై మంచి ప్రభావం వేయలేవు. కారణం తాము ఎలాంటి దుష్కార్యాలు చేసినా దేవుడు తమను నిలదీయడని, తాము ఏ లక్ష్యం కోసం పుట్టించబడ్డారో ఆ లక్ష్యంలో ఈ దుష్కార్యాలవల్ల ఎటువంటి తేడా రాదని వారు భావించడమే.

ఇలాంటి కల్పిత సిద్ధాంతాలను ఇప్పుడు మనిషి అంగీకరించడానికి సిద్ధంగా లేడు. ఇది సైంటిఫిక్ యుగం. ప్రతి మనిషీ రెండు+రెండు= నాలుగు అన్న విశ్వాసాన్ని బాగా అర్థం చేసుకున్నాడు. ఇతర జాతికి చెందిన మనిషి ఏకదేవుడ్ని, ఆయన ప్రవక్తను విశ్వసించి, ఆయన బోధనలకనుగుణంగా చెడులకు దూరంగా వుంటూ, పవిత్రజీవితం గడుపుతుంటే మరి అతడు నరకానికి ఇంధనం ఎలా అవుతాడు? యూదుల దగ్గర దీనికి జవాబు లేదు.

యూదుల మోక్షం పరలోక సాఫల్యంపైగాక పాలస్తీనా భూభాగాన్ని స్వాధీనం చేసుకోవడంపైన్నే ఆధారపడివుంది. ఈ విషయాలే యూదు మతాన్ని ఆధ్యాత్మికంగా దివాలా తీయించాయి.

సరైన దైవ బోధనల లేమి

దీర్ఘకాలం నుండి వారి వద్ద నిజమైన దైవ బోధనలు లేకుండా పోయాయి. తౌరాత్ కూడా దాని అసలు రూపంలో, మూలభాషలో లేకుండా మారిపోయింది. అందువల్ల వారి నమ్మకాలలో, ఆచరణలలో చాలా కాలం నుండి దిగజారుడుతనం కొనసాగుతోంది. వీరు ఎల్లప్పుడూ దైవప్రవక్తలకు శత్రువులుగా వున్నారు. హజ్రత్ జక్రియా (అలై), హజ్రత్ యహ్యా (అలై)లను వారు బహిరంగంగానే హతమార్చారు. వారి దృష్టిలో హజ్రత్ ఈసా (అలై)ను శిలువపై ఎక్కించి చంపేశారు. ఇలా చరిత్ర దర్పణంలో ఈ మతస్వరూపం అసహ్యకరంగా తయారయింది.

క్రైస్తవ మతగ్రంథాల పరిస్థితి

క్రైస్తవమత బోధనలు, క్రీస్తు మరణానికి చాలా కాలం తర్వాత ఆయన అనుచరులు వ్రాసిన నాలుగు రకాల బైబిళ్ళ బోధనలపై ఆధారపడివున్నాయి.

- ◆ హిబ్రూ బైబిల్ 39 పుస్తకాలలో వుంది. ఇంగ్లీష్ ప్రొటెస్టెంట్ బైబిల్‌లో 306 పుస్తకాలు వున్నాయి. క్యాథలిక్ బైబిల్‌లో ఒక పుస్తకం అదనంగా వుంది. అలాంటప్పుడు ఏ పుస్తకాలలో నిజమైన దైవబోధనలు ఉన్నాయో తెలుసుకోవడం పాఠకునికి చాలా కష్టమైపోయింది.
- ◆ బైబిల్‌లోని పుస్తకాలలో విషయాలు రకరకాలుగా వున్నాయి. అందులో కీర్తనలూ వున్నాయి. గాథలూ వున్నాయి. నాటకాలూ వున్నాయి. హజ్రత్ మసీహ్ (అలై) జీవిత చరిత్ర కూడా ఉంది. ఇంకా కొందరు వ్యక్తుల ఉల్లేఖనాలు, వ్యర్థవిషయాలు కూడా వున్నాయి. వాటితో పాటు కొంచెం చరిత్ర కూడా వుంది. ఈవిధంగా బైబిల్ విషయపరంగా ఓ పెద్ద వైరుధ్యాల పుట్టలా తయారయింది.
- ◆ బైబిల్‌లో స్త్రీని చాలా నీచంగా చిత్రించడం జరిగింది.

తప్పుడు నమ్మకాలు

మసీహ్ (అలై) తండ్రి లేకుండా కన్య అయిన మర్యంకు జన్మించారు కనుక ఆయన దేవుని ౹మారుడయ్యాడని క్రైస్తవుల నమ్మకం.

◆ క్రైస్తవుల మరో నమ్మకం ప్రకారం యూదపండితులు మసీహ్ (అలై)పై తిరుగుబాటు నేరం మోపి రోమన్ పాలకుని చేత ఆయనకు ఉరిశిక్ష వేయించారు. పూడ్చిపెట్టిన మూడురోజుల తర్వాత ఆయన సమాధి నుండి లేచి బయటకు వచ్చారు. తన శిష్యులను కలసి వారికి అంతిమ హితబోధ చేశారు. తర్వాత ఆయన ఆకాశంలో తన తండ్రి అయిన దేవుని వద్దకు తిరిగి చేరుకున్నారు.

◆ ఆదిమానవుడు ఆదమ్ (అలై) దేవుని ఆజ్ఞను పాటించకుండా అవిధేయుడయి మానవులందరినీ పాపులుగా చేశాడు. మసీహ్ (అలై) మానవుల తరపున శిలువపై ఎక్కి వారందరి పాపాలకు ప్రాయశ్చిత్తం (నిష్కృతి) చేశారు.

◆ ప్రళయ సమీపకాలంలో మసీహ్ మళ్ళీ ప్రపంచానికి తిరిగివస్తారు.

క్రైస్తవంలో బహుదైవారాధన

క్రైస్తవులు తమ మతాన్ని నిజమైన దైవధర్మంగా చెప్పుకుంటారు. ప్రపంచంలోని ప్రతి భూభాగంలో ఆ మతావలంబీకులు ఉన్నారు. అది ప్రేమ, నైతికతల పునాదిపై ఏర్పడిందని; దాన్ని స్వీకరిస్తేనే మనిషికి మోక్షం లభిస్తుందని క్రైస్తవుల వాదన. కాని త్రిత్వం గురించిన విశ్వాసాన్ని పరిశీలిస్తే ఈ క్రింది సమస్యలు పరిష్కారానికి నోచుకోవు.

1) హజ్రత్ ఈసా (అలై)కు ఒక వైపు దైవత్వ స్థాయి కల్పించబడింది. మరోవైపు ఆయన్ని శిలువపై ఎక్కించడం జరిగింది. ఒకే సమయంలో ఆయన అటు దేవుడూ కావటం, ఇటు నిస్సహాయ స్థితిలో ఉరికంబంపై ఎక్కించ బడటమా! ఇదెలా సాధ్యం?

2) త్రిత్వం సిద్ధాంతంలోని దేవుడు, క్రీస్తు, పరిశుద్ధాత్మ- ఈ ముగ్గురూ ఒక్కటేనని; ఒకరి అంతస్తు ముగ్గురి అంతస్తులతో సమానమని అంటారు క్రైస్తవులు. అలాంటప్పుడు ఆ ముగ్గురిలో ఒక దైవం మరణించడమంటే ముగ్గురూ మరణించినట్లే కదా! ఇక ఈ సృష్టికి దేవుడు ఎవరూ లేరన్న మాట. ఇది అర్థం కాని విషయం.

3) క్రైస్తవుల వేరొక విశ్వాసం ప్రకారం మర్యమ్ దేవుని భార్యే. అది కూడా పరిశుద్ధాత్మ ద్వారా. ఈసా (అలై) భూలోక దైవం, మూడవ దైవం ఆకాశాలకు ప్రభువు. కాని కొందరు పరిశుద్ధాత్మను కూడా దైవంగా భావిస్తారు. ఈ విధంగా నలుగురు దేవుళ్ళు అయిపోతారు. సృష్టిలో ఈ తమాషా సాధ్యమేనంటారా?

◆ మోక్షం కోసం విశ్వాసం అవసరం అని బైబిల్ బోధిస్తోంది. కాని పోప్ దృష్టిలో ఆచరణకు ఎలాంటి విలువ లేదు. త్రిత్వం మానవుడికి అర్థంకాని గొప్ప పరమార్థంగా చెప్పడం జరిగింది. ఈ చిక్కుముడి విడదీయలేక మనిషి తనను తాను దారీతెన్నూ కానరాని ఎడారిలో వున్నట్లు భావిస్తాడు.

◆ క్రైస్తవ మౌలిక విశ్వాసాల ప్రకారం మానవుడు జన్మతాః పాపాత్ముడు. హజ్రత్ ఈసా (అలై) శిలువపై ఎక్కి తన అనుచర సమాజం తరపున ప్రళయం వరకూ జరిగే పాపాలకు ప్రాయశ్చిత్తం చెల్లించారు. ఈ విషయం బుద్ధికి, హేతువుకు అందని విషయం. ఎవరో ఒక మనిషి చేసిన త్యాగం, ఇతరుల పాపాలకు పరిహారం ఎలా అవుతుంది? ఇలాంటి విశ్వాసంవల్ల పాపాలు చేయడానికి మనిషికి మరింత ధైర్యం కలుగుతుంది. ఈ సందర్భంలో ఇస్లాం బోధనలు కూడా ముందుంచుకుంటే ఆలోచించడం సులభమవుతుంది. ఖుర్ఆన్ స్పష్టంగా ఇలా పేర్కొన్నది:

"లా తజిరు వాజిర తువ్విజ్ర ఉఖ్రా" (53:38)

భావం: (పాప)భారం మోసేవాడెవడూ ఇతరుల (పాప)భారం మోయలేడు.

అసహజ కర్మలు

◆ ఆలోచించవలసిన మరో విషయం, ప్రతి మనిషీ జన్మతాః పాపి అని చెప్పబడింది. కాని పోప్, ఆయన అనుచరులు పాపరహితులుగా పరిగణించబడ్డారు. దీనికి మతపరమైన ఆధారం ఏముంది?

◆ బైబిల్‌లో ఒకచోట ఇలా ఉంది:

"ఎవరైనా నీ దగ్గరకు వచ్చి తన తల్లిదండ్రులు, భార్యాబిడ్డలు, సోదర సోదరీల పట్ల, చివరికి తన ప్రాణం పట్ల కూడా శత్రుత్వం వహించకపోతే అతను నా శిష్యుడు కాజాలడు." (లూకా-26:14)

ఈ బోధన మానవ స్వభావానికీ, యదార్థానికీ రెండిటికీ అతకని విషయం. దీన్ని ఈనాడు అమలులోకి తెస్తే మానవ నాగరికతకు సమాధి కట్టినట్లవుతుంది. ఏ ప్రభుత్వమయినా దానిని అవలంబిస్తే చట్టరాహిత్యం ప్రబలిపోతుంది. చెంపదెబ్బ కొట్టేవారి ఎదుట మరో చెంపను వుంచడం కూడా ఇలాంటిదే. ఈ సూత్రం పైకి ఎంతో ఆకర్షణీయంగా కనబడుతుంది. కాని ఆచరణలో ఇది సాధ్యమా? సాధారణ క్రైస్తవుడేగాక గొప్పగొప్ప సన్యాసులు, బిషప్‌లు, ఫాదరీలు సైతం ఏనాడూ దీన్ని అమలుపర్చలేక పోయారు. చేయను కూడా లేరు. ఎందుకంటే ఈ సూత్రం ప్రకృతికి విరుద్ధమైనది. దీన్ని గురించి ఇస్లాం ఇలా బోధిస్తోంది:

"అపకారానికి ప్రతీకారం ఆ అపకారమంతే ఉండాలి. అయితే ఎవరయినా (ప్రతీకారం తీర్చుకోకుండా) క్షమించివేస్తే, దాని ప్రతిఫలం అల్లాహ్ వద్ద నుండి అతనికి లభిస్తుంది."

అంటే ఇస్లాం ప్రకృతి విరుద్ధ వైఖరిని అవలంభించలేదు. పైగా న్యాయం, కనికరాల రెండు మార్గాల్నీ అతని ముందు ఉంచింది. నీ పట్ల ఎంత అనుచిత వైఖరి అవలంబిస్తే నీవూ అంతే స్థాయిలో అవలంబించడం న్యాయపరంగా సక్రమమే. అంతకంటే ఎక్కువ నష్టం కలిగించడం న్యాయం అన్పించుకోదు. ఎవరైనా విశాల హృదయంతో క్షమించి వదిలేస్తే అందుకు అతడికి పుణ్యం కూడా లభిస్తుంది.

◆ చివరి విషయం. హజ్రత్ ఈసా (అలై) దాంపత్య జీవితం గడపలేదు. వివాహం చేసుకుని వంశాన్ని వృద్ధి చేసుకోగోరేవారి గతి ఏమిటి? ప్రపంచంలో వారికి మార్గదర్శకత్వం ఎక్కడి నుండి లభిస్తుంది? అంతేకాక హజ్రత్ ఈసా (అలై) చేపట్టని అనేక సామాజిక సమస్యలు ఎలా పరిష్కరించ బడతాయి? వ్యాపారస్తులు తమ వృత్తి విషయాలు ఎక్కడ తెలుసుకోగలరు? యుద్ధ రంగానికి వెళ్ళే సైనికులు ఏ సూత్రాలను అవలంబించగలరు?

ఇలాంటి ప్రశ్నలకు క్రైస్తవ మతంలో సరైన సమాధానం దొరకదు. ఈనాటి సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం కూడా కానరాదు. మరి ఈ సూత్రాలను అవలంబించాలని ఎలా అనుకోగలం?

ఇస్లాం ప్రత్యేకతలు

కిరోసిన్ దీపం వెలుగుతుంటే వెలుతురు వచ్చే మాట నిజమే కాని అది మసకగా వుంటుంది. అదే రెండువేల వోల్ట్‌ల బల్బు వెలిగితే వాతావరణం పరిమిత పరిధిలోనయినా ఎంతో కాంతిమంతం అవుతుంది. సూర్యుడు ఉదయించినప్పుడు తూర్పు నుండి పడమర వరకు యావత్తు వాతావరణం దేదీప్యమానంగా వెలిగిపోతుంది. ఇతర మతాల సమక్షంలో ఇస్లాం పోలిక వెలుగుతున్న సూర్యునివంటిదే. దురభిమానాన్ని ప్రక్కనబెట్టి ఎవరైనా ప్రశాంత మనస్సుతో ఆలోచిస్తే ఇస్లాం మానవ స్వభావానికి అనుగుణమైన ప్రకృతి ధర్మం అని అతను సులభంగా గ్రహించగల్గుతాడు.

మానవుని అంతరాత్మ ఘోష

ఇస్లాం మానవుని అంతరాత్మ ఘోష తప్ప మరేమీ కాదు. ఇది మానవాళికి సరైన దిశలో మార్గదర్శనం చేస్తుంది. మానవుడు సహజంగా పుణ్యం, పవిత్రత, న్యాయశీలత, ఉన్నత నైతికత, ఆత్మాభిమానాలతో జీవితం గడపటాన్ని ఇష్టపడతాడు. ఇస్లాం కూడా ఈ కోరికలనే అతడిలో జనింపజేయ గోరుతుంది.

➢ ఇస్లాం అంధానుకరణను ప్రోత్సహించదు. ఇది మనిషి స్ఫూర్తిని, ఆలోచనను గౌరవిస్తుంది. ఈ స్వభావం కారణంగానే మానవుడు దేవుని దృష్టిలో సర్వోత్కృష్టజీవి అయ్యాడు. అందువల్ల అతను స్ఫూర్తి, బుద్ధికౌశల్యాలతో వ్యవహరిస్తూ తనను సృష్టించిన శక్తిస్వరూపుడ్ని గుర్తించి ఆయన ఏకత్వాన్ని విశ్వసించాలి; ఆయనకు తప్ప మరెవరికీ తల వంచకూడదు; భూమ్యాకాశాలు, సూర్యచంద్రులు, గ్రహాలు, నక్షత్రాలు, ఇతర ప్రకృతి శక్తులకు దైవత్వాన్ని ఆపాదించకూడదు. అలాగే పండితులు, మతపెద్దలు, పాలకులు,

కల్పిత దేవతలలో ఎవరినీ సామ్రాజ్య యజమానిగా భావించరాదు. ప్రళయ దినాన వారి పాండిత్యం, పెద్దరికం, రాచరికం, ఆధిపత్యాలేవీ వారిని నరక యాతనల నుండి తప్పించలేవు. అత్యున్నతమైనది, అన్నిటికీ మించినది **"లా యిలాహ ఇల్లల్లాహ్"** (అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడు) మాత్రమే.

➢ ప్రపంచం ప్రారంభం నుండే మానవుల మార్గదర్శనం కోసం దేవుడు ప్రత్యేక పుణ్యపురుషులను ప్రభవింపజేస్తూ వచ్చాడు. వారు ప్రజలకు సత్య ధర్మాన్ని, నీతినియమాలను బోధించారు; దైవాభీష్టం ప్రకారం పరిశుద్ధ జీవితం గడిపే విధానం నేర్పారు. వారినే దైవప్రవక్తలని అంటారు. ఈ ప్రవక్తలు ప్రతి యుగంలో, ప్రతి జాతిలో ఉద్భవించారు. అందరికన్నా చివర్లో మహనీయ ముహమ్మద్ (సల్లం) వచ్చారు. గత దైవప్రవక్తలయిన ఇబ్రాహీం, మూసా, ఈసా (అలైహి)లు బోధించిన విషయాలే మహనీయ ముహమ్మద్ (సల్లం) కూడా ప్రజలకు బోధించారు. ఆయన ఇప్పుడు ప్రళయం వరకూ యావత్తు మానవుల మార్గదర్శనం కోసం వచ్చిన అంతిమ దైవప్రవక్త. ఆ మహనీయుని జీవితచరిత్ర, ఆయనపై అవతరించిన అంతిమ దైవగ్రంథం దివ్యఖుర్ఆన్ అన్నివిధాలా సురక్షితంగా వున్నాయి.

దైవప్రవక్త హోదా

● దైవప్రవక్త కూడా మానవుడే. దైవత్వంలో ఆయనకు ఎటువంటి భాగస్వామ్యం లేదు. ఆయన మానవాతీతుడు కాదు, మానవ బలహీనతలకు అతీతుడూ కాదు అని కూడా ఇస్లాం చెబుతోంది. ఆయన పని దైవదాసులకు దైవసందేశం అందజేయడమే. హజ్రత్ ముహమ్మద్ (సల్లం) కూడా ఇతర ప్రవక్తలలాగే మానవమాత్రుడు. ఆయన దేవుని తరఫున ఇస్లాం ధర్మాన్ని పునరుద్ధరించే విధిని నిర్వహించారు. ప్రజలు ఆయన బోధనలు ఆచరించాలి. ఇదే ఆయనకు నిజమయిన అనుసరణ. ముస్లింలు నేటి వరకూ ఈ బోధనల్ని ఆచరిస్తున్నారు. స్వయంగా దైవప్రవక్త (స) తమ వ్యక్తిత్వం, హోదా గురించి సెలవిచ్చిన విషయాలను వారు అంగీకరిస్తున్నారు.

కాని ఇతర మతాలవారు ఇక్కడే దెబ్బతిన్నారు. వారు దైవప్రవక్తలకు దైవత్వాన్ని ఆపాదించి వారిని దేవుని అవతార పురుషులుగా భావించి పూజించ

సాగారు. గౌతమబుద్ధుడు, మహావీరుల ఉదాహరణలు మన ముందున్నాయి. కాని వారు సాధారణ మానవులుగానే జన్మించారని, తమ అంత్యకాలానికి చేరుకొని మరణానికి గురిఅయ్యారని చరిత్ర సాక్ష్యమిస్తోంది.

★ ఇస్లాం మనిషికి కేవలం ఆరాధనా విధానం, ఆచారాలు మాత్రమే నేర్పలేదు. అది సంపూర్ణ జీవన వ్యవస్థను చూపింది. దాని పరిధిలో నీతినియమాలు, సభ్యతా సంస్కృతులు, వ్యాపార లావాదేవీలు, సామాజిక విషయాలు, రాజకీయ వ్యవహారాలు, న్యాయవ్యవస్థ, సంధి, యుద్ధం, అంతర్జాతీయ సంబంధాలు వగైరా అన్ని విభాగాలూ వున్నాయి. ప్రజలు కేవలం పూజా పునస్కారాలు, కొన్ని ప్రత్యేక ఆచారాల పాటింపునే మతం అని భావిస్తూ వచ్చారు. కాని ఇచ్చిపుచ్చుకోవడాలు, వ్యాపార వ్యవహారాలు, రాజకీయం అన్నీ మతంలోని భాగాలే అని ఇస్లాం తెలిపింది. అంటే మతం ప్రభావం ఆరాధనాలయాలు, చర్చీలు, మస్జిదుల నుండి, బజారులు, పొలాలు, ప్రభుత్వ కార్యాలయాలకు సయితం వ్యాపించిందన్న మాట.

విశ్వవ్యాప్త సందేశం

పూర్వపు మతాల మాదిరిగా ఇస్లాం, ఒక ప్రత్యేక జాతిని, తెగను లేక ఒక దేశవాసుల్ని సంబోధించలేదు. ఇది మానవసంతతి మొత్తాన్నీ సంబోధించింది. దీన్నిబట్టి ఇస్లాం సందేశం విశ్వజనీనమైనదని స్పష్టం అవుతోంది. దీని ధర్మశాస్త్రం (షరీఅత్) ప్రపంచంలోని యావత్తు సమాజాల సమస్యల్ని పరిష్కరించగల సమగ్ర ధర్మశాస్త్రం.

★ ఇస్లాం యావత్ప్రపంచ ప్రజలను వసుధైక కుటుంబంగా పరిగణిస్తూ విశ్వమానవ సోదరభావాన్ని గురించి నొక్కిచెబుతోంది. అందుకు ప్రాతిపదిక, దేవుడు తన గ్రంథంలో అవతరింపజేసిన ఈ చిన్న వాక్యం చూడండి:

"కానన్నాసు ఉమ్మతన్ వ్వాహిదహ్."

(మానవులందరూ ఒకే కుటుంబం, ఒకే సోదర బంధంలోని వారు.)

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీపురుష జంట నుండి పుట్టించాము. తర్వాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న

జాతులుగా, తెగలుగా చేశాము. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు." (49:13)

ఈ విధంగా ఇస్లాంలో బానిస, యజమాని, సేవకుడు, ధనికుడు, పేద, జాతి, వర్ణం, వంశం ప్రాతిపదికలపై ఎటువంటి విచక్షణ లేదు. ఈ సందేశాన్ని స్వీకరించిన ప్రతి వ్యక్తీ హక్కులలో సమానుడు, అతడు తాతారీల పశువుల కాపరి అయినా, ఖురైష్ వంశంలోని మక్కా పాలకుడయినా సరే. దైవప్రవక్త (సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ప్రజలారా! జాగ్రత్తగా వినండి, మీకందరికీ దేవుడు ఒక్కడే. అరబ్బులకు అరబ్బేతరులపైగానీ, అరబ్బేతరులకు అరబ్బులపై, తెల్లవాళ్ళకు నల్లవాళ్ళపైగానీ, నల్లవాళ్ళకు తెల్లవాళ్ళపైగానీ దైవభీతి ప్రాతిపదికపై తప్ప ఎలాంటి ఔన్నత్యం లేదు. మీలో అందరికంటే ఎక్కువ దైవభీతిపరుడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు......" (బైహఖి)

ఈ బోధనల ఫలితంగానే శతాబ్దాలుగా తమ ఆధిక్యతను చాటుకుంటూ ప్రజల నెత్తిన కూర్చున్న రాజులు, పండితులు, జ్యోతిష్కులు, ధర్మకర్తలు, ధనికులు అందరూ తమ అసలు స్థానానికి దిగి వచ్చారు. ఇక ఇప్పుడు తమ తమ ప్రయత్నాల ద్వారా ఎంత ధర్మనిష్ఠ అవలంబిస్తే అంతే దేవునికి చేరువ కాగలుగుతారు.

మతవ్యవహారం- ప్రపంచవ్యవహారం

ఇస్లాం మతవ్యవహారాన్ని, ప్రపంచవ్యవహారాన్ని విడదీసి రెండు వేర్వేరు అరల్లో పెట్టదు. ఈ రెండిటిని కలిపి ఒకే పరిధిలో ఉంచింది. అలాగే ఇస్లాం సన్యాసత్వాన్ని, వైరాగ్యభావనలను కూడా అంగీకరించదు. వైరాగ్యం వల్ల దాసులహక్కులు, స్వీయహక్కులు కాలరాయబడతాయి. ప్రపంచాన్ని త్యజించడంకన్నా, ప్రాపంచిక ఝంజాటంలో వుంటూనే దైవభక్తిని పాటించమని ప్రోత్సహిస్తుంది. సన్యాసుల మఠాల్లో, ఆశ్రమాల్లో, కొండగుహాల్లో అన్వేషిస్తూ వచ్చిన అత్యున్నత సుగుణసంపత్తిని మరణానంతరం దేవుని ముందు జవాబు చెప్పుకోవలసివుంటుందన్న భావనను జనింపజేయడం

ద్వారా ఇల్లు, కార్యాలయం, బజారు, న్యాయస్థానం వగైరా అన్నిచోట్ల పొందవచ్చని ఇస్లాం తెలియజేస్తోంది.

ఇస్లాం- ధన సమస్య

★ ఇస్లాం సంపదను కూడబెట్టి స్తంభింపచేయడాన్ని వ్యతిరేకిస్తుంది. ఆర్జించిన సంపదతో పేదలు, అనాథలు, అగత్యపరులు, దిక్కులేనివారి హక్కులను నెరవేర్చాలని చెబుతుంది. అది ప్రజలను ధర్మసమ్మతమయిన (హలాల్) ఉపాధి వైపు పిలుస్తోంది. ఎలాంటి శ్రమ లేకుండా లాభాలు ఆర్జించేవారిని అసహ్యించుకుంటుంది. ఇస్లాం వ్యాపారంలో దొంగదారులను మూసివేసింది. వడ్డీ వ్యవహారాలను నిషేధించింది. కష్టార్జితాన్ని పుణ్యకార్యంగా పరిగణిస్తుంది. హలాల్ సంపాదనవల్ల మనిషికి మనశ్శాంతి, దైవచింతనలు లభిస్తాయని, అక్రమ సంపాదనతో ఒక ముద్ద తిన్నా మనిషిపై అంధకారం ఆవరిస్తుందని చెబుతోంది. ఇతర మతాలలో అక్రమసంపాదన, సక్రమ సంపాదన అన్న తేడా లేదు. అక్కడ డబ్బు ఏ విధంగా సంపాదించినా ఫరవా లేదు. ఈ ధోరణివల్లే నేడు ప్రపంచంలో నలుమూలలా చెడులు విలయ తాండవం చేస్తున్నాయి. ఇస్లాం అక్రమ సంపాదనా మార్గాలన్నీ మూసివేయ గోరుతోంది. ఇది కష్టపడి సంపాదించడాన్ని ఉత్తమ ఆరాధనగా పేర్కొంటూంది.

మరికొన్ని విశిష్ఠ లక్షణాలు

★ ఇస్లాంలో సారాయి తదితర మత్తుపదార్థాల్ని నిషేధించడం జరిగింది. అదే విధంగా వడ్డీని సమాజానికి శాపంగా చెప్పబడింది. ఒక విధంగా మానవాళికి ఎదురయ్యే సమస్యలకు కారణం వడ్డీయే.

★ ఇస్లాం కేవలం సైద్ధాంతిక బోధనలను పేర్కొనదు. వాటిని క్రియా జీవితంతో అనుసంధానం చేస్తుంది. వాటి ప్రకారం ఒక సమాజాన్ని నిర్మించి కూడా చూపింది. అందులో ప్రజల వ్యక్తిగత, సామూహిక జీవితాల్లో ఒక ప్రత్యేక సమతూకం జనించింది.

★ ఇస్లాంకు పూర్వం ఉన్న మతాలన్నీ ఏదో ఒక దేశం లేక జాతితో సంబంధం కలవి. ఉదాహరణకు, హిందూమతం భారత సరిహద్దులకు

పరిమితమయింది. కన్ఫ్యూషియస్ మతబోధనలు చైనా నాలుగు గోడలు దాటి బయటకు పోలేదు. జొరాస్టర్ మతం కేవలం ఈరాన్ ప్రజల కోసం ప్రత్యేకించబడింది. హజ్రత్ మూసా (అలై) యూదజాతికి మాత్రమే దైవసందేశం అందజేశారు. యూదులు తమ జాతికి చెందనివారిని నీచులుగా భావిస్తారు. అంచేత వారు ఇతర జాతులవారికి దైవసందేశం వినిపించడానికి ఇష్టపడేవారు కాదు. దాదాపు హజ్రత్ ఈసా (అలై) బోధనల పరిస్థితి కూడా అంతే. ఇస్లాంకు మాత్రమే ఒక ప్రత్యేకత ఉంది. దాని సందేశం నల్లవారు, తెల్లవారు, ఆఫ్రికన్లు, అమెరికన్లు, ఇండియన్లు, చైనీయులు అన్న తేడాలేకుండా యావత్తు ప్రపంచ ప్రజల కోసం వచ్చింది. ఇస్లాం సకల మానవాళి కోసం తన ద్వారాలను తెరచి వుంచింది. ప్రజలు ఏజాతి నుండి ఎలాంటివారు వచ్చినా వారిని స్వీకరించి తన సమాజంలో చేర్చుకుంది. హసన్ బస్రా నుండి వచ్చారు. బిలాల్ అబిసీనియా నుండి, సుహైల్ సిరియా నుండి వచ్చారు. అన్ని బిందువులు సముద్రంలో కలసి ఏకం అయ్యాయి. నేడు వారి పేరుతోపాటు రజియల్లాహు అన్హు చేర్చి పలకడం, వ్రాయడం జరుగుతోంది. దీనినిబట్టి వారికి లభించిన గౌరవం వ్యక్తం అవుతోంది. దీన్నిబట్టి ఈ క్రింది విషయాలు తెలుస్తున్నాయి:

★ ఇస్లాం విశ్వజనీన ధర్మం. అంటే ఈ ధర్మం యావత్తు మానవ జాతి కోసం ఉద్దేసింపబడింది.

★ ఇందులో ఒకే దేవుడు, చివరి ప్రవక్త, ఒకే గ్రంథం, ఒకే మార్గం, ఒకే ఆరాధనాకేంద్రం (ఖిబ్లా) అనే భావన ఉంది. ఈ భావన విశ్వమానవ సముదాయానికి, వసుధైక కుటుంబానికి కావలసిన పటిష్ఠవంతమైన ప్రాతిపదిక. ఇంత గట్టి పునాది ప్రపంచంలోని మరే మతంలోనూలేదు. ఆ మతాలు ఇంత గట్టి పునాది నిర్మించుకోదలచినా నిర్మించుకోలేవు.

★ ఇస్లాం మతవిషయాలు, ప్రాపంచిక వ్యవహారాల రెండిటి కలియకతో ఏర్పడిన సమగ్ర ధర్మం. ఏదైనా మతకార్యం నిర్వహించవలసి వస్తే మనిషి పూర్తి ఏకాగ్రతతో, అపార భక్తిపారవశ్యంతో దేవుని ముందు మోకరిల్లాలని చెబుతుంది. ప్రాపంచిక వ్యవహారాలయితే దైవనిర్ణీత పరిధిలో

ఉంటూ వాటిని కూడా బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఆదేశిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే మనిషి ఇటు ప్రాపంచిక వ్యవహారాలలో తల మునకలై దేవుని పట్ల ఏమరుపాటుకు గురికాకుండా, అటు దేవుని స్మరణలో లీనమై ఆయనదాసుల హక్కుల నిర్వహణను విస్మరించకుండా మధ్యేమార్గం అవలంబించాలని ఇస్లాం బోధిస్తుంది.

ప్రతి మతంలో మనిషి సాధారణంగా అతివాదానికీ, మితవాదానికీ లోనవుతాడు. ఒక అతివాదం- మనిషి ప్రాపంచిక వ్యామోహంలో పడి ధర్మా ధర్మాల విచక్షణ లేకుండా నాలుగు చేతులా సంపాదిస్తూ హద్దులు మీరిన సుఖభోగాలకు మరిగి పచ్చి భౌతికవాదిగా మారుతాడు. దాంతో అతను దేవుణ్ణి కూడా మరచిపోతాడు. అంతేకాదు, హింసాదౌర్జన్యాలకు దిగితే ఊళ్ళకు ఊళ్ళు నాశనం చేస్తాడు.

దీనికి భిన్నంగా మరొక మితవాదం- మనిషి ధర్మపరాయణత వైపు మొగ్గినప్పుడు దైవచింతనలో హద్దులు మీరిపోయి భార్యాపిల్లలు, తల్లి దండ్రులు, బంధుమిత్రులు, ఆప్తులు అందర్నీ విడిచి ఏకాంత కుహరాలకు చేరుకుంటాడు. దైవానుగ్రహాల నుండి ముఖం తిప్పుకొని జీవిత సుఖాలన్నిటినీ నిషేధించుకుంటాడు. చివరికి దుస్తులు ధరించడం కూడా మానుకొని దిశ మొలతో ఉండిపోతాడు.

ఇస్లాంకు పూర్వం ఆరాధనా పద్ధతులు కూడ విచిత్రంగా ఉండేవి. గంటలు మ్రోగించడం, ఈలలు-కేకలతో చిందులు తొక్కడం, విగ్రహాల ఎదుట నాట్యమాడటం, వాటి చుట్టూ నగ్నంగా ప్రదక్షిణ చేయడం మొదలైన ఆచారాలు అనాడు అరేబియాలో కూడా ఉండేవి. మతం పేరుతో ఈ ఆచారాలు వివిధ దేశాలలో ఈనాడు కూడా కొనసాగుతున్నాయి.

ఇస్లాం అసహజమయిన ఈ ఆచారాలన్నిటినీ అంతమొందించింది. మొట్టమొదట ఇస్లాం మనిషికి దేవుని అసాధారణ శక్తిసామర్థ్యాలను, ఆయన గుణగణాలను, లక్షణాలను తెలిపి ఏకదైవారాధనను గురించి బోధించింది. తరువాత అంతర్బాహ్యాల పరిశుద్ధత కోసం నమాజ్, రోజా, జకాత్, హజ్

ఆరాధనల్ని విధిగా చేసింది. ఇలా ఇస్లాం అతివాద, మితవాద పోకడల్ని సమ తూకంతో మార్చివేసింది. ఇస్లాంలో మనిషి ఇల్లూవాకిలీ వదలి కొండగుహలు, అడవుల పాలుకానవరం లేదు. ఆకలిదప్పులతో శరీరాన్ని శుష్కింప జేయ వలసిన పనీ లేదు. పైగా సామాజిక సాంస్కృతిక హక్కులను నిర్వహిస్తూ ప్రశాంత జీవితం గడపవచ్చు.

జీవనప్రదాయిని ఆచూకీ

ఎండ తీక్షణంగా వుండి, బాగా దాహం వేస్తున్నప్పుడు దగ్గర్లో ఏదైనా బావి కనబడితే మనిషి ఎంత సంతోషిస్తాడు! అతను ఒక్క ఉదుటన పోయి నీరు సంపాదించేందుకు ప్రయత్నిస్తాడు. ప్రస్తుతం మానవాళి పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ప్రాణాలు దక్కించుకోడానికి దప్పికతో నీళ్ళ కోసం అలమటించే, అన్వేషించే బాటసారిని పోలివుంది మానవాళి పరిస్థితి. మామూలు బావి కాదు. ఇస్లాంలాంటి జీవనప్రదాయిని అయిన సెలయేరు కూడా కళ్ళెదుట వుంది. దాన్ని గురించి సంక్షిప్త పరిచయం వెనుకటి పేజీలలో చేయబడింది.

- అది ఒక సంపూర్ణ జీవనవ్యవస్థ.
- దాని మౌలిక బోధనలు మానవ స్వభావం, బుద్ధి వివేకాలతో పూర్తిగా సామరస్యం కలిగివున్నాయి.
- అది మనిషికి మనుషుల బానిసత్వం నుండి విముక్తి కలిగించి నిష్పాక్షిక న్యాయం, సమానత్వాలను ప్రసాదిస్తుంది.
- అది మనిషిని కల్పనలు, భ్రమల మాయాజాలం నుండి తీసి నిజమైన ఆధ్యాత్మికత, నైతికత, పవిత్రతల వైపు మార్గదర్శనం చేస్తుంది.
- అది ఇహపర లోకాల రెండిటినీ సంస్కరిస్తుంది. దానివల్ల ధార్మిక జీవితంలోనూ, ప్రాపంచిక జీవితంలోనూ సమతూకం జనిస్తుంది.
- అది లజ్జ సగం విశ్వాసం అని అంటోంది.
- **కూలివానికి** ప్రతిఫలం వెంటనే అందజేయాలని నొక్కి చెబుతోంది.

❖ ఒకరిని దుష్టునిగా భావిస్తూనే అతడికి సహకరించేవాడు ఇస్లాం నుండి వెలుపలికి వచ్చినట్లే అని అంటోంది. నేడు ఎటుచూసినా హింసా దౌర్జన్యాలు, అశ్లీలం, అక్రమార్జనలు తాండవమాడుతూ కన్పిస్తున్నాయి. కార్మికులు అణచివేతకు గురవుతున్నారు. పెట్టుబడిదారులు నిత్యం కొత్తకొత్త పద్ధతులతో జనాన్ని దోచుకుంటున్నారు. పెద్ద రాజ్యాలు చిన్న రాజ్యాలను నిలదొక్కుకోకుండా లేనిపోని సమస్యలు సృష్టిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులలో, ఈ అస్థవ్యస్త కాలంలో ప్రపంచానికి ఈ ఇస్లామీయ విలువలే అవసరం అవుతాయి.

ఆధునిక యుగం ప్రత్యేకతలు

బలహీనతను గుర్తించడం

● ప్రస్తుత యుగానికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. వాటిలో ఒకటి, ప్రపంచ మానవాళికి తన బలహీనతలు ఏమిటో తెలిసివచ్చింది. పతనావస్థ నుండి పైకి లేవాలన్న ఆకాంక్ష జనించింది. మానవ సంతతి ఇప్పుడు ఏ లక్ష్యం వైపు పురోగమిస్తుందో అది వినాశానికి చిహ్నామని భావిస్తూ ప్రతి ఒక్కడూ దాని నుండి విముక్తి పొందడానికి తహతహలాడుతున్నాడు. ఇటువంటి వాతావరణంలో ఇస్లాం ఆశాజ్యోతిలాంటిది.

చెరిగిపోతున్న ప్రపంచ సరిహద్దులు

● రెండో ప్రత్యేకత, ప్రపంచం ఈనాడు ఒక గృహంలా అయిపోయింది. పూర్వకాలంలో దేశాలను, జాతులను పరస్పరం కలసిపోకుండా ఏర్పడిన చిన్న చిన్న సరిహద్దులు ఇప్పుడు చెరిగిపోయాయి. యావత్తు ప్రపంచం ఒక పెద్ద కుటుంబంగా మారిపోయింది. దాని ప్రభావానికి మనదేశం కూడా లోనయింది. కనుక మన దేశానికి, ప్రపంచానికీ విశ్వమానవ సౌభ్రాతృత్వం, ఒక విశ్వజనీన వ్యవస్థ ఎంతో అవసరం. విశ్వమానవ సౌభ్రాతృత్వం కలిగివున్న ఏకైక విశ్వజనీన వ్యవస్థ ఇస్లాం మాత్రమే. అందువల్ల

ప్రపంచ ప్రజలు ఇప్పుడు ఇస్లాం వడిలో ఆశ్రయం పొందడం తప్ప మార్గాంతరం లేదు.

విద్యాజ్ఞానాల ప్రాముఖ్యం

రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న విద్యాజ్ఞానాలు ప్రతి మనిషి ఆలోచనా దృక్పథాన్ని విస్తృతం చేశాయి. విద్యావంతుని దృష్టిలో పురాతన మూఢాచారాల వాస్తవాలు తేటతెల్లం అయ్యాయి. పూర్వం ప్రజలు అంధ విశ్వాసాల కారణంగా తమ చుట్టూ ఒక గిరి గీసుకొని అదే వాస్తవం అని భావిస్తుండేవారు. ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. ఇప్పుడు విద్యావంతుడు ప్రతి విషయాన్నీ తన మేధకు పదునుపెట్టి పరిశీలిస్తున్నాడు. సత్యాన్ని అన్వేషిస్తున్నాడు. స్వయంగా తన వర్గంలోని అహేతుకమైన పాత విషయాల్ని బహిరంగంగా ఖండిస్తున్నాడు. జీవితం కొత్తమలుపు తిరుగుతున్న ఇలాంటి పరిస్థితుల్లో విశాల హృదయంతో ఇస్లాంను అధ్యయనం చేస్తే యదార్థం ముందుకు వస్తుంది.

సైన్సు పరిశోధనలు

దాంతోపాటు ఆధునిక సైన్సు పరిశోధనలు ఎన్నో విషయాలకు రుజువులు అందించాయి. దానివల్ల ఎన్నో అపరిష్కృత విశ్వాసాల వాస్తవిక తెలిసింది. భూమ్యాకాశాలతో పాటు యావత్తు విశ్వవ్యవస్థను సృష్టించినవాడు ఒకడున్నాడని, ఆయనే దీన్ని నడిపిస్తున్నాడని సృష్టిలోని అణువణువూ ఎలుగెత్తి చాటుతోంది. నేటి మానవుడు తన ముందుకు వచ్చిన సైన్సు పరిశోధనలవల్ల ఈ సత్యాన్ని సులభంగా అంగీకరిస్తున్నాడు. ఈ భావన మానవ స్వభావానికి అనుగుణమైనది కూడా. ఇస్లాం ఈ భావన వైపునకే మానవుడికి మార్గదర్శనం చేస్తోంది.

చారిత్రక ఉదాహరణలు

సృష్టిరహస్యాలను ఛేదించడంలో సాగుతున్న ఈ పరిశోధనలు, తద్వారా క్రమవికాసం చెందుతున్న మానవ భావజగత్తు, విస్తృతమవుతున్న

ఆలోచనా దృక్పథం భవిష్యత్తుకు శుభసూచకాలని చెప్పవచ్చు. ప్రపంచ జాతులు, తెగలు పరిస్థితులను బట్టి విభిన్న సంస్కృతులు, జీవన విధానాలు అవలంబించినట్లు చరిత్ర అధ్యయనంవల్ల కూడా తెలుస్తోంది. అంటే జాతులు ఒక సంస్కృతి స్థానంలో మరో సంస్కృతిని అవలంబించాయి. పురాతన మతవిశ్వాసాలు వదిలేసి కొత్త మతవిశ్వాసాలు స్వీకరించాయి. చరిత్ర పయనంలో ఇటువంటి ఉదాహరణలు ఎన్నో మనకు కానవస్తాయి. మన దేశంలోనూ వివిధ కాలాల్లో ఇలా జరిగింది. ఆర్యుల రాక నుండి అశోక చక్రవర్తి కాలం వరకు ఇక్కడి లక్షలాది పౌరులు పాత విధానాల స్థానంలో కొత్త విధానాలు అవలంబించారు. వారు బ్రాహ్మణుల మతపరమైన జాగీర్దారీ బంధనాల నుండి బయటపడేందుకు ఆర్యుల విశ్వాసాలకు, పునర్జన్మ సిద్ధాంతానికి పూర్తి విరుద్ధమైన బౌద్ధ, జైన ధర్మాలను స్వీకరించారు.

భారతదేశానికి ముస్లింల రాక

ముస్లిములు వ్యాపార సామగ్రితో, సేవానిరతితో భారత ప్రజలకు దైవమార్గం చూపాలన్న ఉద్దేశంతో ఈ దేశానికి వచ్చారు. వారిక్కడికి సంకుచిత దృష్టి, దురభిమానాలు, మూఢనమ్మకాలకు అతీతమైన ఇస్లామీయ సంస్కృతిని తెచ్చారు. దేవునికి, దాసునికి మధ్య ఉండవలసిన నిజమైన సంబంధం గురించి ఇక్కడి ప్రజలను జాగృతపరచారు. సాంఘిక చెడులను నిర్మూలించే, సమాజాన్ని సమూలంగా సంస్కరించే పనులు చేపట్టారు. ఇక్కడ వివిధవర్గాల మధ్య ఉన్న ఉచ్ఛనీచాల అడ్డుగోడల్ని కూల్చి సమానత్వ వాతావరణం సృజించడానికి కృషిచేశారు. ఇక్కడి విజ్ఞానసంపదను ఆర్జించి తమ పరిశోధనా శక్తి సామర్థ్యాలతో ఈ దేశ పునర్నిర్మాణం, పురోభివృద్ధుల కోసం రాచబాటలు ఏర్పరచారు. ఈ సంస్కరణలు, సత్కార్యాలతో ప్రభావితులయి లక్షలాది మంది గతంలో ఇస్లాం స్వీకరించారు. ఈనాడు కూడా సత్యప్రేమికులయిన వేలాదిమంది ప్రజలు సత్యాన్వేషణలో ఉన్నారు. కాస్తంత ప్రయత్నం చేస్తే, ఇలాంటి ప్రజల హృదయాలు పరివర్తన చెందడం పెద్ద కష్టమేమీ కాదు.

చెడును చెడుగా భావించే, మంచిని అత్యంత విలువయిన వస్తువుగా తలచేవారికి ప్రపంచంలో కొదవలేదు. మానవ స్వభావం అధ్యయనం చేసిన తర్వాత నేనీ మాట అంటున్నాను. ఇటువంటి అనుభవం మీకూ ఎదురయి వుండవచ్చు. ఈనాడు ప్రపంచంలో ఎటు చూసినా హత్యలు, అరాచకాలు పేట్రేగిపోతున్నాయి. ప్రతి పెద్ద చేపా, చిన్న చేపను మింగడానికి పొంచివుంది. బలమైన జాతులు బలహీన జాతులను అణగద్రొక్కడంలో నిమగ్నమై ఉన్నాయి. ఊరూరా, వాడవాడనా మతోన్మాదం వరదలా ముంచెత్తు తోంది. వర్ణాధిక్యతా భావన, అజ్ఞాన భూతం ప్రతి మనిషి నెత్తిన నర్తిస్తోంది. చెడును చెడుగా తలిచే సహృదయులు ఇదంతా చూసి తీవ్ర ఆందోళన చెందుతూ మనిషికి మనశ్శాంతి చేకూర్చగలిగే వ్యవస్థ ఏదైనా ఉంటే బాగుంటుందని భావిస్తారు. ఇలాంటి వ్యవస్థ ఇస్లాంలో తప్ప మరెక్కడా లేదు.

సమాజంలో నీతిరాహిత్యం

అదేవిధంగా సమాజ పరిధిలో కూడా ఈనాడు నీతినడవడికలు మృగ్యమైపోయాయి. మనిషి మనోవాంఛలకు బానిసగా మారిపోయాడు. విద్య, రాజకీయం, సంస్కృతి, వాణిజ్యం- ఇలా సమాజం అతని చుట్టూ పరిభ్రమిస్తోంది. భర్తల సేవ కోసం, పిల్లల పెంపకం కోసం భార్యలకు తీరిక చిక్కడం లేదు. ఆఫీసులలో, కార్ఖానాలలో శ్రమపడిన తర్వాత లభించే తీరిక సారాదుకాణాల పాలవుతోంది. దీనివల్ల కుటుంబవ్యవస్థ విచ్ఛిత్తికి, అధోగతికి గురవుతోంది.

ధన పిపాస

రోజురోజుకు పెరుగుతున్న ధన పిపాసను కూడా చూడండి. అది వడ్డీ, మత్తుపదార్థాలు, బ్లాక్‌మార్కెటింగ్, లాటరీ, జూదం వంటి సంపాదనా శాపాలకు జన్మనిచ్చింది. ఫలితంగా అడుగడుగునా స్వార్థం, అవినీతి, మోసాలు ఎదురవుతున్నాయి. డబ్బు విషయంలో తండ్రి, సంతానం సైతం ఒకరినొకరు అనుమానించుకుంటున్నారు.

సెక్సు సిద్ధాంతాల వ్యాప్తి

ఫ్రాయిడ్ సెక్సు సిద్ధాంతాలు యూరపు నుండి మన దేశానికి కూడా చేరుకున్నాయి. ఇప్పుడిక్కడ కూడ నగ్నరక్కసి తన పరిధిని విస్తరించుకుంటూ పోతూంది. అర్థనగ్న వస్త్రధారణ, నగ్న చిత్రాలు, వొళ్ళు జలదరించే సంగీతం, కుటుంబ నియంత్రణలకు మితిమీరిన ప్రాముఖ్యం లభిస్తోంది. పెళ్లికాని తల్లుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది.

ఈనాడు చాలామంది గౌరవనీయ మహిళలు వెండి తెరకు అలంకార ప్రాయులయ్యారు. వేదికలను అలంకరిస్తున్నారు. పార్లమెంటు సమావేశాలలో పాల్గొంటున్నారు. దుకాణాలలో సేల్స్ ఉమెన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ పనులన్నీ ఎందుకు చేస్తున్నారు? ఈనాడు స్త్రీ వలువలు నడి బజార్లో ఊడుతున్న సంగతి అందరికీ తెలిసిందే. స్త్రీలు కూడా చరస్, భంగు, నల్లమందు, సారాయిలను నిస్సంకోచంగా వాడుతున్నారు. వాటి దుష్ఫలితా లకు మనిషి బెంబేలెత్తిపోతున్నాడు. కొందరు ఇలాంటి వాతావరణాన్ని ఇష్టపడవచ్చు. కాని మానవత్వం ఇంకా బజారుతనం అవలంబించేటంతగా దిగజారలేదు. కనుక సౌశీల్యవంతులకు సత్యం, పవిత్రత, లజ్జావ్రీడల సందేశ మిస్తే మానవతావనం సస్యశామలమయ్యే అవకాశాలు ఉన్నాయి.

చికిత్సా ప్రయత్నం

మంచీ చెడుల విచక్షణా భావన మానవుని స్వభావంలోనే ఉంది. మంచిని కోరే, చెడు నుండి కాపాడుకునే తత్వం కూడా అతని స్వభావంలో ఉంది. కనుక సమాజంలో ఇలాంటి వికృతదృశ్యాలు కన్పించినపుడు సహృద యులు, సమాజ శ్రేయోభిలాషులు వీటిని ఎలా నిర్మూలించాలని ఆలోచి స్తారు. సమాజంలో పేరుకుపోయిన ఈ మలినాలను తమ ఊహాజనిత సిద్ధాంతాలతో శుద్ధి చేయడానికి ప్రయత్నించారు. కాని మౌలానా మౌదూది (రహ్మలై) సూచించిన ఈ క్రింది చికిత్సావిధానం ఎంతో గమనార్హమైనది:

"ప్రపంచంలోని అనామక మేధావులంతా అంతర్గత లోపంవల్ల పైన ఏర్పడే బాహ్యలక్షణాలపైనే తమ దృష్టిని కేంద్రీకరించారు. వారిలో ప్రతి ఒక్కడూ పైకి కనబడే పుండు మీదే చెయ్యిపెట్టి 'ఆపరేషన్ చేసి దీన్ని తొలగించండి, అంతా సర్దుకుపోతుంది' అన్నారు. కొందరు 'దీనంతటికీ కారణం నిరంకుశత్వం కనుక దాన్ని తుదముట్టించండి' అన్నారు. మరి కొందరు 'పెట్టుబడిదారీ విధానం ప్రపంచాన్ని నరకప్రాయం చేసింది. దాన్ని అంతమొందించండి' అన్నారు. కాని ఈ విషవృక్షం ఒక కొమ్మను నరికితే మరొక కొమ్మ పుట్టుకువస్తుంది. నియంతృత్వాన్ని నిర్మూలిస్తే పార్లమెంటు దైవత్వం నెలకొంటుంది. ఇంపిరిలిజం ప్రమాదం తగ్గిపోతే ప్రజలు తాము చేసుకున్న దైవాలకు దాసులయిపోతారు."

(సియాసీ కష్మకష్, మూడవ భాగం)

సామాజిక అసమానతల్ని దూరం చేసే ఉపాయాలు

ప్రపంచానికి సాంఘిక న్యాయం పంచుతామని, ఆర్థిక అసమానతలు తొలగిస్తామని గంభీరమైన నినాదాలతో సోషలిజం, కమ్యూనిజంవంటి ఉద్య మాలు ఆరంభమయ్యాయి. ఈ ఉద్యమ ధ్వజవాహకుల అభిప్రాయం ప్రకారం 'పెట్టుబడిదారులు ధనబలంతో కార్మికుల గౌరవమర్యాదలతో ఆడు కొంటున్నారు. వారి శక్తిసామర్థ్యాల్ని తమ స్వార్థానికి వాడుకుంటున్నారు. వ్యక్తిగత యాజమాన్య భావన, అధిక లాభార్జనా మనస్తత్వం కారణంగా సమాజంలో సమతూకం లోపించింది. పెట్టుబడిని ప్రజలందరికీ సమానంగా పంచితే అందరూ సంతోషిస్తారు, గుండె మీద చేయి వేసుకొని ప్రశాంతంగా నిద్రపోతారు.'

సోషలిజం - ఒక స్వాప్నిక సాఫల్యం

అయితే సోషలిస్టు వ్యవస్థలోని మనిషి పరిస్థితి గమనిస్తే ఇదే పని అక్కడా కొనసాగుతోందని, కాకపోతే స్వరూపం మారిందని తెలుస్తుంది. సోషలిజం అడుగుపెట్టిన ప్రతి చోటా మానవుని వ్యక్తిగత స్వేచ్ఛను ఘోరంగా కాలరాయడం జరిగింది. చివరకు ఒకే దేశంలోని ఒక రాష్ట్ర పౌరుడు మరో

రాష్ట్రానికి పర్మిట్ లేకుండా పోలేడు. అతడ్ని కలుసుకునే వారిపై కూడా నిఘా వుంటుంది. ఈ వ్యవస్థలోని ఉద్యమ సభ్యుల్లో దయ, జాలి అనేవి ఏ కోశానా ఉండవు. వారు గూండాగిరీ మతాన్ని మాత్రమే విశ్వసిస్తారు. ప్రత్యర్థులకు వ్యతిరేకంగా గూఢచార చర్యలు, బెదిరింపులు మాత్రమేగాక ప్రజావ్యతిరేకులన్న ఆరోపణలు మోపి వారిని జీవితాంతం క్యాంపులలో మ్రగ్గడానికి పంపిస్తారు.

కమ్యూనిజంలో ప్రజల పట్ల సానుభూతి ఉందట!

అలాగే కమ్యూనిజం కూడా మొసలికన్నీరు కారుస్తూ పేదల జీవితం దుర్భరంగా గడుస్తోందని కేకలు పెట్టింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో మార్పు అవసరమని, ఇప్పుడు సంపదను ఒకరి నుండి తీసి అందరికీ పంచివ్వడంలోనే మానవ సాఫల్యం ఉందని చాటింది. దాంతో బ్రహ్మాండమయిన విప్లవం వచ్చింది. రక్తపుటేరులు పారాయి. లక్షలాది మంది ఖతం అయ్యారు. జార్ చక్రవర్తి అంతమయ్యాడు. మానవాళికి శాంతి, సుఖాల సందేశం ఇచ్చేవారి చేతుల్లోకి అధికారం వచ్చింది. తర్వాత ఈ విప్లవం క్రమక్రమంగా ఒక దేశం నుండి మరొక దేశానికి వ్యాపిస్తూపోయింది.

కమ్యూనిజం - సత్యత గీటురాయిపై

కాని ఈ వ్యవస్థ ఎవరికీ ఎవరినీ అధిగమించే అనుమతి ఇవ్వదని అనుభవం నిరూపించింది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు మంచివయినా, చెడ్డవయినా సరే వ్యక్తులు వాటి కోసం అన్ని విధాల త్యాగాలు చేయడం ధర్మసమ్మతమేనని కమ్యూనిజం భావిస్తుంది. అది తన సిద్ధాంతాన్ని బలవంతంగానైనా ఒప్పించే విధానంపై విశ్వాసం ఉంచుతోంది. ఈ సిద్ధాంతాన్ని అంగీకరించిన దేశంలో మరే సిద్ధాంతాన్ని ప్రచారం చెయ్యకూడదు. మతం అంటే దానికి వెగటు. అసలు కమ్యూనిజానికి పునాది వ్యతిరేకతతో ప్రారంభమవుతుంది. దైవ వ్యతిరేకత, చర్చీ వ్యతిరేకత, దైవదౌత్య వ్యతిరేకత, చివరికి రాచరికానికి కూడా వ్యతిరేకతయే. తత్ఫలితంగా విశృంఖలత, విచ్ఛిన్నతలు తప్ప మరేమీ చేతికందలేదు. అంతేకాదు మత, నైతిక నిబంధనల ఓటమి మనిషిని రెక్కలు విరిగిన పక్షిలా చేసింది. 70 ఏళ్ళ సుదీర్ఘ కృషి తర్వాత

కూడా నేడు ప్రపంచంలోని ప్రతి దేశం, దేశంలోని ప్రతి గ్రామం, గ్రామంలోని ప్రతి ఇల్లు, ఇంటిలోని ప్రతి గృహస్తుని హృదయం భగభగ మండిపోతోంది. రెక్కలు ముక్కలు చేసుకొని శ్రమపడినా ప్రజల వాటాకు దారిద్ర్యం, దుర్భర జీవితం తప్ప మరేమీ రాలేదు. వీటన్నిటిని చూసిన తర్వాత మానవుని శ్రేయోసాఫల్యాల ధ్వజవాహకులుగా ముందుకు వచ్చిన ఈ నిజాలు, వాటి సిద్ధాంతాలు, నైతిక సూత్రాలు, వాటి సంస్కృతీ విధానాలు, వాటి సామాజిక, ఆర్థిక చట్టాలు, వారి రాజ్యాంగం, రాజకీయాలు సమస్తం శుష్కప్రియాలు-శూన్యహస్తాలని, పనికిమాలినవని, విచ్ఛినకరమైనవని, మానవుల్ని ఒకరినొకరు శత్రువులుగా చేసే విషయాలని చెప్పవలసి వస్తుంది.

భారత దేశం - మానవ శ్రేయస్సు

ఇక మన దేశం విషయానికి వస్తే, ఇక్కడ మానవ శ్రేయస్సు కోసం సవాలుచేసే శాశ్వత దృక్పథం ఏదీ లేదు. కాస్తోకూస్తో ఆకర్షణ అంటూ వుంటే అది అహింసా, పునర్జన్మ, కర్మ సిద్ధాంతాలలో వుండవచ్చు. అయితే ఈ సిద్ధాంతాలు ఆత్మను నిర్వీర్యం చేసి, ధైర్యస్థయిర్యాలను దిగజారిపోయేలా చేస్తాయి. అదీగాక ఇవి వేర్వేరు వ్యక్తుల వైయక్తిక జీవితాలకే పరిమితమయి పోయాయి. సంఘ జీవితానికి ఇవి బొత్తిగా పనికిరానివి. ప్రపంచ వ్యవహారాలు వదిలేయాలని, సహజసిద్ధమైన కోర్కెలు చంపుకోవాలని, జీవిత మాధుర్యాలు త్యజించాలని బోధించే తత్వవిచారం నిష్ఫలమైన వేదాంతం. ఈ వేదాంతం ప్రాతిపదికపై ఉనికిలోకి వచ్చే ఏ నాగరికతా ప్రపంచ వ్యవస్థను గతంలోనూ నడపించలేదు; ఈనాడూ నడిపించజాలదు. కర్మలు ఆచరించడం మానేసి, మానవ ప్రగతివికాసాలకు అడ్డుకట్టవేసే వైరాగ్యానికి ప్రాధాన్యత ఇచ్చేవారు మాత్రమే ఈ తత్వవిచారాన్ని పాటిస్తారు.

● అంతేకాకుండా ఇక్కడి సమాజంలోని అంటరానితనం, నిమ్నోన్నతా భావాలు సమాజాన్ని ముక్కచెక్కలైపోవడానికి తలుపులు తెరచిపెట్టాయి. వాటి కారణంగా భాష, జాతి, కుల, ప్రాంతీయ దురభిమానాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. దానివల్ల దేశ సమగ్రత, సమైక్యతలు ప్రమాదపుటంచులకు చేరుకున్నాయి.

● పాశ్చాత్య మేధావుల అనుకరణలో కొందరు మతాన్ని రాజకీయం నుండి వేరుచేయాలని కూడా అంటున్నారు. ఈ అభిప్రాయానికి సమర్థన ప్రస్తుతం తక్కువే అయినా దాని ఫలితాలు అనుభవంలోకి వస్తున్నాయి. రాత్రింబగళ్ళు సారాయి, నల్లమందు, గంజాయి అమ్మకాలకు లైసెన్సులు ఇవ్వబడుతున్నాయి. శీలం అమ్ముడుబోయే అడ్డాలకు చట్టపరమయిన భద్రత లభిస్తోంది. అశ్లీల, నగ్న చిత్రాలు ప్రదర్శించబడుతున్నాయి. మొత్తానికి ఆలోచనా వైరుధ్యం నలువైపులా కన్పిస్తోంది. ఇక ఈ భౌతికత్వం, నగ్నత్వాలలో మునిగివున్న ఈ జీవనవ్యవస్థ మానవుడ్ని ఏదయినా ఉన్నత స్థానానికి చేర్చే మార్గదర్శనం చేయగలుగుతుందా అన్నది ఆలోచించవలసిన విషయం.

మతాన్ని త్యజించడానికి హేతువులు

మనిషి చేసే ప్రతి పనిలో సహజంగానే కొన్ని ప్రేరణలు వుండి వాటిని అనుసరించడం ద్వారా అతను తనంటతాను నైతికత వైపు మరలుతాడు. మరి దైవం, మతాల్ని అతని మెడకు చుట్టడం దేనికి అని కొందరి అభిప్రాయం. ఈ సందర్భంగా వారు చూపే హేతువులు ఇలా ఉన్నాయి:

1) నైతిక సూత్రాల పాటింపుకు ప్రేరణ సంతోషం. దానిని ప్రతి మనిషీ జీవితంలోని అమూల్య వస్తువుగా భావిస్తాడు కనుక.

2) ఘనకార్యాలను సాధించాలన్న ఆసక్తి మనిషిని సత్కార్యం వైపు ఆకర్షిస్తుంది.

3) సమాజం పట్ల భయం, సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలన్న కోరిక మనిషిని చెడుల నుండి నిరోధిస్తుంది.

4) ప్రభుత్వం పట్ల భయం, దాని ప్రసన్నత పొందాలన్న అభిలాష కూడా అన్ని పనులకూ ప్రేరణ అవుతుంది.

కాని ఇవన్నీ పసలేని హేతువులు. పుణ్యకార్యంవల్ల మనసుకు సంతోషం కలిగే మాట నిజమే కాని, చాలామంది వ్యక్తులు సంతోషం కోసం దుష్కార్యాలకు పాల్పడటం మనం తరచుగా గమనిస్తున్నాం.

- ప్రావీణ్యం అనేది ఒక గుంభన పదం. చాలా మంది చెడ్డ పనులలో ముందుండటం కూడా ప్రావీణ్యంగా భావిస్తున్నారు.
- సమాజం, ప్రభుత్వాల పునాది నైతిక సూత్రాలపై ఉన్నప్పుడే వాటిపట్ల భయపడే లేదా వాటి అభిమానం పొందే భావోద్రేకాలకు ప్రేరణ లభిస్తుంది. లేకపోతే ఈ భావోద్రేకాలే నైతిక విలువల నాశనానికి కారణ మవుతాయి. చంగీజ్ ఖాన్, హలాకూ ఖాన్‌ల ప్రవర్తనలలో ఇలాంటి భావోద్రేకాలే పనిచేశాయి.

పైన పేర్కొన్న ప్రేరణల్లో ఏ ఒక్కటీ మనిషిని చెడు నుండి, నైతిక పతనం నుంచి నిరోధించే శక్తి లేదు. పైగా ప్రజలను నీతినియమాల కట్టు బాట్ల వైపు ఆకట్టుకునేంత శక్తి కూడా వాటికి లేదు. ఇంకా చెప్పాలంటే ఆధునిక యుగంలోని సమగ్ర నైతిక విధ్వంసానికి కారణం ఈ ప్రేరణలే.

దైవ భావన - చెడుల నివారణ

దైవభావన మానవుని స్వభావంలోనే వేళ్ళూని ఉంది. దేవుడు ఉన్నాడు. ఆయన మానవుల కర్మలను గమనిస్తున్నాడు. ఆయన శక్తిసామర్థ్యాలు అపారం. దుష్కర్మలు చేస్తే దేవుడు అతడ్ని నరకంలో పడవేస్తాడు. దాని శిక్ష తీవ్రాతి తీవ్రంగా ఉంటుంది. సత్కర్మలు ఆచరిస్తే అతడ్ని స్వర్గానికి పంపడం జరుగుతుంది. అది అత్యంత సుఖవంతమైన ప్రదేశం. ఈ భావనను మతం ఇచ్చింది. ఇది వాస్తవికతతో కూడిన దైవభావన.

ఇస్లామీయ జీవన దృక్పథం

ఇక ఇస్లామీయ జీవన దృక్పథం గురించి తెలుసుకుందాం. దాని వైపు ప్రజలు చూస్తున్నారు. ఏ మతంలోనూ లేని విశిష్ఠ లక్షణాలు వారికి ఇస్లాంలో గోచరిస్తున్నాయి.

- దానికి పునాది ఒకే దైవం, ఒకే ప్రజ.
- దాని సిద్ధాంతాలు, సూత్రాలు మానవుల ప్రాపంచిక, పారలౌకిక శారీరక, ఆధ్యాత్మిక జీవితాలన్నిటిలోనూ ఉన్నాయి.

◆ ఈ సిద్ధాంతాలు, సూత్రాలు నైతిక విలువలకు, దైవభక్తికి, దైవభీతి పరాయణతకు ప్రథమ స్థానం ఇస్తున్నాయి.

◆ ఇస్లాం మానవ స్వభావానికి సంతృప్తి నిచ్చే సత్సమాజాన్ని నిర్మించ గోరుతోంది. అది మానవత్వానికి గొప్ప హోదా కల్పించింది. చివరకు ఇస్లాం విగ్రహారాధకులకు సైతం మానవ హక్కులలో ఏ హక్కు విషయం లోనూ లోటు రానియ్యలేదు.

ఇస్లాం గురించి మేధావుల అభిప్రాయాలు

ఇస్లాంలోని ఈ సుగుణాలను చూసి ఎందరో ముస్లిమేతర మేధావులు వాస్తవాలను అంగీకరించారు. అలాంటి కొందరు మేధావుల అభిప్రాయాలను ఇక్కడ పేర్కొంటున్నాము. తద్వారా ఇస్లాం గురించిన వాస్తవాలు స్పష్టంగా ముందుకు రాగలవు.

❖ సర్ విలియం మేవర్ ఇస్లాంను తీవ్రంగా ద్వేషించేవాడని ప్రతీతి. అలాంటి మనిషి ఒక రచనలో ఇస్లాం గురించి తన అభిప్రాయం ఇలా వ్యక్తపరిచాడు:

"ఇస్లాంలో దైవభక్తి, దైవభీతి పరాయణత పరిపూర్ణంగా వున్నాయి. అవి ఇతర మతాలలో ఏమాత్రం కనబడవు. మానవ సుగుణసంపత్తికి, నీతి నడవడికలకు మూలకారణం ఇస్లాం మాత్రమేనని కూడా నేను అంగీక రిస్తున్నాను." (హుదా డైజెస్ట్)

❖ మిస్టర్ హెరాల్డ్ జెగ్రెయిన్ బర్గ్ అనే ఒక అమెరికన్ దార్శనికుడు ఇంగ్లీషు మ్యాగ్‌జైన్ "ఇస్లామిక్ రివ్యూ లండన్"లో ఒక వ్యాసం వ్రాశాడు. దాని శీర్షిక ఇలావుంది:

"ప్రస్తుత కాలంలోని ప్రజాస్వామ్యం నాసిరకం. ఇస్లాం మాత్రమే సంపూర్ణ ప్రజాస్వామ్యాన్ని అందివ్వగలదు."

ఆ తర్వాత ఇలా వ్రాస్తున్నాడు:

"ప్రపంచ మేధావులందరూ ఈ విషయంలో ఇలా ఏకాభిప్రాయం కలిగివున్నారు- మానవుని చరిత్ర వ్రాయడం ఆరంభమైనప్పటి నుండి మానవుడికి ప్రజాస్వామ్యాన్ని పరిచయం చెయ్యడమే గాకుండా, ఒక దృఢమైన ప్రజాస్వామ్య వ్యవస్థతో కూడిన సమాజాన్ని కూడా స్థాపించి ప్రజాస్వామ్య భావనకు వాస్తవిక రూపం ఇచ్చిన ఏకైక ధర్మం ఇస్లాం మాత్రమే. ఇస్లాం ఆవిర్భావ కాలంలో మానవుడు తన స్పృహ, భావనల రీత్యా నేటి కాలం కంటే పధ్నాలుగు వందల ఏళ్ళు వెనకబడి వున్నాడు. అందుచేత ఆనాడు ఇస్లాం ప్రచారం చేసిన ప్రజాస్వామ్య జీవితంలో, నేటి ప్రజాస్వామ్య వ్యవస్థ కంటే ఎంతో ఎక్కువ ప్రజాస్వామ్య స్పిరిట్ వుండేది. ఈనాటి వికసిత ప్రజాస్వామ్య భావన ప్రకారం, అందులో మెజారిటీ ప్రజల ఆధిక్యతను అంగీకరిస్తూ, యావజ్జాతికి స్వేచ్ఛ, సమానత్వం, సాఫల్యాలకు అవకాశం కల్పించబడింది. కాని ఆచరణ దృష్టితో పరిశీలిస్తే నిజమైన ప్రజాస్వామ్య భావనకు, దాని అసలు లక్ష్యానికి బదులు అనేక లొసుగులతో అధికారంలో ఉండేవారి నిరంకుశ పాలనగా తయారయినట్లు గోచరిస్తుంది నేటి ప్రజాస్వామ్యంలో!"

ఈయన అభిప్రాయంపై ప్రత్యేకించి వ్యాఖ్యానించనవసరం లేదు. కాని ఒక విషయం తప్పక చెప్పాలి. ఇది ఒక అమెరికన్ మేధావి అభిప్రాయం. ఇస్లాంకు పూర్వం మానవ సంస్కృతిపై ధనికులు, అధికారుల ప్రతిబంధకాలు తీవ్రంగా వుండేవన్న విషయం అందరూ ఎరిగినదే. ఆనాడు సమకాలిన ఫిరౌన్లు పేదలను, బలహీనుల్ని తమ బానిసలుగా చేసుకున్నారు. అలాంటి పరిస్థితిలో అణగారిన ప్రజలను ధనికుల, అధికారుల ప్రక్కన నిలబెట్టిన జీవనవ్యవస్థ ఇస్లాం మాత్రమే. రాజులు, మతనాయకులు తమను తాము అధికులుగా భావించి దైవదాసుల్ని నీచదృష్టితో చూసే పరిస్థితిని ఇస్లాం పూర్తిగా రూపుమాపి, ప్రతి మనిషికీ సమాన హోదా ఇవ్వబడే సమాజాన్ని నిర్మించింది. అధికులు, అల్పులన్న తారతమ్యాలను అంతమొందించింది. మత పండితులు, ధర్మకర్తలు మతానికి తొడిగిన మూఢాచార ముసుగుల్ని తొలిగించింది. ఈ

పరిస్థితిని గురించి మన మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ "ది హార్ట్ ఆఫ్ హిందుస్తాన్" అనే పుస్తకం (86, 87 పేజీల)లో ఇలా వ్రాశారు:

"ఇస్లాం ఎలాంటి చిక్కులు, ఇబ్బందులు (మూఢాచారాలు) లేని మతం. అది సహజసిద్ధమైన ధర్మం. దాని నాగరికతా వ్యవస్థలో కులం, జాతి, తెగల వివక్ష లేదు. ఇస్లాం ఏకదైవారాధన, విశ్వమానవ సోదరభావాల విశ్వాసం దృష్ట్యా ప్రపంచంలోని ఎన్నో చీకటి కోణాలలో మేటవేసి వున్న భయంకరమయిన దురాచారాలు, దురలవాట్లను నిర్మూలించింది. కోట్లాది మానవుల జీవిత ప్రమాణాలను మెరుగు పరచింది. అది ఆనాటి జాతులను స్వార్థపరమైన బహుదైవారాధనలు, భూతప్రేతాల పూజలు, శిశుహత్యలు, నరబలులు, చేతబడులు, మంత్రతంత్రాల సుడిగుండం నుంచి కాపాడటంలో తోడ్పడింది."

మహాత్మాగాంధీ మన దేశంలోని సరైన మేధావంతుడైన నాయకుడు, గొప్ప ఆలోచనాపరుడు. మహనీయ ముహమ్మద్ (సల్లం) జీవిత చరిత్ర గురించి తన అభిప్రాయం వెలిబుచ్చుతూ ఇలా అన్నారు:

"పాశ్చాత్య దేశాల (యూరప్)పై అంధకారం ఆవరించివున్నప్పుడు, తూర్పు దిగ్మండలంపై ధగధగలాడే ఒక నక్షత్రం మెరిసింది. అది యావత్ ప్రపంచాన్ని ప్రకాశవంతం చేయడమేగాక పీడిత ప్రజలందరికీ సుఖ సంతోషాలు ప్రసాదించింది. ఇస్లాం బూటకపు మతాలుగా చెప్పబడే మతాలవంటి మతం కాదు. హిందువులు ప్రశాంతంగా ఇస్లాంను అధ్యయనం చేస్తే నాలాగే వారు కూడా దాన్ని గౌరవిస్తారనడంలో సందేహం లేదు." (హుదా డైజెస్ట్, జూన్ 70)

ఆర్.ఎస్.ఎస్. వారి ఆంగ్ల వారపత్రిక ఆర్గనైజర్‌లో "ఇస్లాం యొక్క మానసిక ఆకర్షణ" అన్న శీర్షికతో వ్రాయబడిన వ్యాసంలో చీఫ్ ఎడిటర్ కె.ఆర్. మల్కానీ "ఇస్లాంలోని మానవ సమానత్వం" విషయంలో ఇలా తన అభిప్రాయం వెలిబుచ్చారు:

"ఇస్లాంలో మానవ సమానత్వం అనేది కేవలం విశ్వాసపరమైన భావన మాత్రమే కాదు, ది క్రియాత్మకంగా కూడా ప్రపంచంలో సమానత్వం

నెలకొల్పింది. మధ్యయుగాలనాటి యుద్ధాలలో, యుద్ధమైదానానికి దూరంగా ఎటువంటి సైనిక హెడ్‌క్వార్టర్స్ వున్న దాఖలాలు లేవు. ఒక సిపాయి, ఒక సేనాని మౌలికంగా సమానులైన సైనికులవుతారు. ఇద్దరూ కలసి యుద్ధంలో దిగుతారు. ఇటువంటి యుద్ధాలు ప్రాచీన కాలం లోనూ, నేటికీ సమానత్వం ఏర్పరచడానికి ఆధారమవుతాయి."

(ఖుబులె ఇస్లాం నంబర్, అల్ హసనాత్ డైజెస్ట్ 190వ పేజి)

ఒక ప్రశ్న

ప్రముఖ మేధావులు వెలిబుచ్చిన అభిప్రాయాల ద్వారా ఇస్లాం తన నైతికవ్యవస్థతో పాటు ఆర్థిక, రాజకీయ, సామాజిక వ్యవస్థల సమగ్ర రూపాన్ని కూడా అందజేసిందని మనకు తెలిసింది. ఇప్పుడు దాన్ని సామాన్య ప్రజలకు అందజేయడం ప్రశ్నగా మిగిలింది. దీనిని ముస్లింలు ఈనాటి పరిస్థితులల్లో అసాధ్యమని భావిస్తున్నారు. పైగా వివేకరహిత చర్య అని కూడా అంటున్నారు. ఇస్లాంను ఒక ధర్మంగా, సంస్కృతిగా, చట్టంగా, పాలనావ్యవస్థగా ప్రజలకు అందజేయడం పెద్దపులిని కొని తెచ్చుకోవడం కన్నా తక్కువేమీ కాదని వారి భావన. అందుకు ముస్లింల దగ్గర రుజువుగా ఏదైనా ఉందంటే అది వారు ఆఫీసుల్లో, బజారుల్లో, ఉద్యోగాల్లో అన్నిచోట్లా మైనారిటీలో వున్నారన్నదే. ఇలాంటి పరిస్థితులలో ఇస్లాం సందేశం అందజేయడమంటే ఆత్మహత్యా సదృశమేనని వారు భావిస్తున్నారు.

మైనారిటీ సమస్య - ధర్మప్రచారం

కాని, మతం, నైతికతల చరిత్రపై దృష్టిసారిస్తే, మొట్టమొదటి దైవ ప్రవక్త (అలై) నుండి చిట్టచివరి దైవప్రవక్త (స) వరకు వారి అనుయాయులైన ముస్లింలు అల్పసంఖ్యాకులుగానే వున్నారు. వారి పట్ల ఎల్లప్పుడూ తీవ్ర వ్యతిరేకత వుండేది. అయినా వారు సత్కార్యాల్ని గురించి ప్రచారం చేయడం, దుష్కార్యాల్ని నిరోధించడమే తమ విధ్యుక్త కర్తవ్యమని భావించేవారు. అందువల్ల వారు ధైర్యంతో పని చేశారు తప్ప పరిస్థితులకు తలవంచలేదు. వీరయోధుల్లా పరిస్థితుల దిశను మార్చడానికి, నదీప్రవాహాన్ని మళ్ళించడానికి కృషి చేశారు. ఇస్లాం చరిత్రే తీవ్రమైన కృషి, పోరాటాలతో నిండివుంది.

మన దేశ గతచరిత్రను పరిశీలించండి. విజేతలు, యోధులు, బోధకులు మన దేశానికి వచ్చారు. అప్పుడు వారు కూడ కొందరే వున్నారు. కాని వారి దగ్గర ఉన్నతమైన సద్గుణసంపత్తి, నైతికతా సౌరభం ఉండేవి. దైవదాసుల్ని నరకాగ్ని నుండి కాపాడాలన్న తపన ఉండేది. దేవుడు వారి చిత్తశుద్ధిని మరింత వృద్ధిపరచాడు. ఇస్లాం సందేశం కోసం ఇక్కడి ప్రజల హృదయాలు తెరచుకున్నాయి.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) దైవసందేశాన్ని చాటినప్పుడు అన్ని వైపుల నుండి శత్రువులు నాగుపాముల్లా బుసలు కొడుతూ ఆయన్ని చుట్టు ముట్టారు. అయినప్పటికీ ఆయన అలాంటి విషపూరిత వాతావరణంలోనే ఇరవై మూడేళ్ళ వరకు ఎడతెగని ప్రచారకార్యం నిర్వహించారు. చివరకు ప్రజలలో మార్పు వచ్చింది. ఆయన ఇచ్చిన మధుర సందేశంతో మనుషుల మనస్తత్వం మారిపోయింది. భావనాజగత్తులో సంచలనం రేగింది. ఆలోచనా దృక్పథం కొత్తపుంతలు తొక్కింది. ఆచారాలు, అలవాట్లు, అభిరుచులు నూతనత్వం సంతరించుకున్నాయి. మంచీచెడు, ధర్మాధర్మాల కొలమానాలు మారిపోయాయి. నైతిక విలువలకు నూతన జవసత్వాలు వచ్చాయి. రాజ్యాంగం, చట్టాల రూపురేఖలు మారిపోయాయి. దాంతో సమాజంలో అల్లర్లు, అలజడులు, అరాచకం, అల్లకల్లోలాలు సమూలంగా సమసి పోయాయి.

చరిత్రలో ఇలాంటి ఎన్నో ఉదాహరణలు చూపవచ్చు. ఇస్లాం ధ్వజ వాహకులు ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మలచుకొని అనేక దేశాల పరిస్థితుల స్వరూపాన్నే మార్చివేశారు. మక్కాలో అవిశ్వాసుల పోరు పడలేక కొందరు ముస్లింలు దైవప్రవక్త (సల్లం) అనుమతితో అబిసీనియాకు వలసపోయిన సంఘటన చూడండి. అప్పుడు వారికి పాదాలు నిలదొక్కుకునే చిన్న భూభాగంగాని, తలదాచుకునే చిన్న గూడుగాని లేదు. ఇస్లాంపట్ల అచంచల విశ్వాసం, అనన్య ధైర్యసాహసాలతో పాటు దైవసహాయం కారణం గానే వారు పరదేశంలో ప్రశాంతంగా ఉండగలిగారు. వారిని పట్టుకుపోవడానికి విలువైన కానుకల లంచంతో అబిసీనియా వచ్చిన మక్కాఅవిశ్వాసులు ఉత్త చేతులతో వెనుదిరగవలసి వచ్చింది.

- ✶ ఈనాడు ముస్లింల సంఖ్యాబలం ఆనాటి కన్నా అధికంగా వుంది.
- ✶ ప్రసంగాలు చేసే, కరపత్రాలు పంచే స్వేచ్ఛ వుంది.
- ✶ ప్రతి వీధిలో, ప్రతి కూడలిలో, ప్రతి చోటా ధర్మప్రచారం చేయవచ్చు.
- ✶ పత్రికల్లో దైవసందేశం గురించిన వ్యాసాలు ప్రచురింపజేయవచ్చు.
- ✶ ఆ సందేశం ప్రజల శ్రేయోసంక్షేమాలకు హామీనిచ్చేదయి వుండాలి.
- ✶ అది ప్రజల్లోని నిమ్నోన్నతా భావాలను దూరం చేసేదయి వుండాలి.
- ✶ అది నైతిక, న్యాయసూత్రాలను ప్రతిబింబజేసేదయి వుండాలి.
- ✶ అందులో వ్యక్తిగత, సామూహిక జీవితాలకు ఆచరణ సాధ్యమయిన సూత్రాలు వుండాలి.

ప్రస్తుత యుగం - సత్యసందేశం

ఈ ప్రత్యేకతలు ప్రపంచంలోని, ఏ మతం, ఏ వ్యవస్థ, ఏ ఇజమ్ లోనూ కానరావు. ఇవి **లాయిలాహ ఇల్లల్లాహ్, ముహమ్మదు ర్రసూలుల్లాహ్** అనే ప్రాతిపదికపై ఏర్పడ్డాయి. దాని అర్థం, అల్లాహ్ తప్ప మరెవరూ ఆరాధనకు అర్హులు కారు; ముహమ్మద్ (సల్లం) ఆయన పంపిన సందేశహరుడు.

రెండో విషయం, అంతిమ దైవసందేశహరుడైన ముహమ్మద్ (సల్లం) దేవుని ఆదేశాలను, ఆయన ధర్మం గురించిన సందేశాన్ని ప్రజలకు అంద జేశారు. ఆ ధర్మం పేరే ఇస్లాం. ఇది తండ్రులు-తాతల నుండి సంక్రమించే వారసత్వపు సంపద కాదు. ఇస్లాంను అవలంబిస్తే అగ్రవర్ణాలైనా, శూద్రులైనా, రోమన్లయినా, నీగ్రోలైనా, మరెవరైనా సరే దీని విశ్వమానవ సౌభ్రాతృత్వంలో చేరిపోతారు. నల్లవారికి తెల్లవారిపై, అరబ్బుకు అరబ్బేతరునిపై ఎలాంటి ప్రాధాన్యత లేదు. జన్మకారణంగా కూడా ఎలాంటి ప్రాధాన్యత లేదు. గాలి, నీరు, వెల్తురులా ఇస్లాం సార్వజనీనమైన విశ్వమానవ ధర్మం.

ఇలాంటి ధర్మాన్ని గురించి ప్రజలకు పరిచయం చేయడం ముస్లింల విద్యుక్త కర్తవ్యం, గురుతర బాధ్యత. ఈ బాధ్యత గురించి సృష్టికర్త తన గ్రంథం దివ్యఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు:

"విశ్వాసులారా! ఇకనుండి ప్రపంచ మానవులకు మార్గదర్శనం చేస్తూ వారిని సంస్కరించడానికి రంగంలోకి తీసుకురాబడిన శ్రేష్ఠసమాజం మీరే. మీరు మంచిపనులు చేయమని ప్రజలను ఆదేశిస్తారు. చెడుల నుండి వారిస్తారు. దేవుడ్ని ప్రగాఢంగా విశ్వసిస్తారు." (3:110)

మరో చోట ఇలా సెలవియ్యబడింది:

"ఈవిధంగా మేము మిమ్మల్ని మధ్యస్థ సమాజంగా చేశాము. మీరు ప్రపంచ ప్రజలకు సాక్షులుగా ఉండాలని, ప్రవక్త మీకు సాక్షిగా ఉండాలని ఇలా చేశాము." (2:143)

ఈ సూక్తుల్లో ముస్లిం సముదాయాన్ని దేవుడు శ్రేష్ఠసమాజంగా చేశాడని తెలుస్తోంది. ప్రపంచంలో మంచిని వ్యాపింపజేయడం, చెడును నిరోధించడం దాని బాధ్యత. ప్రభుత్వ ఆరోగ్యశాఖ పౌరుల ఆరోగ్యానికి, పరిసరాల పరిశుభ్రతకు ఎలా బాధ్యురాలో; అలా ముస్లింలు కూడా ప్రపంచ ప్రజల ధార్మికతకు, ఆధ్యాత్మికతకు, నైతికతకు బాధ్యత వహించవలసి ఉంటుంది. ముస్లింలు ఈ బాధ్యత నిర్వర్తించకపోతే, దాని దుష్పర్యవసానం పరలోకంలోనే కాదు, ప్రపంచంలో కూడా దైవాగ్రహం రూపంలో వారిపై విరుచుకుపడవచ్చు.

అలాంటి ఉపద్రవం విరుచుకుపడితే దాని బారిన పాపాత్ములు, ధర్మహీనులు, దుర్జనులు, దుర్మార్గులే కాదు; పుణ్యాత్ములు, ధర్మాత్ములు, సజ్జనులు, న్యాయశీలురు కూడా పడతారు.

"మీలో పాపాలు చేసినవారికే పరిమితమయిపోని ఉపద్రవం నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి." (ఖుర్ఆన్-8:25)

ప్రకృతి వైపరీత్యాలు విజృంభించినప్పుడు వాటి ఫలితాలు ఎంత ఘోరంగా వుంటాయో అందరికీ తెలిసిన విషయమే. అలాంటి దుస్థితి దాపురించక ముందే ఏమరుపాటు మత్తు వదలి దైవం తమపై మోపిన ప్రచార బాధ్యతలు నిర్వహిస్తూ ఉండాలని ఈ సూక్తి ముస్లింలను హెచ్చరిస్తోంది.

- సమాప్తం -